# అణుశక్తి విధ్వంసం



## కె. బాలగోపాల్

# అణుశక్తి - విధ్వంసం

కె. బాలగోపాల్

మానవహక్కుల వేదిక ప్రచురణ

## అణుశక్తి - విధ్వంసం

మానవహక్కుల వేదిక ప్రచురణ

**Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య: 43

ప్రచురణ కాలం : అక్టోబర్ 2018

వెల : 60 రూపాయలు

కవర్ : అనంతు

**ముద్రణ :**

అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,

126 శాంతినగర్, హైదరాబాద్ - 28

ఫోన్ : 23391364, 233041941

Email: anupamaprinters@yahoo.co.in

**ప్రతులకు:**

ఎస్. జీవన్ కుమార్

సెల్ : 9848986286

Email: kumjeevan@gmail.com

వి. వసంతలక్ష్మి

ఫోన్ : 040-23537969

Email: vasantha.aj@gmail.com

**నవోదయ, నవ తెలంగాణ, ప్రజాశక్తి, అనేక బుక్‌హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org

బాలగోపాల్ రచనల కోసం : www.balagopal.org

# మా మాట

**భా**రతదేశం అణుబాంబులు తయారు చేయడాన్ని, అణు విద్యుత్ కేంద్రాలు నెలకొల్పడాన్ని, ఆ పేరు మీద యురేనియం తవ్వకాలు జరపడాన్ని... బాలగోపాల్‌గారు తీవ్రంగా వ్యతిరేకించారు. దానికి కారణాలను ఆయన మాటల్లోనే చెప్పాలంటే...

"ప్రకృతిలోని కొన్ని పదార్థాలను ముట్టకుండా ఉంటేనే మంచిది. యురేనియం వాటిలో ఒకటి. అది నేల కింద ఉండిపోవడమే మంచిది. దానిని వెలికితీసి దాని నుండి శక్తిని ఉత్పత్తిచేసే ప్రక్రియలో ప్రాణాంతకమైన ప్రమాదాలు అసలే జరగకుండా కాపాడడం అసాధ్యం. అది అట్లాగుంచి, ఈ క్రమంలో పెరుగుతూ పోయే వ్యర్థపదార్థాల అణుధార్మికత నుండి ప్రాణికి రక్షణ లేదు. ప్రపంచంలోని యురేనియం, యురేనియంగా మార్చగల సకల పదార్థాలు ఖర్చయిపోయిన తరువాత కూడ ఈ వ్యర్థ పదార్థాల చెరువులూ గుట్టలూ మిగిలిపోతాయి. శాశ్వతంగా మిగిలిపోతాయి. వాటిని నిరపాయకరంగా మార్చే మార్గమేదీ లేదు. భూమి వాటిని క్యాన్సర్ కురుపులలాగ తన ఒంటిమీద భరిస్తూ బతకాలి. దాని కంటే యురేనియాన్ని నేల కిందే ఉండనిచ్చి ప్రకృతిని పచ్చగా మిగిల్చే జీవనశైలికీ, ప్రమాణాలకూ మానవ ఆకాంక్షలను పరిమితం చేసి, ఆ స్థితికి అందరినీ తీసుకొచ్చే మానవీయ విధాన రచన చేపట్టడం చాలా ఉత్తమం."

★ ★ ★

'విధ్వంసం' సిరీస్‌లో ఇది నాల్గవది. ఇప్పటిదాక 'అభివృద్ధి–విధ్వంసం' (2015), 'విస్థాపన–విధ్వంసం' (2016), 'సరళీకరణ–విధ్వంసం' (2017) వచ్చాయి. ఇప్పుడు మీ చేతిలో వున్న 'అణుశక్తి–విధ్వంసం' నాల్గవది.

ఈ పుస్తకంలోని మొదటి భాగం వ్యాసాలు మన దేశం అమెరికా అణు ఒప్పందం కుదుర్చుకున్న సందర్భంలో రాసినవి. రెండో భాగంలోని వ్యాసాలు మన రాష్ట్రంలో రెండు చోట్ల యురేనియం తవ్వకాలకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చినపుడు

రాసినవి. నల్లగొండ జిల్లా పెద్దగట్టు దగ్గర తలపెట్టిన యురేనియం తవ్వకాలు ఆ తర్వాత ఏ కారణం చేతో ఆగిపోయాయి. కాని కడప జిల్లా పులివెందుల దగ్గర తలపెట్టిన యురేనియం తవ్వకాలు, శుద్ధి కార్మాగారం ఆ నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి అండతో వెంటనే కార్యరూపం తీసుకున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం తుమ్మలపల్లెలో 2006 సెపెంబర్ 10న ప్రజా విచారణ జరిగినప్పుడు వై.ఎస్. అనుచరులు 'మానవహక్కుల వాళ్ళూ వెళ్ళిపొండి' అని నినాదాలు ఇచ్చి మరీ మా బృందాన్ని అక్కడినుండి వెళ్ళగొట్టారు. ఆ బృందంలో బాలగోపాల్‌గారూ ఉన్నారు. మేము చేసిన నేరమల్లా ఆ ప్రాజెక్టు వచ్చాక ప్రజలకు, అక్కడి భూములకు, పర్యావరణానికి జరగగల నష్టం గురించి ముందుగా వివరించడమే.

పన్నెండేళ్ళు గడిచాక ఆ నష్టం ఏమిటో ఇప్పుడు అక్కడి ప్రజలకే అర్థమైంది. మొదట యురేనియం వ్యర్థ పదార్థాలతో కలుషితమైన నీరు తాగి పశువులు మరణించాయి. తర్వాత చుట్టుపక్కల ఊర్లలో భూగర్భ జలాలు అడుగంటడం మొదలైంది. గత ఏడాది నుండి తోటలు ఎండిపోవడం మొదలైంది. ఈ నష్టం రానురాను పెరుగుతున్నా యురేనియం కార్పొరేషన్ మాత్రం వీటితో తమకు ఏ మాత్రం సంబంధం లేదని బుకాయిస్తూనే ఉంది. ఒకవైపు ఆ మూడు ఊర్ల వారికీ ట్యాంకర్లతో నీళ్ళు సరఫరా చేస్తూ కూడా ఆ ఊర్లలో మంచినీళ్ళు లేకుండా పోవడానికి తాము కారణం కాదని దబాయిస్తోంది. కడప జిల్లా నీళ్ళలోనే యురేనియం పాళ్ళు ఎక్కువని కూడా వాదిస్తోంది. (ఇంకా నయం అక్కడ ప్రజల మెదళ్లలోనే యురేనియం ఉందని అనలేదు.)

ఈ పరిస్థితినంతా బాలగోపాల్‌గారు ముందుగానే ఊహించి ఈ వ్యాసాలలో రాశారు. అయినా ప్రాజెక్టును అడ్డుకోలేకపోయిన నిస్సహాయత అక్కడి ప్రజలది. రేపు శ్రీకాకుళం జిల్లా కొవ్వాడలో కూడా ఇదే పరిస్థితి రావొచ్చు. కేంద్ర ప్రభుత్వం ఒక అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రాన్ని అక్కడ నెలకొల్పడానికి సన్నాహాలు చేస్తోంది. భవిష్యత్‌లో ఈ కేంద్రాల సంఖ్య పెరిగినా పెరగొచ్చు. కాబట్టి అణుశక్తి ప్రమాదాల గురించి అందరం ముందుగానే తెలుసుకుని ఉండడం మంచిది. అందుకు ఈ పుస్తకంలోని వ్యాసాలు ఉపయోగపడతాయని నమ్ముతున్నాం.

**మానవహక్కుల వేదిక**

15 సెప్టెంబరు 2018

# ఇందులో...


1. భారత – అమెరికా ఒప్పందం : ఈ చర్చతో మనకేం పని?................ 7
2. అణు ఒప్పందంలో మనం సంతోషించడానికి ఏముంది? ................ 11
3. ఈ రభస ఎందుకోసం? ...................................................... 15
4. మన్మోహన్ అబద్ధాల వెనుక... ............................................... 19
5. శిశుహంతక అమెరికా పాలకులనెవరు శిక్షిస్తారు? ........................ 41
6. యురేనియంపై సమాచారం లేకుండా 'పబ్లిక్ హియరింగా'! .............. 46
7. పెద్దగట్టు యురేనియం గనులు అవసరమా? వాంఛనీయమా? .......... 50
8. కడప యురేనియం : వై.ఎస్‌కు వరం...ప్రజలకు శాపం.................. 57
9. 'యురేనియం అనర్థాలకు' నివారణ లేదు
ప్రాజెక్టును అడ్డుకోవడమే పరిష్కారం ....................................... 66
10. యురేనియం పర్యావరణ విచారణ మళ్ళీ జరిపించాలి..................... 75

భారత – అమెరికా ఒప్పందం

# ఈ చర్చతో మనకేం పని?

**కొ**త్తగా భారత్ అమెరికాతో చేసుకున్న అణు ఒప్పందం మనకు ప్రయోజనకరమా, నష్టకరమా అన్న చర్చ వేడిగా జరుగుతున్నది. కొందరు ఇటూ, కొందరు అటూ మాట్లాడుతున్నారు. చాలామందికి ఆ ఒప్పందం ఏమిటో అర్థం కావడం సహితం కష్టం కాబట్టి సగటు భారతీయులు అయోమయ స్థితిలో ఉండవచ్చు. ఇది నిజంగా భారతదేశానికి మంచిదా? కాదా? అని ఎట్లా తేల్చుకోవాలో అర్థంకాక దిగులుపడుతూ కూడా ఉండవచ్చు.

అణు సాంకేతిక ప్రక్రియల గురించి కొంత తెలుసుకోనిదే ఈ ఒప్పందంలోని రాజకీయాలు అర్థం కావడం కష్టం. అయితే నేనిప్పుడు ఆ పాఠం చెప్పబోవడం లేదు. ఈ ఒప్పందం భారతదేశానికి ఏమిస్తుంది, ఏమియ్యదు అనేది దాని ప్రధాన ప్రాముఖ్యం కాదని చెప్పదలచుకున్నాను. 'భారతదేశం' అన్న మాటకు కొన్నేళ్ళుగా మారుతూ వస్తున్న అర్థాన్ని వ్యవస్థీకృతం చేయనున్న మొదటి ఉదంతం ఈ ఒప్పందం. అదీ దాని నిజమైన ప్రాముఖ్యం.

భారతదేశం అనేది పచ్చగా, చల్లగా, నీతిగా, న్యాయంగా ఉండాలనేది ఈ దేశంలోని సగటు రాజకీయ జీవి ఆకాంక్షగా ఉంటూ వస్తున్నది. భారతదేశం అన్న భావనకు అది నిర్వచనంగా ఉంటూ

వచ్చింది. మనలో ప్రజాదరణ పొందిన దేశభక్తి గేయాలు – సినిమా పాటలతో సహా – ఆ చిత్రాన్నే కళ్ళముందు ఉంచుతాయి.

దీనితో విభేదించిన ఒకే ఒక సంస్థ ఆర్.ఎస్.ఎస్. భారతదేశం ప్రపంచాన్ని ఏలే అగ్రరాజ్యం కావాలన్నది గోల్వాల్కర్ కల. అప్పట్లో ఆయనతో వేరే ఎవ్వరూ – కాంగ్రెస్ వారు, కమ్యూనిస్టులు, సోషలిస్టులు, పెరియారిస్టులు, అంబేద్కర్‌వాదులు ఎవ్వరూ – అంగీకరించలేదు.

ఇప్పుడు 'భారతదేశం' అనే భావనలో, దాని రూపకల్పనలో గోల్వాల్కర్ యుగం వచ్చింది. బిజెపి – కాంగ్రెస్ ప్రభుత్వాల వరుస పాలనలో అది అవిచ్ఛిన్నంగా ఎదుగుతున్నది. (ఆర్.ఎస్.ఎస్. నిన్న గాక మొన్న కాంగ్రెస్ అనుకూల సంకేతాలు ఊరకే పంపలేదు.) అణుబాంబు తయారు చేసుకున్నాం. ఇంకా ఇంకా తయారు చేసుకునే దాకా అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒడంబడిక (ఎన్.టి.పి.) మీద సంతకం చేయకూడదని నిర్ణయించుకున్నాం. వేరే అన్ని ప్రమాణాలూ పక్కనపెట్టి 8 లేక 10 శాతం పెరుగుదల రేటులోనే అభివృద్ధి స్వర్గం ఉందని నిర్ణయించుకున్నాం. 100 కోట్ల జనాభాలో 70 కోట్లు పోనిచ్చి మిగిలిన 30 కోట్లు అన్ని రకాల అత్యాధునిక వస్తు, సేవా రంగాలలో పెట్టుబడులు పెట్టుకోవడానికి గొప్ప అవకాశం కల్పించే మార్కెట్ అని ప్రచారం చేసుకుంటున్నాం. భద్రతా మండలి సభ్యత్వానికి ఎవరూ అప్లికేషన్ పంపమని అడగకముందే పంపించేసాం. అలవాటు ప్రకారం పైరవీ చేసుకుంటున్నాం.

ఈ కొత్త భారతదేశంతో అందరం మమేకం కాలేము. దాని మంచిని 'మన' మంచి అనీ, దాని చెడును 'మన' చెడు అనీ అనుకోలేము. అది తాను ఒక్కరోజులో అగ్రరాజ్యం కాలేదని ఎరుగును. అగ్రరాజ్యాలను ధిక్కరించి అగ్రరాజ్యం కాలేదని తెలుసును. అప్పుడప్పుడు బెట్టు చేస్తూ, అప్పుడప్పుడు వారి సరసన చేరుతూ మెట్టు మెట్టుగా ఉట్టినెక్కాలని దాని ఆలోచన.

అది అణుబాంబు తయారు చేసుకుంటుంది. అణ్వస్త్ర దేశంగా గుర్తింపు కావాలని కోరుకుంటుంది. కానీ 'బాధ్యత గల' (మెండుగా బాంబులు గల) అణ్వస్త్ర రాజ్యాల లాగా అణు వ్యాప్తి నిరోధక ఒప్పందంపైన తొందరపడి సంతకం చేసేయదు. చేసేస్తే రెండవ శ్రేణి అగ్రరాజ్యంగా ఉండిపోవలసి వస్తుంది. అది తన ఐటి మేధావుల

అవుట్ సోర్సింగ్ మార్కెట్‌నూ, సొంత దేశపు పూలు పండ్ల మార్కెట్‌నూ ఆసరా చేసుకొని ప్రపంచ వాణిజ్య సంస్థ చూపించే ఎగుమతి దిగుమతుల ఆర్థిక స్వర్గం చేరుకోగలనని భావిస్తుంది. అయితే ఆ బాట పట్టగల భారత్ 30 కోట్ల జనాభా గల దేశమేనని గుర్తొచ్చినప్పుడు బీద ఏడుపులు ఏడుస్తుంది.

ఈ కొత్త భారతదేశంతో ఏ విధంగా వ్యవహరించాలో అగ్రరాజ్యాలకు సహితం పాలుపోవటం లేదు. మింగమెతుకు లేదు, మీసాలకు సంపెంగ నూనె కావాలా అని వారు వెక్కిరించగలరు. వెక్కిరిస్తుంటారు కూడ. అయితే 8 శాతం పెరుగుదల రేటు మీద దృష్టి నిలిపి దేశంలో మూడవ వంతు జనాభాను ఆకర్షణీయమైన మార్కెట్‌గా రూపొందించడానికి సిద్ధంగా ఉన్న ఆర్థిక విధానాలు వాళ్ళను ఊరిస్తున్నాయి. 1980 నుండి కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభానికి శాశ్వత పరిష్కారం కాకపోయినా తాత్కాలిక జవాబు ఎక్కువ జనాభా కలిగి 'అభివృద్ధి' బాట పట్టిన మూడవ ప్రపంచ దేశాలలో ఉందని వారికి తెలుసు. కాబట్టి కొత్త రంగులు పులుముకున్న భారత్ గురించి వారు గౌరవంగా మాట్లాడడం అలవరచుకున్నారు. లేని బలాన్ని ప్రదర్శించజూస్తున్న భారత్ గురించి లోలోపల నవ్వుకుంటున్నారేమో గానీ పైకి గంభీర వదనాలు ప్రదర్శిస్తున్నారు. తృణీకరించి దూరం చేసుకోవడం కంటే తమ పంచన చేర్చుకొని తమ నీడలో అగ్రరాజ్య కాంక్ష తీర్చుకోనివ్వడం ఉత్తమం అని భావిస్తున్నారు. అది గ్రహించిన భారత్ అగ్రరాజ్యపు హంగులు ఒక్కొక్కటీ డిమాండ్ చేస్తున్నది. కొన్ని సాధించుకుంటున్నది, కొన్ని చేయి జారిపోయాయని బాధపడుతున్నది.

ఈ కేళిలో భాగంగా చూసినప్పుడే మన్మోహన్ – బుష్‌ల ఒప్పందం అర్థం అవుతుంది. ఒక ఆర్థిక శక్తిగా భారత్ అమెరికాకు ఏక సమయంలో ఆకర్షణ, జుగుప్స కలిగిస్తున్నది. భారత సంతతికి చెందిన ఐటి రంగ నిపుణులు అమెరికా ఆర్థిక పురోగతిలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. అయితే అదంతా బెంగుళూరుకు వచ్చేస్తే తమ గతి ఏంకావాలన్న బెంగ అమెరికాకు పట్టుకుంది. ఇక 8 శాతం అభివృద్ధి రేటు అనే ఇంజన్ తగిలించుకున్న 30 కోట్ల జనాభా మార్కెట్ అమెరికాకు ఎంత ఆకర్షణీయంగా కనిపిస్తుందో చెప్పలేం. అటువంటి భారత్‌ను దూరం ఉంచడం కంటే చేరదీసి అదుపు చేయడం మేలని అమెరికా అనుకుంటున్నది. ఆ భారత్‌కు అణ్వస్త్ర దేశంగా గుర్తింపు కావాలా? అణువ్యాప్తి నిరోధక ఒప్పందంపైన సంతకం

చేయకున్నప్పటికీ అణు సాంకేతిక దిగుమతులూ, వాటి ముడి పదార్థమైన యురేనియం దిగుమతులూ కావాలా? ఇచ్చేద్దాం. బహుళ దేశ ఒడంబడికలంటే అమెరికాకు పెద్దగా గౌరవం లేదు. తనతో ఒప్పందం చేసుకొని తన కనుసన్నలలో మెలుగుతుంటే చాలు. దాదాపు 60 సంవత్సరాలు కమ్యూనిజం అనే బూచిని ప్రధాన శత్రువును చేసుకొని దానిని వ్యతిరేకించే వారితో గుంపులు కట్టిన అమెరికా ఇప్పుడు కమ్యూనిజం స్థానంలో ఇస్లాంను నిలబెట్టి అదే పనిచేస్తున్నది. ఈ ముఠా రాజకీయాలకు కూడా పెద్ద ముస్లిమేతర దేశమైన ఇండియా ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

'ముస్లిమేతర' గుర్తింపు భారత పాలకులకు ఒకప్పుడు నచ్చేది కాదు. ఇండోనేషియా తర్వాత అత్యధికంగా ముస్లింలు ఉన్న దేశం ఇండియాయే అని గతంలో చెప్పుకునే వారు. అయితే ఈ కొత్త భారతదేశానికి 'ముస్లిమేతర' గుర్తింపు పట్ల అభ్యంతరం లేదు. అమెరికాకు చేరువ కావడానికి, అమెరికా తోక పట్టుకుని ఎగబాకడానికి అది పనికొచ్చేటట్టయితే సంతోషం కూడ. అణు ఒప్పందం పేరిట ఇండియా అణ్వస్త్ర హోదాకు సాధికారత కల్పిస్తూ, అణు సాంకేతిక సహాయం చేస్తూ అదే సమయంలో తన పర్యవేక్షణలో ఉంచుకోవాలని అమెరికా ప్రయత్నిస్తుండగా, అమెరికా పర్యవేక్షణలో ఉన్నట్టే ఉంటూ వీలయినంత దాచిపెట్టాలనీ, అన్యమార్గాలకు తలుపులు తీసి ఉంచాలనీ ఇండియా పాలకులు ప్రయత్నిస్తున్నారు. ఈ కేళి మొదటి రౌండ్‌లో ఇండియాదే విజయం అని పాశ్చాత్య పరిశీలకులు – ముఖ్యంగా అణ్వస్త్ర వ్యాప్తి పట్ల నిజంగా వ్యతిరేకత ఉన్నవారు భావిస్తున్నట్టున్నారు. ప్రస్తుతం జరుగుతున్న చర్చ పరిభాషలోకి దీనిని అనువదించుకుంటే ఈ ఒప్పందం వల్ల భారత్‌కే ఎక్కువ లాభం అనేది కనీసం పాశ్చాత్యుల అభిప్రాయం అనిపిస్తుంది.

అయినా ఈ భారత్‌తో నాకూ మీకూ ఎందుకు? దాని ప్రమాణాలతో చరిత్రనూ, రాజకీయాలనూ కొలవడం ఎందుకు? భారత్ అనేది పచ్చగా, చల్లగా, నీతిగా, న్యాయంగా ఉండాలని నమ్మేవారికి ఈ చర్చలో కాదు, దాని వెలుపలే స్థానం.

**ప్రజాతంత్ర వారపత్రిక**

**11 మార్చి 2006**

అణు ఒప్పందంలో

# మనం సంతోషించడానికి ఏముంది?

**భా**రత – అమెరికా అణు ఒప్పందానికి అమెరికా చట్టరూపం చేసినట్టు వార్త.

భారతదేశపు అణు సాంకేతిక రంగానికి చెందిన ప్రముఖులు చాలామంది ఆ ఒప్పందం 'మనకు' నిజంగా మేలు చేస్తుందా అని ఆందోళన చెందినట్టు కూడ వార్త.

ఈ ప్రముఖులే అణుశక్తి వినియోగం పట్ల పర్యావరణవాదులు లేవదీస్తున్న ప్రశ్నలను, సందేహాలను చాలాకాలంగా తొక్కిపెట్టి అణుశక్తిని దేశభక్తికి సమానంచేసి దబాయిస్తున్న వారు కాబట్టి వీరు 'మనకు' అనేది ఎవరినుద్దేశించి అన్న ప్రశ్న వేసుకోకుండా 'మన'వైపు నుండి విషయాన్ని చూడలేం.

1974లో ఇందిరాగాంధీ మొదటిసారి అణువిస్ఫోటన ప్రయోగం చేసినప్పుడు బంద్ చేసిన అణుపరిజ్ఞాన సంబంధాలను రెండవసారి మళ్ళీ అణువిస్ఫోటన ప్రయోగం చేసి నేను సైతం అణ్వస్త్ర దేశాన్నే అని భారత్ విర్రవీగటం మొదలుపెట్టిన తరువాత అమెరికా సడలించడం విచిత్రమే కాబట్టి వారి ఉద్దేశం ఏమిటో కూడ చూడకుండా విషయాన్ని అర్థం చేసుకోలేము.

బాంబులు తయారు చేయకుండా ఉన్న వాళ్ళంతా మంచివాళ్ళు. వాళ్ళతో అమెరికాకు పేచీ లేదు. వాళ్ళు తనతో స్నేహంగా ఉంటే వాళ్ళకవసరమయినప్పుడు వాళ్ళ తరఫున తాను బాంబులు వేయడానికి, లేదా వేస్తానని బెదిరించడానికి అమెరికా

రెడీ. అంతే తప్ప అందరూ స్వతంత్రించి అణుబాంబులు తయారు చేసుకోవడం పద్ధతి కాదు.

ఒకవేళ అణుబాంబు ప్రయోగం చేసినట్లైతే వెంటనే అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒడంబడికపైన సంతకం చేసేయాలి. ఆపైన ఆ దేశం ఏ మేరకు అణ్వస్త్ర రాజ్యంగా ఎదగగలుగుతుందనేది ఆ ఒడంబడికకు లోబడి ఉంటుంది. ఇండియా అణ్వస్త్ర విస్ఫోటనం జరిపి, నేను సైతం అణ్వస్త్ర దేశాన్నేనని ప్రకటించి కూడ ఆ ఒడంబడికపైన సంతకం చేయలేదు. 'నువ్వు అన్ని రకాల బాంబులు తయరుచేసి పెట్టుకొని, నేనొక్కటి తయారు చేయగానే ఇక అక్కడితో ఆపేయాలని ఒత్తిడి పెట్టడం అన్యాయం' అని పది హత్యలు చేసిన రౌడీతో తొలి హత్య చేసిన చిన్న రౌడీలాగ భారత్ అభ్యంతరం చెప్పింది. రౌడీల ప్రపంచంలో ఇది న్యాయమైన తర్కమే.

అణుబాంబు సామర్థ్యాన్ని ప్రదర్శించిన తరువాత అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒడంబడికపైన సంతకం చేయకపోవడం అంటే బరితెగించడం అని అమెరికా అభిప్రాయం. అటువంటి దేశాలను అది అణు సాంకేతిక ప్రపంచం నుండి వెలివేస్తుంది. ఇండియాను అలాగే వెలివేసింది. ఇండియా కాళ్ళబేరానికి రాకపోగా, చూసి చూసి కాషాయాంబరధారుల పాలన రాగానే ఇంకొక్కసారి అణ్వస్త్ర పరీక్ష నిర్వహించి అణ్వస్త్ర వ్యాప్తి ఒడంబడికను వెక్కిరించింది.

అటువంటి భారత్‌పైన ఆంక్షలు (పాక్షికంగానే అయినా) ఎత్తేయడానికి అమెరికా ఇప్పుడు ఎందుకు సిద్ధపడింది? అవేమయినా మనకు మేలు చేసే కారణాలా? అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒడంబడిక అసమానత్వంతో కూడిన ఒప్పందమే అయినప్పటికీ అది బహుళపక్ష ఒడంబడిక. దానికి కట్టుబడి ఉండడం అంటే ఒక రకంగా అంతర్జాతీయ చట్టానికి కట్టుబడి ఉండడం అని అర్థం. అయితే సోవియట్ రష్యా పతనమైన నాటి నుండి అంతర్జాతీయ వ్యవహారాలు, అంతర్జాతీయ వేదికలపైన దేశాలు అనుసరించే విధానాలు అంతర్జాతీయ చట్టానికి లోబడి ఉండాలన్న పట్టింపును అమెరికా పూర్తిగా వదిలిపెట్టింది. అంతకుముందు దానికి కనీసం నామమాత్ర గౌరవమైనా ఇచ్చేది. అన్ని దేశాలు తనతో ద్వైపాక్షిక ఒడంబడికలు చేసుకొని వాటికి కట్టుబడి ఉంటే చాలుననేది అమెరికా ప్రస్తుత వైఖరి. అందుకే భారత్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒడంబడికపైన సంతకం చేయకున్నా, తనతో ద్వైపాక్షిక ఒప్పందం చేసుకోవడానికి

సిద్ధంగా ఉన్న కారణంగా అణుపరిజ్ఞాన సహకారం మీద ఆంక్షలు ఎత్తివేయడానికి అమెరికా సిద్ధపడింది. దీనికి ఇండియా సహకరించడం ద్వారా, అంతర్జాతీయ చట్టాన్ని ధ్వంసం చేసి దాని స్థానంలో తన ఏకపక్ష ఆధిపత్యాన్నే అంతర్జాతీయ నీతిగా నిలబెట్టడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు ఉపకరించినట్టయింది. ఇది మొదటి తప్పిదం. కానీ ఈ ఒప్పందాన్ని అనుమానంగా చూస్తున్న భారత్ అణు సాంకేతిక నిపుణులెవరికీ ఈ తప్పు కనిపించలేదు. భారత పాలకులకు అసలే కనిపించలేదు. అందుకేనేమో, నిన్న మొన్నటిదాకా అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒడంబడికపైన సంతకం చేయడమే ఈ రంగంలో 'బాధ్యతాయుతమైన ప్రవర్తన'గా భావించిన అమెరికా, దానిమీద సంతకం చేయడానికి ససేమిరా అంటూ అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందం మీద సంతకం చేయడానికి సిద్ధపడిన ఇండియాను 'అత్యంత బాధ్యతాయుత ప్రవర్తన కనబరుస్తున్న దేశం'గా గుర్తించింది, పదేపదే ప్రశంసిస్తున్నది.

పోతే, ఒప్పందంలోని వివరాల విషయంలో రెండు దేశాలూ ఎత్తులూ పైఎత్తులూ వేస్తూ చివరికి ఇద్దరికీ సంతోషం కలిగించే సమతుల్యం సాధించినట్టున్నారు. ఇండియాకు ఏం కావాలి? అణ్వస్త్రదేశంగా గుర్తింపు కావాలి. అది అంతర్జాతీయ రాజకీయాలలో మగతనంతో సమానం. అది లభించింది. అమెరికా సాధించిన అణు సాంకేతిక ప్రగతి తనకు అందుబాట్లోకి రావాలి. అదీ లభించింది. అయితే అణ్వస్త్ర సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే సాంకేతిక ప్రక్రియలను మాత్రం అమెరికా దీని నుండి మినహాయించింది. మనవాళ్ళు ఒప్పుకోలేదు. బుష్ ఈ విషయంలో మన పాలకులకు హామీ యిచ్చినట్టున్నాడు గానీ అమెరికా చట్ట సభలు ఒప్పుకోలేదు.

మరి అమెరికాకు ఏం కావాలి? సాధించుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దాచుకోవడం వ్యాపారనీతికి విరుద్ధం. అణుశక్తిని ఇతోధికంగా వాడుకోవడానికి సిద్ధపడుతున్న ఇండియా ఈ విషయంలో పెద్ద మార్కెట్ కాగలదు. అది ఇప్పుడు అమెరికాకు అందుబాట్లోకి వస్తుంది. అన్ని రకాలుగా ఇండియాతో ఆర్థిక లావాదేవీలు పెంచుకోవడం అమెరికాను ఏలుతున్న కార్పొరేట్ కంపెనీలకు ఆకర్షణీయంగా కనిపించే విషయం కాబట్టి భారత పాలకులను ఈ విధంగా మంచి చేసుకోవడం అమెరికా ఆర్థిక నీతి దృష్ట్యా తెలివయిన ఎత్తుగడ. భారత్ ఈ సాంకేతిక విజ్ఞానాన్ని

అణ్వస్త్రాల తయారీ కోసం వాడుకొని చేయిదాటిపోతే? అప్పుడు ఈ ఒప్పందాన్ని తెంపేసుకోవడమే కాక, ప్రపంచంలో వేరే ఏ దేశమూ భారత్‌కు అణు ఎగుమతులు చేయకుండా నిరోధించే అధికారం అమెరికా తన వద్ద ఉంచుకుంది.

అయితే అమెరికాకు ఆర్థిక ప్రయోజనాలను మించిన భద్రతా ప్రయోజనం ఉంది. అది ఇప్పుడు 'ఇస్లామిక్ తీవ్రవాదం'గా తాను గుర్తించే దానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ కూటమిని తయారు చేసే ప్రయత్నంలో ఉంది. భారత్‌ను అందుకు అనువయిన దేశంగా చూస్తున్నది. 'ఇస్లామిక్ తీవ్రవాదాన్ని' ఎదుర్కొంటున్న హిందూ దేశంగా అమెరికా భారత్‌ను చూస్తున్నదని ఇంకా స్పష్టంగా చెప్పవచ్చు. అది మన సెక్యులర్ పాలకులకు అభ్యంతరకరంగా తోచడం లేదు. అమెరికా – ఇండియా అణు సహకార ఒప్పందాన్ని ఆ దేశ చట్టసభల ముందు పెట్టేటప్పుడు 'ఇరాన్ విషయంలో భారత్ అమెరికాకు పూర్తి సహకారాన్ని అందిస్తుంది' అన్న వాక్యాలు కూడ అందులో చేర్చారుగానీ అది మన పాలకులను ఇరకాటంలో పెడుతుందని మేడమ్ రైస్ చేసిన సూచన మేరకు దానిని తొలగించారు. అయితే ఇరాన్ విషయంలో భారత్ వైఖరి ఏమిటి అనేది అమెరికా అధ్యక్షుడు ఆ దేశ చట్టసభలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తుండాలన్న షరతు మాత్రం పెట్టారు.

కాబట్టి 'మనకు' ఏం వచ్చినట్టు ఈ ఒప్పందం నుండి? అణుశక్తి వాడకం మరింత పెరగబోతుంది – విద్యుత్ ఉత్పత్తి కోసం, వేరే పారిశ్రామిక అవసరాల కోసం. ఇది ఏమంత మంచిది కాదు. అమెరికా కళ్ళుగప్పి భారత్ ఈ అవకాశాన్ని అణ్వస్త్ర అభివృద్ధికి కూడ వాడుకునే పక్షంలో భారత పాలకుల చేతిలో అణ్వాయుధాలు పెరుగుతాయి. అదీ ఏమంత మంచిది కాదు. అంతర్జాతీయ రాజకీయాలలో అమెరికా భద్రతా ప్రయోజనాలను పరిరక్షించే ఎత్తుగడలకు భారత్ అనుకూలంగా వ్యవహరించడం జరుగుతుంది. ఇది అస్సలే మంచిది కాదు. మరి మనం – అంటే అణు సాంకేతికరంగ నిపుణులూ, అధికారులూ కాని భారతీయులం ఎందుకు సంతోషించాలి?

**ప్రజాతంత్ర వారపత్రిక**

**10 డిసెంబర్ 2006**

# ఈ రభస ఎందుకోసం?

**జూ**లై 22 నాడు పార్లమెంటులో వోటు ఎటువైపు మొగ్గుతుందనే విషయంలో సందేహం ఉండవచ్చునేమో గానీ అణు ఒప్పందం భవిష్యత్తు గురించి సందేహమేమీ లేదు. ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వం కాకపోతే రేపు బిజెపి ప్రభుత్వం దానిపైన సంతకం చేస్తుంది. మరి ఈ రభస దేనికోసం?

'అణుశక్తి' నిజానికి సంఘ్‌పరివార్ అజెండాయే. 1974లో ఇందిరాగాంధీ అణుబాంబు పరీక్ష నిర్వహించినప్పుడు ఆమెను నిర్ద్వంద్వంగా మెచ్చుకున్నది గోల్వాల్కర్ వారసులే. ఆ తరువాత ఆమె పార్టీ వారు రెండవసారి అణుబాంబు పరీక్ష జరపడానికి అనేక కారణాల వల్ల తటపటాయించారు గానీ అవకాశం రాగానే బిజెపి ప్రభుత్వం ఆ పనిచేసింది.

ఎప్పటికైనా మన పాలకులు తాము ఊహించుకునే శత్రువులందరినీ హడలు గొట్టడానికి కావలసిన అణ్వాయుధాలు కలిగి ఉండాలంటే అమెరికాతో అణు సంబంధాలు అవసరం. కేవలం శాంతియుత అణుశక్తి సంపద పెంచుకోవాలన్నా అవసరమే. ఇంధనం కోసం, సాంకేతిక ప్రక్రియల కోసమే కాదు, పోలీస్ పర్మిషన్ కోసమూ అవసరం. అమెరికా అనుమతి లేకుండా అణు సాంకేతిక సామర్థ్యం కలిగి ఉంటే ఆ దేశం ఎంత చికాకు పెట్టగలదనే దానికి ఇరాన్, ఉత్తర కొరియాలు నిదర్శనం. అయితే అణుశక్తి కోసం అమెరికాతో సాన్నిహిత్యం ఎంత తప్పనిసరో అది అంతగా చిక్కులతో కూడుకున్న విషయం. అణ్వస్త్ర సామర్థ్య వ్యాప్తి తాను మెచ్చిన మేరకే – అంటే తన చెప్పుచేతలలో ఉన్న మేరకే జరగాలన్నది అమెరికా నియమం కాబట్టి అమెరికా ఇతర దేశాల అణ్వస్త్ర ఉత్పత్తి మీదనే కాదు, మొత్తంగా అణుశక్తి రంగంపైననే

నిఘా వేసి ఉంచుతుంది. 'శాంతియుత' వినియోగం ఎప్పుడయినా బాంబుగా మారగలదు కదా! తాను గానీ తన కనుసన్నలలో నడుచుకునే ఐ.ఏ.ఇ.ఏ (International Atomic Energy Agency) వంటి కుహనా అంతర్జాతీయ సంస్థలు గానీ ఈ విషయంలో సంపూర్ణ అధికారం పొందడం అమెరికా విభిన్న దేశాలతో చేసుకుంటున్న '123' ఒప్పందాలలోని ప్రధాన అంశం. పై క్రమంలో ఆయా దేశాలు తమ స్వయం నిర్ణయశక్తినీ సార్వభౌమత్వాన్నీ పూర్తిగా కోల్పోకుండా ఉండడానికి నానాతంటాలు పడుతున్నాయి. ఒక దేశం ఎక్కువ కాపాడుకోగలిగిందనీ, మరొక దేశం తక్కువతో సంతృప్తిపడక తప్పలేదనీ విశ్లేషకులు అంటుంటారు. మన్మోహన్ సింగ్ భారతదేశ సార్వభౌమత్వాన్ని చక్కగా కాపాడాడని ఆయన అభిమానులు అంటుండగా మేమయితే ఇంకా చక్కగా కాపాడే '123' ఒప్పందం చేసుకునే వారమని బిజెపి నాయకులు అంటున్నారు. అమెరికా వారు చెవిలో పువ్వు కలిగి లేరన్నది తెలిసిన విషయమే కాబట్టి వీరికి సాధ్యం కానిది వారికెట్లా సాధ్యం అవుతుందన్న సందేహం రాక మానదు. అయితే గోల్వాల్కర్ ఏం మంత్రాలు చెప్పిపోయాడో మనకు తెలీదు కదా!

కాగా 'సార్వభౌమత్వం' లేక 'స్వయం నిర్ణయాధికారం' అనేది ఏ మేరకు కాపాడుకోగలిగారన్నది '123' ఒప్పందంలో తెలీదు. దానికి అనుబంధంగా రేపు ఐ.ఏ.ఇ.ఏతో చేసుకోబోయే ఒప్పందమే దానికి రుజువు. వాడిన ఇంధనాన్ని రీప్రాసెస్ చేసుకునే అవకాశం, ఏయే అణు సాంకేతిక సంస్థలు ఐ.ఏ.ఇ.ఏ అజమాయిషీ పరిధిలోకి వస్తాయనే విషయం, ఎన్నడయినా అమెరికా ఈ ఒప్పందాన్ని తెంచేసుకుంటే అప్పటికి దిగుమతి చేసుకున్న ప్రక్రియలకు ఇంధనం సరఫరా కొనసాగే సంగతి '123' ఒప్పందంలో తుది రూపం తీసుకోలేదు. వాటిని ఇండియా ఐ.ఏ.ఇ.ఏతో చేసుకోబోయే ఒప్పందానికి వదిలేసారు. అందుకే ఈ ఒప్పందం ముసాయిదాను బయటపెట్టమన్న వామపక్షాల డిమాండ్ చాలా న్యాయమైనది. కానీ ఆ కారణంగానే కేంద్రప్రభుత్వం అది ఎవరూ వినరాని రహస్యం అని బొంకి చర్చలకు బయలుదేరింది.

వామపక్షాల డిమాండ్ న్యాయమైనదే, ప్రజాస్వామికమైనదే అయినప్పటికీ వారు తెగేదాకా లాగడం అమాయకంగా జరిగింది కాదు, సూత్రబద్ధమైన వైఖరి నుండి పుట్టినదీ కాదు. రేపు బలపరీక్షలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఓడిపోయి

మధ్యంతర ఎన్నికలు జరిగాయనుకోండి మళ్ళీ ఈ కూటమి గెలిచినా, ఆ కూటమి గెలిచినా అణు ఒప్పందం జరిగేదే. పరిస్థితులు వేరేగా ఉంటే దీనిని కారణంగా చూపించి వామపక్షాలు బలపరీక్ష దాకా రానిచ్చేవి కావు. కానీ ప్రస్తుత పరిస్థితి ఏమిటంటే మధ్యంతర ఎన్నికలు వచ్చినా రాకున్నా అసలు ఎన్నికలు ఆమడదూరంలోనే ఉన్నాయి. మరొకపక్క ధరలు ఎన్నడూ లేనంతగా పెరిగిపోతున్నాయి. కాంగ్రెస్‌తో చెట్టాపట్టాలు వేసుకొని ఎన్నికలకు వెళ్ళే పరిస్థితి లేదు. ముందే ఒక సూత్రబద్ధమైన కారణం చూపించి కాంగ్రెస్‌కు దూరమయితే పరువుగా ఓట్లు అడగవచ్చు.

ఈ ఎత్తుగడలు అట్లాగుంచితే, అన్ని పార్టీలు, సకల మీడియా సంస్థలు కలిసి ఈ వివాదం చాలా ముఖ్యమైనదని మనకు చెప్తున్నాయి గానీ, భారత ఆర్థిక వ్యవస్థకు అణుశక్తి అవసరం అని నమ్మితేనే ఈ వివాదానికి అర్థం ఉంది. అణుబాంబులే కాదు, 'శాంతియుత' అణుశక్తి కూడ అనవసరం అనీ లేదా అప్రధానం అనీ నమ్మితే అమెరికాతో ఒప్పందమూ అనవసరం, దానికోసం దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టామా అన్న రంధీ అనవసరం. వేగంగా పెరగబోతున్న భారత ఆర్థిక వ్యవస్థకు ఇంధనం చాలా కావాలనీ, అణు ఇంధనమే ఈ అవసరం తీర్చడానికి సరయినదనీ మన్మోహన్‌సింగ్ పదే పదే అంటున్నాడు కానీ ఇప్పటికే చాలామంది విశ్లేషకులు గుర్తించిన వాస్తవం ఏమిటంటే అణు విద్యుత్తు మన ఇంధనం అవసరాలలో 3 శాతం మాత్రమే తీరుస్తున్నది. ఎప్పటికైనా 7 శాతం, మహా అయితే 9 శాతం మాత్రమే తీర్చగలదు. దీనికి మన్మోహన్‌సింగ్‌గానీ ఆయన అభిమానులుగానీ జవాబు చెప్పడం లేదు గానీ, పాశ్చాత్య దేశాలలో ఒకనాడు అణువిద్యుత్తును పర్యావరణ కారణాలరీత్యా త్యజించిన దేశాలు ఇప్పుడు మళ్ళీ అణువిద్యుదుత్పత్తిని చేపడుతున్నాయని మాత్రం ఉత్సాహంగా ప్రచారం చేసుకుంటున్నారు. అది కొంతమేరకు నిజమే కావచ్చునుగానీ దానికి కారణం ఆ దేశాలు గతంలో తాము తప్పుడు నిర్ణయం తీసుకున్నామని విజ్ఞతతో భావించడం వల్ల కాదు; వేగంగా పెరుగుతున్న ఇంధనం వాడకాలు, అదుపు తప్పిన పెట్రోలియం ధరలు, పర్యావరణ కార్బనీకరణ. వీటికి జవాబుగా అయినా జీవనశైలిని మార్చుకోవడానికి ధనిక దేశాలు ఇష్టపడకపోగా మనబోటి దేశాల ధనిక వర్గాలు అదే శైలిని అనుకరించాలని ఉబలాటపడుతున్నాయి. దీర్ఘకాలిక నష్టాల గురించి ఆలోచించే తీరిక లేదని భావించి తక్షణ ప్రయోజనాలకు అన్ని దేశాలూ పెద్ద పీట

వేస్తున్నాయి. ఇందులో సంబరపడడానికి గానీ సంతోషించడానికి గానీ ఏమీ లేదు. అయినప్పటికీ అణుశక్తే మన ఇంధన సమస్యలన్నింటికీ పరిష్కారం అన్న వాదనను ప్రచారంలో పెట్టడానికి మన్మోహన్‌సింగ్, అతని అభిమానులు దీనిని నిస్సంకోచంగా వాడుకుంటున్నారు.

ఈ వాదనను తిరస్కరించి ఇంధన సంక్షోభం పరిష్కారానికి వేరే ఆలోచనలు చాలా చేయవచ్చునని నమ్మేటట్టయితే ఈ చర్చే అనవసరం అని గుర్తిస్తాం. వామపక్ష పార్టీలు అణు ఒప్పందం ప్రక్రియ ప్రజాస్వామికంగా, పారదర్శకంగా ఉండాలని డిమాండ్ చేయడం సరయినదే గానీ అసలు దీని ఆవశ్యకత ఏమిటనే ప్రశ్న వేయకపోవడం గమనార్హం. నందిగ్రాంలో కనిపించిన సత్యమే ఇప్పుడు మరొకసారి కనిపిస్తున్నది. 'అభివృద్ధి' గురించి దేశ పాలక వర్గాలకున్న అభిప్రాయానికీ, వామపక్ష పార్టీల అభిప్రాయానికీ మౌలికమైన తేడా లేదు. తక్కిన చిన్నా చితక పార్టీలకు ఒక సూత్రబద్ధమైన వైఖరే లేదు. ఇక అంబానీలు జిందాల్‌లు నిశ్చితంగా ఎందుకుండరు?

**ప్రజాతంత్ర వారపత్రిక**

**20 జూలై 2008**

# మన్మోహన్ అబద్ధాల వెనుక...

**భా**రత అమెరికా అణు ఒప్పందం కథ ముగింపు కొచ్చింది. మొదట అమెరికాతో ఒప్పందం కుదిరింది. దానికి అణు సరఫరా బృందం ఆమోదం లభించింది. ఇప్పుడిక అమలు కావడమే తరువాయి. సంవత్సరం పైగా నడిచిన ఈ ప్రహసనంలో తొలినాడు విమర్శకులు వ్యక్తంచేసిన అన్ని సందేహాలూ వాస్తవాలేనని ఆఖరి అంకం రుజువు చేసింది. అమెరికా అధ్యక్షుడే గుట్టువిప్పి చెప్పాడు. పెద్దమనిషిలాగ కనిపించే మన్మోహన్ సింగ్ తెలిసీ అబద్ధాలు ఆడగలడని రుజువైంది.

ఈ ఒప్పందం గురించి అనేక వ్యాసాలూ, వ్యాఖ్యలూ ఆంగ్ల పత్రికలలోనే కాక తెలుగు పత్రికలలోనూ వచ్చాయి. చాలా సాంకేతికమైన విశ్లేషణలతోబాటు రాజకీయ విశ్లేషణలూ ప్రచురితం అయ్యాయి. అయితే ఈ విశ్లేషణలూ, వ్యాఖ్యలూ అసలు విషయాన్ని గ్రహించాయా అంటే సందేహమే. జరిగిన, జరుగుతున్న చర్చ నిరుపయోగం అనలేము గానీ దాని కేంద్ర బిందువు వేరేచోట ఉంది.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన పాలకులు వేగంగా పారిశ్రామీకరణ చేపట్టాలని భావించారు. పారిశ్రామీకరణకు శక్తి (ఎనర్జీ) కావాలి. వివిధ ఇంధనాల నుండి శక్తిని ఉత్పత్తి చేయడం దీనికి ఒక మార్గం కాగా, ప్రకృతి సిద్ధంగా దొరికే శక్తిని మానవ అవసరాలకు అనుగుణంగా మలచుకోవడం రెండవ మార్గం. మానవ నాగరికత తలక్రిందులు స్వభావం ఎటువంటిదంటే ఇందులో మొదటి దానిని (ఇంధనాల నుండి శక్తి ఉత్పత్తి చేసుకోవడాన్ని) సంప్రదాయక ప్రక్రియ అనీ, రెండవ దానిని (ప్రకృతి సిద్ధంగా ఉన్న శక్తిని మన అవసరాలకు అనుగుణంగా మలచుకోవడాన్ని) సంప్రదాయేతర (నాన్–కన్వెన్షనల్) ప్రక్రియ అనీ వ్యవహరించడం

జరుగుతున్నది. ఈ పరిభాషలో అణుశక్తి సంప్రదాయ ప్రక్రియ, సౌరశక్తి సంప్రదాయేతర ప్రక్రియ.

బొగ్గు నుండి, జలప్రవాహం నుండి విద్యుత్తు తయారు చేయడం (థర్మల్, హైడెల్ విద్యుత్తు) మన దేశంలో ప్రధాన విద్యుదుత్పత్తి రూపాలుగా ఉన్నాయి. ప్రస్తుతం దేశంలోని విద్యుదుత్పత్తి సంస్థల మొత్తం సామర్థ్యం 1,60,000 మెగావాట్లు కాగా అందులో 26 శాతం జలవిద్యుత్తు, 66 శాతం థర్మల్ విద్యుత్తు. అయితే మొదటి నుండి అణు విద్యుత్తు (అణు విస్ఫోటనం నుండి విడుదలయ్యే శక్తితో తయారయ్యే విద్యుత్తు) మీద మన పాలకులకు మోజు ఉండింది. కొంచెం లోతుగా చూడకపోతే ఈ మోజును అర్థం చేసుకోవడం కష్టం. ఎందుకంటే మన దేశంలో దొరికే యురేనియం చాలా స్వల్పం. ప్రకృతిలో దొరికే ఏకైక అణువిస్ఫోటక పదార్థం యురేనియం (మిగిలిన వాటిని కృత్రిమంగా తయారు చేసుకోవాలి). భారతదేశంలో ఉన్న అన్ని యురేనియం నిల్వలూ బయటకు తీసినా కేవలం 10,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం నెలకొల్పగలుగుతామని అంచనా. అంత తక్కువ యురేనియం ఉన్నప్పుడు అణు విద్యుత్తు మనకు తగినది కాదని వదిలిపెట్టవలసింది పోయి దిగుమతుల ద్వారానూ, కృత్రిమ మార్గాల ద్వారాను అణు విద్యుత్తు ఉత్పత్తిని భారీగా చేపట్టగలం అన్న ఆలోచన మన పాలకులూ, అణుశాస్త్రవేత్తలూ చేస్తూ వచ్చారు. ఆలోచన చేయడమే కాదు, ప్రగల్భాలూ పలికారు. 1987 నాటికి సాలీనా 20,000 మెగావాట్ల విద్యుత్తు అణు విద్యుత్తు రూపంలో చేయబోతామని అణుశక్తి పితామహుడిగా పేరు పొందిన హోమీభాభా 1962లో ప్రకటించాడు. కాని 1987 నాటికి సాధించిన అణు విద్యుత్తు సామర్థ్యం 20,000 కాదు, 950 మెగావాట్లు. ఆయన శిష్యుడు విక్రం సారాభాయ్ 2000 నాటికి అణురంగంలో 43,500 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం సాధించబోతాం అని 1969లో అన్నాడు. కాని 2000 నాటికి సాధించిన అణు విద్యుత్ సామర్థ్యం 43,500 కాదు 2700 మెగావాట్లు.

అవాస్తవికమైన ఈ అణుశక్తి మోజును దృష్టిలో పెట్టుకోకపోతే గడిచిన సంవత్సర కాలంలో జరిగిన చాలా పరిణామాలు అర్థం కావడం కష్టం.

జలవిద్యుత్తు, థర్మల్ విద్యుత్తులు కూడా అనేక రకాలుగా సమస్యాత్మకమైనవే. జలవిద్యుత్తుకు ప్రాజెక్టులు కట్టాలి. వాటివల్ల ముంపు, ప్రజల విస్థాపన భారీగా

ఉంటాయి. థర్మల్ విద్యుత్తు విపరీతమైన కాలుష్య కారకం. ముఖ్యంగా, వాతావరణ తాపం క్రమేపీ పెరుగుతుండడానికి కారణమైన కార్బన్ డయాక్సైడ్ వాయువు థర్మల్ ప్లాంట్‌ల నుండి భారీగా విడుదలవుతుంది. అసలు భారీగా ఇంధనాలను, కృత్రిమ శక్తినీ ఉపయోగించే నాగరికత ఎంతవరకు కాంక్షనీయం అన్న ప్రశ్న వేసుకోకుండా ఈ చర్చ పూర్తి కాదు. ఎన్ని సమస్యలున్నా ఇవే ప్రస్తుతం మనకు అందుబాట్లో ఉండే వనరులు. ప్రపంచంలోని మొత్తం బొగ్గు నిల్వలలో 10 శాతం ఇండియాలో ఉందని అంచనా. జలవిద్యుత్తు మాటకొస్తే మన దేశంలోని జలప్రవాహాలు అందియ్యగల విద్యుదుత్పత్తి సామర్థ్యంలో 17 శాతం ప్రాజెక్టులను మాత్రమే ఇప్పటికి కట్టుకున్నామని అంచనా.

కాగా, 'సంప్రదాయేతర' వనరులతో విద్యుదుత్పత్తి చేపట్టడానికి మనకు మంచి అవకాశం ఉంది. వాయుశక్తి లభ్యతలో మనది ప్రపంచంలో నాలుగో స్థానం అని అంచనా. సౌరశక్తి విషయానికొస్తే, మన దేశంలోని చాలా ప్రాంతాలలో సంవత్సరానికి 300 రోజులు పైగా సూర్యతాపం అందుబాట్లో ఉంటుంది. అయితే ఈ వనరుల వినియోగానికి అవసరమైన పరిశోధనపైన పెట్టిన ఖర్చు చాలా తక్కువ. ఉదాహరణకు 2002-2003 సంవత్సరంలో ఈ సంప్రదాయేతర ఇంధన వనరుల రంగం పైన ప్రభుత్వం పెట్టిన ఖర్చు 473.56 కోట్లు కాగా, అణుశక్తిపైన పెట్టింది 3351.69 కోట్లు. ఇది ఆ ఒక్క సంవత్సరం ప్రత్యేకత కాదు. ప్రతీ సంవత్సరమూ మనకు ఉన్న వనరులపైన పెట్టే ఖర్చు, మనకు లేని యురేనియం వనరులపైన పెట్టే ఖర్చు ఈ నిష్పత్తిలోనే ఉంటున్నది. అంత ఖర్చు పెట్టీ ఇన్నేళ్ళలో (హోమీభాభా, విక్రం సారాభాయి వంటి వారు ఎన్ని ప్రగల్భాలు పలికినా) మనం అణువిద్యుత్తు రంగంలో సాధించిన ఉత్పత్తి సామర్థ్యం 4,150 మెగావాట్లు అయితే, తక్కువ ఖర్చుపెట్టి కూడ గాలి మరలతో విద్యుత్ తయారీలో మనం సాధించిన సామర్థ్యం 5,340 మెగావాట్లు, సౌరశక్తి రంగంలో 2000 మెగావాట్లు. మొత్తం మనకు అందుబాట్లో ఉన్న సంప్రదాయేతర విద్యుత్ వనరులలో మనం కేవలం 7.3 శాతాన్ని మాత్రమే ఇప్పటికి వాడకంలోకి తెచ్చామని అంచనా.

సంప్రదాయేతర వనరుల రంగం మీద ప్రభుత్వం దృష్టి ఎక్కువ పెట్టకపోవడం వల్ల సాంకేతిక ప్రగతి ఆ రంగాలలో అంతంత మాత్రంగానే ఉంది. కాబట్టి వాయు

శక్తి, సౌరశక్తి మొదలైన వనరులతో చేపట్టే విద్యుత్తు ప్రస్తుతానికి ఖరీదైనదిగానే ఉంది. కానీ ఆ రంగంలో పరిశోధనలపైన దృష్టిపెట్టి అణు విభాగానికి కేటాయిస్తున్న నిధులు అటు మళ్ళిస్తే ప్రయోజనం రాగలదు. సౌరశక్తి విషయంలో జరుగుతున్న కొద్దిపాటి పరిశోధన ఇప్పటికే ప్రయోజనాలు ఇస్తున్నది.

మనకు ఉన్న వనరుల మీద దృష్టి పెట్టకుండా లేని దాని కోసం వెంపర్లాడడం వెనుక కనీసం రెండు కారణాలున్నాయి. ఒకటి, అణుశక్తి విద్యుదుత్పత్తి కోసమేకాక బాంబు తయారీకి కూడ ఉపయోగపడుతుంది. మనం శాంతికాముకులమనీ శాంతియుత ప్రయోజనాల కోసమే అణుశక్తి ప్రయోగాలు చేపడుతున్నామనీ ఎంత చెప్పుకున్నా ఈ స్పృహ మన పాలకులకు తొలినాటి నుండీ ఉంది. రెండవది, మనబోటి దేశాలు ఏ రకమైన సాంకేతిక ప్రయోగాలు, పరిశోధన, అభివృద్ధి చేపడతాయనేది సాంకేతిక పరికరాలనూ, విజ్ఞానాన్నీ విక్రయించే పాశ్చాత్య కంపెనీల ఒత్తిడికి బలంగా లోనవుతుంటుంది. గాలిమరల విషయంలోనూ, సౌరశక్తి విషయంలోనూ వారికి ఉండే వాణిజ్య ప్రయోజనాలు తక్కువ. కానీ వారి దగ్గర అమ్ముకోవడానికి యురేనియం ఉంది, అణుశక్తి సాంకేతిక ప్రక్రియలూ, పరికరాలూ ఉన్నాయి. ఆ దేశాలలో అణు ప్రమాదాల భయం వల్ల, కాలుష్యానికి సంబంధించిన అవగాహన వల్ల సైనికేతర ప్రయోజనాలకు అణు ఇంధనాన్ని వినియోగించడం బాగా తగ్గింది. అక్కడ అణు విద్యుత్ రియాక్టర్లు నెలకొల్పడం 1960లలో మొదలై 1980ల మధ్య భాగంలో గరిష్ఠ స్థాయి చేరుకుంది. 1983 – 1987 మధ్య కాలంలో సాలీనా 25 కొత్త అణు రియాక్టర్ల నిర్మాణం జరిగేది. ఇప్పుడు సగటున సంవత్సరానికి 3, 4 మించి నిర్మించడం లేదు. వేగంగా వృద్ధి సాధించాలన్న ఆరాటం ఉన్న మూడవ ప్రపంచ దేశాలలో అణు ప్రమాదాల గురించి అవగాహన, పట్టింపు తక్కువ కావడంతో పాశ్చాత్య కంపెనీల చూపు ఈ దేశాలపైన పడింది. ఈ దేశాల విధాన రచనపైన ఆ ఒత్తిడి అనేక రకాలుగా పనిచేస్తుంది. ఒత్తిడి కంపెనీ నుండే నేరుగా రానవసరం లేదు. శాస్త్ర సాంకేతిక నిపుణుల నిష్పాక్షికమైన సలహాల రూపంలోనూ రాగలదు. ఎందుకంటే అమెరికా వంటి దేశాలలో పెట్టుబడిదారీ కంపెనీలకు శాస్త్ర సాంకేతిక పరిశోధకులతోనూ, పరిశోధనల సంస్థలతోనూ చాలా సన్నిహిత సంబంధాలున్నాయి.

మళ్ళీ వెనక్కి పోదాం. 1950లలో భారత్ అణురియాక్టర్లు నిర్మించే ప్రయత్నం మొదలుపెట్టినప్పుడు దానికి అవసరమైన ఇంధనం, సాంకేతిక పరికరాల దిగుమతులు

సులభంగానే జరిగాయి. భారత్ అణుబాంబు తయారుచేయదన్న నమ్మకంతోపాటు అంతటి సాంకేతిక నేర్పరితనం భారత్‌కు లేదన్న భరోసా కూడ పాశ్చాత్య దేశాలకు ఆనాడు ఉండింది. కాని మన పాలకులు, అణుశాస్త్రవేత్తలు పైన చెప్పినట్టు మొదట్నుండి అణుశక్తికి చాలా ప్రాధాన్యం ఇచ్చారు. యురేనియం మన దేశంలో తక్కువగా దొరుకుతుండడం వల్ల ఒక ప్రత్యామ్నాయ మార్గాన్ని మన అణుశక్తి నిపుణులు ప్రతిపాదించారు. దీనికి 'మూడు దశల అణుశక్తి పథకం' అని పేరు పెట్టారు. పూర్తి సాంకేతిక వివరాలలోకి పోకుండా ఈ మూడు దశల పథకాన్ని గురించి తెలుసుకోవడం అవసరం. ఎందుకంటే ప్రస్తుత వివాదంలో మన దేశ ప్రధాని తెలిసీ అబద్ధం చెప్పిన విషయాలలో దీనికి సంబంధించినది ముఖ్యమైనది.

యురేనియాన్ని రియాక్టర్లలో ఇంధనంగా వాడి విద్యుత్తు ఉత్పత్తి చేయడంతో ఇది మొదలవుతుంది. అయితే ఇంతకు ముందు చెప్పినట్టు, మన దేశంలో దొరికే యురేనియం తక్కువ. ఖనిజం ఉండేది కొన్నిచోట్లే. అదీ పరిమితమైన మోతాదులోనే. అంతేకాక మన దగ్గర దొరికే ఖనిజంలో యురేనియం శాతం చాలా స్వల్పం. ఉదాహరణకు కెనడాలో దొరికే యురేనియం ఖనిజంలో యురేనియం 18 శాతం ఉంటుంది. అంటే వంద టన్నుల ఖనిజం తీస్తే అందులో 18 టన్నుల యురేనియం ఉంటుంది. మన దగ్గర 1,000 టన్నుల ఖనిజంలో 6 టన్నులు మాత్రమే యురేనియం ఉంటుంది. అందువల్ల, యురేనియం మీదనే ఆధారపడేటట్టయితే దిగుమతులు భారీగా చేసుకోవలసి ఉంటుంది. దాని బదులు ఇంకొక మార్గం ఏమిటంటే యురేనియాన్ని ఉపయోగించి విద్యుత్తు ఉత్పత్తి చేయగా మిగిలిన ఇంధనాన్ని (ఇంగ్లీషులో దీనిని స్పెంట్ ఫ్యుయల్ – ఖర్చయిన ఇంధనం అంటున్నారు) రీప్రాసెస్ చేసి ప్లూటోనియం రాబట్టడం. ఇది మూడు దశలలో మొదటి దశ. తరువాత ఆ ప్లూటోనియాన్ని ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లలో ఇంధనంగా వాడి విద్యుత్తు ఉత్పత్తి చేయడం. ఇది రెండవ దశ. ఈ పద్ధతిలో పెద్ద మొత్తంలో విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చును గానీ ఇది చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అంతేకాక ప్రమాదాలకు ఆస్కారం కూడ ఎక్కువ. ఈ రెండు దశలలో కీలకమైనవి రీప్రాసెసింగ్ ప్రక్రియ, ఫాస్ట్‌బ్రీడర్ రియాక్టర్లు. మూడవ దశలో ప్లూటోనియం బదులు థోరియాన్ని ఇంధనంగా వాడాలన్నది ఆలోచన. థోరియం యురేనియం లాగా, ప్లూటోనియం లాగా అణుధార్మిక శక్తిగల పదార్థం కాదు గానీ

దానిని రియాక్టర్‌లో బొంబార్డ్ చేస్తే యురేనియంగానూ ప్లూటోనియంగానూ మారి విద్యుత్ ఉత్పత్తిలో ఇంధనంగా ఉపయోగపడుతుంది. ప్రపంచంలోని థోరియం నిల్వలలో నాలుగవ వంతు ఇండియాలోనే ఉన్నాయి కాబట్టి ఈ మూడు దశల పథకం ద్వారా 21వ శతాబ్దం చివరిదాకా విద్యుత్తు పొందుతూ ఉండవచ్చునన్నది మన దేశ అణుశక్తి సంస్థ వారి ఆలోచన. దీని సాధన కోసం ప్రయత్నాలు 1950ల నుండి చేస్తూనే ఉన్నారు. ప్రతీ సంవత్సరం వేలకోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపులు పొందుతున్నారు. సాధించింది మాత్రం చాలా తక్కువ. ఏ చిన్న సాంకేతిక విజయం సాధించినా తమను తాము గొప్పగా పొగుడుకుంటారు. విషయం సాంకేతికం కాబట్టి పామరులకు అర్థం కాదు. మహానుభావులు ఏదో చేసేస్తున్నారని నమ్ముతుంటారు.

ఇదిలా వుండగా 1974లో మొదటిసారి ఇండియా రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో అణుబాంబు ప్రయోగం చేసింది. కరెంటు ఉత్పత్తి కోసమని చెప్పి అమెరికా నుండి దిగుమతి చేసుకున్న యురేనియాన్ని రీప్రాసెస్ చేయగా వచ్చిన ప్లూటోనియంతోనే ఈ బాంబు పేల్చటం జరిగిందంటారు.

అమెరికాకు కోపం వచ్చింది. అణుబాంబులు పేల్చడం అమెరికాకు అలవాటు లేని పని కాదు కానీ ఇతరులు ఆ పనిచేయడం అమెరికాకు నచ్చదు. పైగా అప్పట్లో ఇండియా ప్రపంచ రాజకీయాలలో అమెరికా కంటే రష్యాకు దగ్గర కాబట్టి అప్పటి నుండి అమెరికా ఇండియాతో అణుశక్తి సంబంధమైన విషయాలలో పూర్తిగా తెగతెంపులు చేసుకుంది. తాను చేసుకుని ఆగిపోలేదు. అణు సాంకేతిక ఎగుమతులు చేయగల 45 దేశాల కూటమిని (న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూపు – ఎన్ఎస్‌జి) 1975లో ఏర్పరచి వారందరి చేత ఇండియాను బహిష్కరింపజేసింది. అప్పటి నుండి భారతదేశపు అణుశక్తి రంగానికి దేశం లోపల ప్రెస్టీజ్ పెరిగింది. ఊరిలోని పెద్ద రౌడీని ధిక్కరించి బతుకుతున్న ఇమేజ్ వచ్చింది. అణుశక్తి రంగంలో మన నిపుణులు ఏం సాధించినా ప్రపంచాన్నంతా ధిక్కరించి సాధించిన విజయంగా దానిని పొగడసాగారు. విఫలమైతే తమను బహిష్కృతులు చేసిన అణుసామర్థ్యం గల దేశాలపైన నింద వేశారు. వెరసి, 50 సంవత్సరాల తరువాత సాధించిందేమిటంటే దేశ విద్యుదుత్పత్తి సామర్థ్యంలో అణు విద్యుత్తును 3 శాతానికి చేర్చడం; 1974లో ఒకసారి, 1998లో రెండవసారి అణుబాంబు ప్రయోగం చేసి పాకిస్తాన్‌ను కూడ అణ్వస్త్ర దేశంగా మార్చడం.

1998లో భారత్ రెండవసారి బాంబు ప్రయోగం చేసే నాటికి పరిస్థితి చాలా మారింది. అమెరికా 20 ఏళ్ళనాడు కోపగించుకున్నంతగా ఇప్పుడు కోపగించుకోలేదు. ఆ పరిస్థితీ లేదు. ఈ రెండు దేశాల మధ్య ఏదో సహజమైన బాంధవ్యం ఉందని రెండు దేశాల బుద్ధిజీవులూ అప్పటికే మాట్లాడసాగారు. కాలం 21వ శతాబ్దంలోకి ప్రవేశించిన తరువాత ఈ వైఖరి బలపడింది. 1974లో ఇండియా బాంబు పేల్చినప్పుడు అణుశక్తి రంగంలో అన్ని సంబంధాలనూ తెంపేసుకున్న అమెరికా, 1998లో ఇండియా రెండవసారి బాంబు పేల్చిన తరువాత ఇండియాతో వ్యూహాత్మక సంబంధాల పెంపుదల గురించి మాట్లాడసాగింది. 2000 సంవత్సరం మార్చి నెలలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఇండియా కొచ్చాడు. అప్పటి ప్రధాని వాజ్‌పేయితో కలిసి అతను ఈ రెండు దేశాలూ శాంతి సాధనలో సహచరులుగా ఉంటాయనీ, ప్రాంతీయ అంతర్జాతీయ భద్రతకు ఉమ్మడిగా బాధ్యత తీసుకుంటాయనీ, ఆసియాలోనూ దానికి వెలుపలా వ్యూహాత్మక సమతుల్యం సాధించేందుకు పరస్పరం సంప్రదించుకుని పనిచేస్తాయనీ ప్రకటించడం జరిగింది. అదే సంవత్సరం, అప్పటికి ప్రతిపక్షంలో ఉన్న రిపబ్లికన్ పార్టీ నాయకుడు జార్జి బుష్ సలహాదారుగా ఉన్న కండోలీజా రైస్, తమ నాయకుడు అధికారంలోకి వస్తే 'ప్రాంతీయ సమతుల్యంలో భారత్ పాత్ర మీద బలంగా దృష్టి పెడతారు' అనింది. 'చైనా తన భవితవ్యాన్ని గురించి ఆలోచించేటప్పుడు భారత్ మీద ఒక కన్నేసి ఉంచుతుంది. అమెరికా కూడ ఆ పనిచేయాలి. భారత్ ఇప్పటికింకా ఒక అగ్రరాజ్యం కాదు. కానీ రేపు కాగలదు' అని కూడ అనింది. అదే పార్టీకి చెందిన ఆష్లి టెల్లిస్ అనే మరొక పెద్దమనిషి 'అమెరికా ఆసియా ఖండంలో తన భౌగోళిక రాజకీయ లక్ష్యాలను సాధించే విషయంలో సీరియస్‌గా ఆలోచిస్తున్నట్టయితే భారత్ వ్యూహాత్మక సామర్థ్యాన్ని పెంచే దిశగా తప్పక కృషి చేయవలసి ఉంటుంది. భారత్ అణ్వస్త్ర సామర్థ్యం, మిసైల్ వ్యవస్థ పెరుగుతున్న చైనా అణ్వస్త్ర శక్తితో పోటీపడగలిగేటట్టు చూడవలసి ఉంటుంది' అన్నాడు.

2004 జనవరిలో భారత అమెరికాల మధ్య 'వ్యూహాత్మక సహచర్యంలో తదుపరి చర్యలు' అనే శీర్షికన ఒక ఒప్పందం జరిగింది. అమెరికా భారత్‌కు పౌర అణుశక్తి రంగంలోను, సైనికేతర వ్యోమ పరిశోధనలోను, మిసైల్ రక్షణ వ్యవస్థ పెంపొందించు కోవడంలోను సహకరిస్తుందని ఈ ఒప్పందం అంటుంది. రాసుకున్న వాక్యాలలో

'సైనికేతర' అన్న ప్రయోగం ఉన్నప్పటికీ దానిని వివరిస్తూ ఒక అమెరికా ప్రభుత్వ అధికారి చెప్పిన మాటలు ఈ ఒప్పందం భావాన్ని స్పష్టం చేస్తాయి. '21వ శతాబ్దంలో భారత్ అగ్రరాజ్యంగా ఎదగడానికి సహకరించడం మా లక్ష్యం. ఈ మాట అంటున్నామంటే దాని భావమేమిటో, ప్రత్యేకించి సైనికపరంగా దాని అర్థం ఏమిటో తెలిసే అంటున్నాం' అని ఆయన వ్యాఖ్యానించాడు.

ఈ ఆలోచనాసరళికి కొనసాగింపు 2005 జూన్ 28 నాడు ఇరు దేశాల ప్రతినిధులు సంతకం చేసిన భారత అమెరికా రక్షణ సంబంధాల ఒప్పందం. భారత్ తన రక్షణ కోసం తీసుకునే చర్యలకు అమెరికా సహకరిస్తుందని, రెండు దేశాలు రక్షణ విషయంలో సంప్రదించుకుంటాయని ఇందులో అన్నారు. బుష్ ప్రభుత్వం తరఫున భారత్‌లో రాయబారిగా ఉండిన రాబర్ట్ బ్లాక్‌విల్ ఈ సందర్భంగా భారత్ తన మిసైల్ (క్షిపణి) సామర్థ్యం పెంపొందించుకోజూస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ 'భారత్ యొక్క క్షిపణి సామర్థ్యాన్ని అదుపుచేయడం ద్వారా ప్రజాతంత్ర భారతంపైన చైనా అణ్వస్త్ర ఆధిక్యతను స్థిరీకరించాలన్న అభిలాష అమెరికాకు ఎందుకు ఉంటుంది?' అని విమర్శకులకు ఎదురు ప్రశ్న వేశాడు.

చివరికి 2005 జూలై 18నాడు మన్మోహన్‌సింగ్, జార్జి బుష్‌లు భారత్‌కు అమెరికా అణుశక్తి సహకారాన్ని పునరుద్ధరించబోతున్నదన్న ప్రకటనను ఉమ్మడిగా చేశారు. ఈ ప్రకటన ప్రకారం అమెరికా 'ఇండియాకు పౌర అణుశక్తి రంగంలో పూర్తి సహకారం అందించడం కోసం' తన చట్టాలనూ, విధానాలనూ మార్చుకుంటుంది. భారత్ తన అణుశక్తి రంగంలోని పౌర, సైనిక విభాగాలను వేరుచేసి పౌర విభాగాన్ని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐ.ఏ.ఇ.ఏ) పర్యవేక్షణకు అప్పగిస్తుంది. దీని పర్యవసానమే '123' ఒప్పందం. ఈ ప్రకటనలో అమెరికా సహకారం పౌర రంగానికే పరిమితం అవుతుందని ఉన్నప్పటికీ, భారత్ ఒకవేళ సైనిక రంగంలో అణు ప్రయోగానికి పాల్పడినట్టయితే ఈ పౌరరంగ సహకారాన్ని అమెరికా ఉపసంహరించుకోవడం జరుగుతుందని కూడ ఉన్నప్పటికీ, పైన చెప్పిన విషయాలను దృష్టిలో ఉంచుకున్నట్టయితే అమెరికా భారత్ నుండి ప్రధానంగా కోరుకుంటున్నది సైనిక సంబంధమైన సహకారమేనని అర్థం అవుతుంది.

విద్యుదుత్పత్తి కోసం అమెరికాతో అణు ఒప్పందం చేసుకుని అణ్వస్త్రాలు తయారుచేసుకునే స్వేచ్ఛను ఇండియా పోగొట్టుకుందని మన దేశంలో చాలామంది ఆందోళన చెందుతున్నారు. బిజెపి వారి విమర్శ ఇదే. అసలు అణ్వస్త్రాలు అవసరమా అన్న సంగతి అటుంచితే ఈ ఆందోళన పూర్తిగా అనవసరం. ఎందుకంటే అసలు విషయం అది కాదు. అమెరికా నుండి మనం పొందబోయే అణు ఇంధనంతోనూ, సాంకేతిక సామగ్రితోనూ మనం బాంబులూ చేసుకోవచ్చు, కరెంటూ ఉత్పత్తి చేసుకోవచ్చు. అమెరికా ఆధిపత్య వ్యూహానికి లోబడి ఉన్నట్టయితే మనం కోల్పోయేది బాంబులు తయారు చేసుకునే స్వేచ్ఛను కాదు, స్వతంత్ర రాజకీయ వ్యక్తిత్వాన్ని. భారత్ అణుబాంబులు చేసుకోకూడదని అమెరికాకేం పట్టింపు లేదు. తన ఆధిపత్య ప్రయోజనాల పరిధిలో ఉండాలే గానీ ఏం చేసినా చూసీ చూడనట్టు పోవడానికి అమెరికాకు అభ్యంతరం ఉండదు. ఈ ఆధిపత్య ప్రయోజనాలది కూడ చైనా విషయంలో ఒక రూపం, పశ్చిమాసియా విషయంలో వేరొక రూపం. పశ్చిమాసియాలోని ముస్లిం సమాజంతో అమెరికా స్వయంకృతమైన వైరం తెచ్చుకుంది. అది పీకకు చుట్టుకునే స్థితి వచ్చేసరికి ప్రత్యక్ష దౌర్జన్యానికి దిగింది. అందుకోసం కూడ ఆసియాలో అమెరికాకు ఒక మిత్రదేశం కావాలి. ఆ పాత్ర సైతం 123 ఒప్పందం ద్వారా ఇండియాకు అప్పగించబడింది. దీనికి సాధనం హైడ్ చట్టం.

ఈ సంగతులు మన పాలకులకు బాగానే తెలుసు. వారికి సమ్మతం కూడ. 'అగ్రరాజ్యం' కావడానికి ఇది మన పాలకులకు దొరికిన అడ్డదారి. 123 ఒప్పందం గురించి జరుగుతున్న చర్చ వెనక ఈ ఆరాటం ఉందని గుర్తించకపోతే చాలా విషయాలు అర్థం కావు.

దేశం వేగంగా అభివృద్ధి చెందాలంటే విద్యుచ్ఛక్తి చాలా కావాలనీ దానికోసం అణుశక్తి కావాలనీ అందువల్ల 1974 నుండి అమలులో ఉన్న నిషేధాన్ని తొలగించుకోవడం తప్పనిసరైందనీ అందుకే అమెరికాతో ఒప్పందం చేసుకున్నామనీ మన్మోహన్ సింగ్ వివరణ ఇచ్చిన సంగతి తెలిసిందే. దేశ విద్యుత్ రంగంలో అణు విద్యుత్తు స్థానం చాలా స్వల్పం కాబట్టి ఇది అర్థరహితమైన వివరణ అన్న అభియోగానికి ప్రభుత్వం జవాబు చెప్పే ప్రయత్నం సైతం చేయలేదు. వేరే ఎవరో ఇచ్చిన గణాంకాలు కాదు, దేశ ప్రణాళికా సంఘం వేసిన అంచనానే తీసుకుని అణు విద్యుత్ ప్రాముఖ్యం

ఏమిటో చూడవచ్చు. 2006-2007 సంవత్సరంలో దేశంలోని విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 1,53,000 మెగావాట్లు కాగా అందులో అణువిద్యుత్తు సామర్థ్యం 4,120 మెగావాట్లు. అంటే 3 శాతం కంటే కూడ తక్కువ. 8 శాతం వృద్ధిరేటును ఊహించుకుని దానికి అవసరమయ్యే విద్యుత్తు ఎంత, అందులో అణువిద్యుత్తు ఎంత ఉండగలదు అన్న అంచనాలు ప్రణాళికా సంఘం వేసింది. 2021-22 నాటికి ఈ లెక్కన 4,25,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం అవసరం అవుతుందనీ, అందులో 29,000 మెగావాట్ల అణువిద్యుత్తు ఉండగలదనీ అంచనా వేసింది. అది మొత్తం విద్యుత్ సామర్థ్యంలో దాదాపు 7 శాతం. 2031-32 నాటికి దేశ విద్యుదుత్పత్తి సామర్థ్యం 7,78,000 మెగావాట్ల స్థాయి అందుకోవలసి ఉంటుందనీ, అందులో 63,000 మెగావాట్ల అణువిద్యుత్తు ఉండగలదనీ ప్రణాళికా సంఘం అంచనా వేసింది. ఇది మొత్తం విద్యుత్ సామర్థ్యంలో 8 శాతం. ఈ లెక్కన దేశ విద్యుత్ అవసరాలలో అణు విద్యుత్తు 10 శాతం చేరుకోవడానికి ఇంకొక 50 సంవత్సరాలు పట్టవచ్చు. ఇంత అప్రధానమైన విషయం గురించి అమెరికాతో ఇతరత్రా చాలా నష్టకరమైన ఒప్పందం ఎందుకు చేసుకున్నట్టు అన్న ప్రశ్నకు మన్మోహన్‌సింగ్ ఇప్పటికీ జవాబు చెప్పలేదు.

ఏ విధంగా నష్టకరం అనేది కొంచెం వివరంగా చెప్పుకోవాలి. అమెరికాకు చెందిన అణుశక్తి చట్టంలోని సెక్షన్ 123 ఇతర దేశాలతో ఆ దేశం ఏర్పరచుకునే అణుశక్తి సంబంధమైన లావాదేవీలను నియంత్రిస్తుంది. అందుకే ఆ సెక్షన్ కింద అమెరికా వివిధ దేశాలతో చేసుకున్న ఒప్పందాలను '123 ఒప్పందాలు' అంటారు. అమెరికా చైనాతోను, జపాన్‌తోను 123 ఒప్పందాలు చేసుకుంది. ఇప్పుడు ఇండియాతోను చేసుకుంది. అయితే ఆ దేశాలతో చేసుకున్న ఒప్పందాలకూ ఇండియాతో చేసుకున్న ఒప్పందానికీ ఉన్న ఒక ముఖ్యమైన తేడా ఏమిటంటే, ఇండియాతో చేసుకున్న ఒప్పందాన్ని ఉభయ దేశాలు తమ ఆంతరంగిక చట్టాలు, నియమాలు, ఒప్పందాలకు లోబడి అమలుచేస్తాయి అని ఒప్పందంలోని ఆర్టికల్ 2.1 అంటుంది. ఈ ఒప్పందంపైన భారత అమెరికా దేశాల ప్రతినిధులు సంతకం చేస్తుండగానే అమెరికా హైడ్ అనే చట్టాన్ని చేసింది. 123 ఒప్పందాన్ని వ్యాఖ్యానిస్తూ మన్మోహన్‌సింగ్ ఇచ్చిన వివరణకు హైడ్ చట్టం భిన్నంగా ఉందనీ, దానికి లోబడి

అమెరికా ఈ ఒప్పందాన్ని అమలు చేసేటట్టయితే మన్మోహన్‌సింగ్ వివరణకు అర్థంలేదనీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి బయటి నుండి మద్దతు ఇస్తున్న వామపక్ష పార్టీలు అభ్యంతరం లేవదీశాయి. దీనికి దేశ ప్రధాని రెండు రకాల జవాబులిచ్చాడు. హైడ్ చట్టం అమెరికా ఆంతరంగిక విషయం కాబట్టి దానితో మనకు నిమిత్తం లేదన్నాడు. మనకు 123 ఒప్పందమే గీటురాయి అన్నాడు. కానీ 123 ఒప్పందంలోనే ఉభయ దేశాలు దానిని తమ ఆంతరంగిక చట్టాలకు లోబడి అమలు చేస్తాయని ఉన్నప్పుడు హైడ్ చట్టం వారి ఆంతరంగిక చట్టం అనడంలో అర్థం ఏమిటి? రెండవ జవాబు ఏమిటంటే జార్జి బుష్ హైడ్ చట్టంలోని ఇబ్బందికరమైన అంశాలు శిరోధార్యం కావని భావిస్తున్నాడని. ఇది మరీ వింత జవాబు. జార్జి బుష్ పదవి ఈ సంవత్సరంతో అయిపోతుంది. ఆ తరువాత వచ్చే అధ్యక్షుడు అట్లాగే ఆలోచిస్తాడని నమ్మకం ఏమిటి?

చాలా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే హైడ్ చట్టాన్ని చదివి 123 ఒప్పందంలోని అస్పష్టమైన అంశాల నిజమైన అర్థాన్ని తద్వారా గ్రహించి ఏ సందేహాలైతే మన దేశంలోని విమర్శకులు లేవదీశారో ఆ సందేహాలన్నీ నిజాలేనన్న సంగతి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి తెలుసుననీ, తాము స్పష్టంగా చెప్పామనీ జార్జి బుష్ చివరి దశలో బహిరంగంగానే అన్నాడు. అంటే మన్మోహన్‌సింగ్ తెలిసీ అబద్ధాలు చెప్పాడని భావించవలసి వస్తుంది.

ఈ విషయాన్ని వివరంగా చూద్దాం.

భారత్ అణుబాంబు ప్రయోగం చేపట్టక ముందు గానీ ఆ తరువాత గానీ అణ్వస్త్రాలకు సంబంధించిన అంతర్జాతీయ ఒడంబడికలపైన సంతకం చేయలేదు. అంటే అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒడంబడిక (ఎన్.పి.టి.) పైన గానీ, సమగ్ర అణుపరీక్ష నిషేధ ఒప్పందం (సి.టి.బి.టి.) పైన గానీ సంతకం చేయలేదు. (వీటి వివరాలకు 36, 37 పేజీలలోని బాక్సులు చూడండి). ఇవి వివక్షపూరితమైన ఒప్పందాలన్న కారణంగా భారత్ వీటిపైన సంతకం చేయలేదు. వీటిపైన సంతకం చేయకపోవడం వల్లనే భారత్‌పైన పెట్టిన అణుశక్తి సంబంధమైన నిషేధం ఎత్తివేయజాలమని అమెరికా అంటూ వచ్చింది కానీ చివరికి సంతకం చేయకుండానే '123 ఒప్పందం' చేసుకుని నిషేధం ఎత్తివేసింది. ఎన్.పి.టి, సి.టి.బి.టిలపైన సంతకం చేయని దేశాలతో సైనికేతర అణుశక్తి రంగ సంబంధాలు సైతం పెట్టుకోవడం జరగదన్న నియమాన్ని అమెరికా

మొట్టమొదటిసారిగా పక్కన పెట్టిందనీ, ఇండియా ప్రాముఖ్యతకు గుర్తింపుగా ఈ పని చేసిందనీ, ఇదొక గొప్ప విజయమనీ మన పాలకులు చెప్పుకుంటున్నారు. ఈ 'గుర్తింపు' వెనక అమెరికాకున్న ప్రయోజనమేమిటో పైన చూశాం. రక్షణ సంబంధమైన వ్యూహాత్మక ప్రయోజనమే కాక ఆర్థిక ప్రయోజనమూ ఉంది. మందకొడి ఎదుగుదలతో సతమతమవుతున్న అమెరికా ఆర్థిక రంగానికి మార్కెట్లు కావాలి. భారతదేశంతో అణుశక్తి వ్యాపార సంబంధాన్ని పునరుద్ధరించడం దానికి ఉపయోగపడుతుంది. కేవలం అణుశక్తి సంబంధమైన మార్కెటే కాదు, అది తిరిగి ప్రాణం పోసుకోవడం వల్ల మొత్తంగానే వాణిజ్యపరమైన సుహృద్భావ వాతావరణం పెరిగి ఆమెరికా పెట్టుబడికి భారత ఆర్థిక రంగంలో మరింతగా ప్రవేశం దొరకగలదు.

123 ఒప్పందం ప్రకారం భారత అణుశక్తి రంగం రెండుగా విభజించ బడుతుంది. ఒకటి సైనిక రంగం, రెండవది పౌరరంగం. మొదటిది అణుబాంబుల రంగం, రెండవది అణువిద్యుత్ రంగం అని స్థూలంగా చెప్పుకోవచ్చు. పునరుద్ధరించ బడిన అణుశక్తి సహకారం పౌరరంగానికే పరిమితం అవుతుంది. అమెరికా తదితర అణు సరఫరా దేశాలు భారత అణుశక్తి వ్యవస్థలోని పౌరరంగానికి మాత్రమే యురేనియం గానీ, సాంకేతిక సామగ్రి వగైరా గానీ అమ్ముతారు. సైనిక రంగంపైన నిషేధం కొనసాగుతుంది. పౌరరంగానికి సరఫరా చేసిన వస్తువులను భారత్ తన సైనిక రంగానికి తరలించకుండా చూసేందుకు పౌర అణుశక్తి రంగంపైన అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐ.ఏ.ఇ.ఏ) పర్యవేక్షణ ఉంటుంది. ఈ ఒప్పందానికి భారత సైనికరంగ అణుశక్తి వ్యవస్థతో ఏ సంబంధం లేనప్పటికీ భారత్ కనుక మరొక అణుబాంబు ప్రయోగిస్తే (దిగుమతి చేసుకున్న యురేనియంతో కాక స్థానిక యురేనియంతోనే తయారు చేసినా) ఈ సహకారం ఆగిపోగలదు. అంటే ఒప్పందం నుండి అమెరికా వైదొలగగలదు.

ఇదీ మొదట మన దేశ ప్రజలకు మన్మోహన్‌సింగ్ చెప్పిన విషయం. ఈ పరిధిలో సంపూర్ణ పౌర అణురంగ సహకారం మనకు లభిస్తుంది అని మన్మోహన్‌సింగ్ అన్నాడు. ప్రత్యేకించి, దేశంలో యురేనియం నిల్వలు తక్కువగా ఉన్న కారణంగా మూడు దశల అణువిద్యుత్ ఉత్పత్తి పథకం ఏదైతే భారత అణుశక్తి శాఖ రూపొందించిందని చెప్పుకుంటున్నామో దానిని పరిపూర్తి చేయడానికి అవసరమైన

## అణువిద్యుత్తు వల్ల పర్యావరణ కార్బనీకరణ తగ్గుతుందా?

*కార్బన్ డై ఆక్సైడ్ వంటి 'గ్రీన్ హౌస్' వాయువుల పరిమాణం వేగంగా పెరుగుతుండడం వల్ల పర్యావరణం క్రమంగా వేడెక్కుతున్నదనీ, దీనివల్ల తీవ్ర దుష్పరిణామాలు ఉండగలవనీ ఇప్పుడు పరిశోధకులు అంటున్నారు. కాబట్టి కార్బనీకరణను తగ్గించడం అవసరం. అందులో సందేహం లేదు. థర్మల్ విద్యుదుత్పత్తి వల్ల కార్బన్ డై ఆక్సైడ్ భారీగా వాతావరణంలో కలుస్తుంది కాబట్టి దాని బదులు అణు విద్యుదుత్పత్తి చేపడితే కార్బనీకరణను తగ్గించవచ్చుననేది అణువిద్యుత్తు మద్దతుదారులు చేస్తున్న వాదనలలో ఒకటి. ఇది వెంటనే ఆకర్షణీయంగా కనిపించినా పరిశీలనకు నిలిచే వాదన కాదు. పర్యావరణంలోని 'గ్రీన్ హౌస్' వాయువులలో 16 నుంచి 30 శాతం వరకు మాత్రమే థర్మల్ విద్యుదుత్పత్తి నుంచి వస్తుంది. ఎక్కువ భాగం పెట్రోలియం ఉత్పత్తులు వాడే వాహనాల నుంచి వస్తుంది. దానిని అణు విద్యుత్తు ఏ రకంగానూ తగ్గించదు. కాగా అణు విద్యుత్తుకు చాలా ప్రోత్సాహం లభించినా దాని ఉత్పత్తి పరిమాణం రెండింతలు కావడానికి 2050 రావాలి. అది రెండింతలు కావడం వల్ల 'గ్రీన్ హౌస్' వాయువులలో వచ్చే తగ్గుదల 5 శాతం మాత్రమే. కానీ ఆ మాత్రం తగ్గుదల సాధించే క్రమంలో 10 లక్షల టన్నుల అణు ధార్మిక స్వభావంగల వ్యర్థ పదార్థాలు అణువిద్యుత్ కేంద్రాల నుంచి వెలికి వస్తాయి. ఒక కాలుష్యం తగ్గించి ఇంకొకటి పెంచి సాధించేదేమిటి?*

సాంకేతిక సహకారానికి తలుపులు తెరుచుకున్నాయన్న అభిప్రాయం కలిగించాడు. అయితే హైడ్ చట్టం చూసిన తరువాత ఇది అవాస్తవం అని తేలింది. మూడు దశల పథకంలో రీప్రాసెసింగ్, ఫాస్ట్ బ్రీడర్ టెక్నాలజీలు ప్రధానమైనవని పైన చెప్పుకున్నాం. ఈ రెండింటికీ అణు ఒప్పందం వర్తించదని హైడ్ చట్టం స్పష్టంగా అంటుంది. ఈ సంగతి అడిగితే హైడ్ చట్టం అమెరికా వారి ఆంతరంగిక చట్టమే తప్ప దానితో మనకు నిమిత్తం లేదని మన్మోహన్‌సింగ్ అన్న సంగతి కూడా పైన చూశాం. దీని అసంబద్ధత అటుంచి, తరువాత జార్జి బుష్ బయటపెట్టిన విషయమేమిటంటే 123 ఒప్పందాన్ని భారత్‌కు వివరించినప్పుడు హైడ్ చట్టంలోని షరతును కూడ స్పష్టంగా చెప్పడం జరిగిందని.

యురేనియం పైన ఆధారపడని ప్రత్యామ్నాయానికి సహకారం పునరుద్ధరించకుండా యురేనియం దిగుమతులను, దానికి అనుబంధమైన సాంకేతిక సామగ్రి దిగుమతులను పునరుద్ధరించడం అంటే అర్థం భారత అణువిద్యుత్ రంగాన్ని దిగుమతులతో శాశ్వతంగా ముడిపెట్టడం. దీని పర్యవసానం అస్థిరత, పరాధీనత, అతి ఖర్చు. ఒకనాడు అణువిద్యుత్తు చాలా చవక అన్న అభిప్రాయం ఉండింది గానీ అది నిజం కాదని తరువాత తేలింది. ముఖ్యంగా, దిగుమతి చేసుకున్న యురేనియం పైన, అణురియాక్టర్లపైన ఆధారపడిన అణు విద్యుదుత్పత్తి చాలా ఖరీదైనది (పక్క బాక్స్ చూడండి).

ఒకవేళ భారత్ అణుబాంబు ప్రయోగించిందని చెప్పి అమెరికా ఈ ఒప్పందాన్ని తెంపుకున్నట్టయితే అప్పటికి దిగుమతి చేసుకున్న రియాక్టర్లకు యురేనియం దొరకక వేలకోట్ల రూపాయలు వృథా అయ్యే ప్రమాదం ఉంది కదా, దీని సంగతేమిటి అని విమర్శకులు ప్రశ్నించినప్పుడు, అటువంటి ప్రమాదమేమీ లేదనీ ఆ రియాక్టర్లకు చివరిదాకా యురేనియం దొరకడానికి కావలసిన ఏర్పాటు చేసుకోవడానికి అమెరికా సహకరిస్తుందని మన్మోహన్‌సింగ్ అన్నాడు. ప్రత్యేకించి, భవిష్యత్ అవసరాల కోసం యురేనియం స్టాక్ పెట్టుకోవచ్చుననీ ఒప్పందం తెగిపోయే స్థితి వస్తే అది ఆదుకుంటుందనీ అన్నాడు. అయితే హైడ్ చట్టం సెక్షన్ 103(బి) (10)లో 'ఎప్పటికప్పుడు నిర్వహణ సంబంధమైన అవసరాల మేరకు మాత్రమే' ఇండియా యురేనియం స్టాక్ పెట్టుకోవచ్చునని చెప్పింది. జార్జి బుష్ కూడ ఇదే అమెరికా ప్రభుత్వం అవగాహన అనీ, దీనిని భారత్‌కు స్పష్టంగానే చెప్పాననీ అన్నాడు. మన్మోహన్‌సింగ్ తెలిసీ అబద్ధమాడారని మరొకసారి రుజువయింది.

హైడ్ చట్టంలోని రాజకీయ షరతు చాలా ముఖ్యమైనది. 123 ఒప్పందం ద్వారా ఇండియాపైన 1974 నుండి అమలులో ఉన్న అణుశక్తి సంబంధమైన నిషేధం పూర్తిగా తొలగిపోయిందని మన్మోహన్‌సింగ్ అంటున్నప్పటికీ అది పూర్తిగా తొలగిపోలేదని హైడ్ చట్టం స్పష్టం చేస్తున్నది. 123 ఒప్పందం ఇచ్చినది షరతులతో కూడిన తొలగింపు మాత్రమే. ఒక షరతును ఇప్పటికే చూశాం. భారత్ మళ్ళీ అణుబాంబు ప్రయోగం నిర్వహించిన పక్షాన నిషేధం తిరిగివస్తుంది. అయితే అంతకంటే ముఖ్యమైనది హైడ్ చట్టంలోని రాజకీయ షరతు. ఎన్.పి.టి పైన సంతకం

## అణు విద్యుత్తే ఖరీదు

అణు విస్ఫోటనం నుండి విద్యుత్తు ఉత్పత్తి చేసే ఆలోచన వచ్చిన కొత్తలో అణువిద్యుత్తు ఎంత చవకగా ఉండబోతుందంటే కరెంటుకు మీటర్లే పెట్టక్కరలేదని – అంటే కరెంటు ఉచితంగా ఇయ్యవచ్చునని – అనుకున్నారు. కేవలం ఇంత కరెంటుకు ఎంత ఇంధనం అవసరం అవుతుందన్న లెక్క ఆధారంగా ఈ నిర్ణయానికి వచ్చారు. ఒక టన్ను యురేనియం ఇచ్చే విద్యుత్తును థర్మల్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేయాలంటే 1 లక్ష టన్నుల బొగ్గు కావాలి కాబట్టి అణువిద్యుత్తు అతి చవక అన్న అభిప్రాయం ఆచరణకు దిగక ముందు కలగడం సహజం. అయితే తరువాత అర్థమయిందేమిటంటే అణు విద్యుదుత్పత్తిలో తక్కిన ఖర్చులన్నీ థర్మల్ కంటే చాలా ఎక్కువ. పెట్టుబడి ఖర్చు, నిర్వహణా ఖర్చు, భద్రతా ఖర్చు అన్నీ ఎక్కువే. వ్యర్థ పదార్థాలను తొలగించడం, ఉత్పత్తి ఆగిపోయిన అణు విద్యుత్ ప్లాంట్‌ను మూసేయడం కూడా చాలా ఖర్చుతో కూడుకున్నవే గానీ వాటిని లెక్కలోకి తీసుకోకుండా కేవలం పెట్టుబడి ఖర్చులు, నిర్వహణ ఖర్చులు, భద్రతకు సంబంధించిన ఖర్చులు తీసుకున్నా అణువిద్యుత్తు చవక కాకపోగా థర్మల్ కంటే ఖరీదైనదనీ, 123 ఒప్పందం ఫలితంగా రేపు భారీగా దిగుమతులపైన ఆధార పడేటట్టయితే ఇంకా ఖరీదైనదనీ నిరూపించవచ్చు. కేంద్ర ప్రభుత్వానికీ, వామపక్ష పార్టీలకూ జరిగిన సంవాదంలో ఇద్దరూ పోటాపోటీగా లెక్కలు వేసి చూపించారు. వామపక్ష పార్టీలు విడివిడిగా ఒక్కొక్క పరిస్థితిలో అణువిద్యుత్ ఖర్చు ఎంత ఉంటుందో చూపించగా ప్రభుత్వం సగటు లెక్కలు చూపించి తక్కువని దబాయించే ప్రయత్నం చేసింది. ఇప్పుడున్న అణువిద్యుత్ కేంద్రాలలో తారాపూర్‌లో ఉత్పత్తి అయ్యే విద్యుత్తు ఖరీదు యూనిట్‌కు రూ. 2.85 అని, కైగాలో రూ. 3.03 అని, కూడంకుళంలో రూ. 3.75 అని చెప్తూ రేపు దిగుమతులపైన ఆధారపడి అణు విద్యుత్తు ఉత్పత్తి చేసేటట్టయితే యూనిట్ రూ. 4.75 కాగలదని వామపక్షాలు వివరంగా చూపించాయి. థర్మల్ విద్యుత్తు మాటకొస్తే బొగ్గుగని దగ్గరే విద్యుదుత్పత్తి కేంద్రం నెలకొల్పినట్టయితే ఇంధనం రవాణా ఖర్చు ఉండదు కాబట్టి యూనిట్ 1 రూపాయి చిల్లరకు ఉత్పత్తి చేసే థర్మల్ కేంద్రాలు కూడ ఉన్నాయి. బొగ్గుగనికి దూరంగా ఉన్నా కూడ థర్మల్ విద్యుత్తు ఖరీదు సగటున రూ. 1.50 కి లోపే ఉంటుంది. థర్మల్ కంటే ఖరీదైన గ్యాస్ ఆధారిత ప్లాంట్లలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తు ఖరీదు రూ. 2.50 నుండి 3.00 మధ్య ఉంటుంది. జలవిద్యుత్తయితే ఇంకా చాలా చవక. చాలా ప్రాజెక్టులు యూనిట్ రూ. 1.00 కి లోపు ఖర్చుతో విద్యుదుత్పత్తి చేస్తున్నాయి. కేరళలోని కొన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులలో యూనిట్ 3 పైసలకు ఉత్పత్తి అవుతుంది.

చేయని భారత్‌తో అమెరికాకు అణు సంబంధమైన సహకారం సాధ్యం కావాలంటే భారత్ ప్రజాతంత్ర రాజ్యంగా కొనసాగాలి. అంతేకాక భారత విదేశాంగ విధానం అమెరికా విదేశాంగ విధానానికి అతికేటట్టు ఉండాలి. ప్రత్యేకించి అణ్వస్త్ర వ్యాప్తిని నివారించడానికి అమెరికా తీసుకునే చర్యలకు అనుకూలంగా ఉండాలి (సెక్షన్ 102 6 బి) అని హైడ్ చట్టం అంటుంది. మామూలు భాషలో చెప్పాలంటే అమెరికాకు అనుకూలం కాని దేశాలు అణుబాంబులు తయారు చేసుకున్నట్టయితే వారిని శిక్షించ డానికి అమెరికా తీసుకునే చర్యలకు భారత్ అనుకూలంగా వ్యవహరించాలి. ప్రత్యేకించి, ఇరాన్ విధ్వంసక ఆయుధాలు ఉత్పత్తి చేయకుండా నిలువరించడానికి అమెరికా తీసుకునే చర్యలలో (ఇరాన్‌ను ఏకాకిని చేయడం, వెలివేయడం, అదుపు చేయడం వగైరా) భారత్ చురుగ్గా పాల్గొనాలని హైడ్ చట్టం 104 జి (2) ఇ(i) లో అంటుంది. ప్రతీ సంవత్సరం అమెరికా అధ్యక్షుడు అమెరికా కాంగ్రెస్‌కు ఈ విషయాలలో భారత్ నడవడిక ఎట్లా ఉంది, అది సరిగ్గా లేని పక్షంలో భారత్‌ను దారికి తీసుకురావడానికి అమెరికా అధ్యక్షుడు ఏం చేశాడు అనేది తెలియచేసే నివేదిక ఇవ్వాలి. భారత్ నడవడిక బాధ్యతాయుతంగా లేకపోతే 123 ఒప్పందం నుంచి అమెరికా వైదొలగగలదు.

అందుకే బాంబులు చేసుకునే స్వేచ్ఛ కోల్పోవటం కాదు, రాజకీయ స్వతంత్రత కోల్పోవడం 123 ఒప్పందంలోని ప్రధాన ప్రమాదం అని పైన అన్నాం. లక్షల కోట్లు ఖర్చుపెట్టి అమెరికా నుంచి రియాక్టర్లు దిగుమతి చేసుకుని అంతే ఖరీదైన అణు సాంకేతిక పరిశోధనా ప్రక్రియను వారి సాంకేతిక రంగంతో ముడిపెట్టిన తరువాత ఇరాన్ విషయంలోనో, సిరియా విషయంలోనో అమెరికా అన్యాయంగా నడుచుకుందని విమర్శించి ఈ సహకారాన్ని అర్థాంతరంగా ముగించడం ఆర్థికంగా మన దేశానికి చాలా నష్టకరం కాగలదు. ఆ భయంతో అమెరికా వికృత చేష్టలన్నిటికీ తల ఊపుతూ ఉండబోతాం.

అయితే ఈ విమర్శ కూడ విషయాన్ని తలక్రిందులుగా చూడడమేనేమో? ఇప్పటికే భారత విదేశాంగ విధానం అమెరికాకు అనుకూలం అయిపోయిందన్న సూచికలు చాలా ఉన్నాయి. అందువల్లే హైడ్ చట్టానికి భయపడకుండా 123 ఒప్పందం పైన సంతకం చేసేశారేమో? అమెరికా అధ్యక్షుడు ఆ దేశ కాంగ్రెస్‌కు ఇచ్చే వార్షిక

నివేదికలో అనుకూలమైన విషయాలేవీ ఉండబోవన్న భరోసా వల్లనే ఆ పని చేసేశారేమో? అమెరికాకు రాజకీయంగా అనుకూలంగా ఉన్నట్టయితే బాంబులు ఎన్ని తయారు చేసుకున్నా ఇబ్బందేమీ ఉండదని తెలుసును కాబట్టే 123 ఒప్పందం వల్ల అణ్వస్త్రాలు తయారు చేసుకునే 'స్వేచ్ఛ' కోల్పోయామన్న విమర్శకు మన పాలకులు జంకడం లేదేమో? ఈ విధంగా చూస్తే 123 ఒప్పందం జరగబోయే దానికి సూచిక కాదు. జరిగిపోయిన దానికి సూచిక.

123 ఒప్పందం పైన చర్చ ఇంకా జరుగుతుండగానే అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐ.ఏ.ఇ.ఏ) మీటింగ్‌లలో ఇండియా రెండుసార్లు ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా ప్రతిపాదించిన తీర్మానాలకు అనుకూలంగా ఓటు వేసింది. మొదటిసారి ఓటు వేసింది 2005 సెప్టెంబర్‌లో. జనవరి 2006లో భారతదేశంలోని అమెరికా రాయబారి డేవిడ్ మల్ఫర్డ్ 'ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇండియా ఓటు వేయని పక్షంలో అమెరికా కాంగ్రెస్ భారత–అమెరికా అణు ఒప్పందాన్ని ఆమోదించదు' అని బహిరంగంగా హెచ్చరించాడు. వెంటనే ఫిబ్రవరి 2006లోనే మనవాళ్ళు మళ్ళీ ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. జూన్ 2006లో జరిగిన భారత–అమెరికా పౌర అణుశక్తి సహకార సమావేశాన్ని ప్రారంభిస్తూ అమెరికా సెనేట్ విదేశ సంబంధాల కమిటీ ఛైర్మన్ అయిన రిబర్డ్ లుగార్, 'ఇండియాతో మెరుగవుతున్న మన సంబంధాల వ్యూహాత్మక ఫలితాన్ని అప్పుడే చూడగలుగుతున్నాం. ఐ.ఏ.ఇ.ఏలో గత సెప్టెంబర్‌లోనూ, ఈ ఫిబ్రవరిలోనూ ఇరాన్ విషయంలో ఇండియా ఓటువేసిన తీరును బట్టి నయా ఢిల్లీ తన సంప్రదాయక విదేశాంగ నీతిని సర్దుబాటు చేసుకోవడానికి సిద్ధంగా ఉందనీ, అంతర్జాతీయ విషయాలలో నిర్మాణాత్మక వైఖరి అనుసరించడానికి సిద్ధంగా ఉందనీ అర్థం అవుతున్నది' అన్నాడు. ఇరాక్ విషయం లోనూ భారత ప్రభుత్వం ఇదే 'నిర్మాణాత్మక' వైఖరి ప్రదర్శించింది, ప్రదర్శిస్తున్నది. సద్దాం హుసేన్ విచారణను ఒక ప్రహసనంగా మార్చి అతనిని ఉరితీసినప్పుడు భారత్ ఖండించలేదు. కేవలం 'విచారం' వ్యక్తం చేసింది. అమెరికా దాడులలో వేలాది నిరాయుధ పౌరులు చనిపోతున్నా భారత్ ఖండించడం లేదు. ఇది అన్యాయం అనడం లేదు. ఇజ్రాయిల్ పాలస్తీనా ప్రజల ఆవాసాలపైన, సిరియాపైన చేసిన దాడుల విషయంలోనూ నోరు మెదపలేదు.

జరిగిపోయిన దానికి సూచిక అయినా, జరగబోయే దానికి సూచిక అయినా ఇది నైతికంగా, రాజకీయంగా, ఆర్థికంగా చాలా అభ్యంతరకరం. దౌర్జన్యమే ఏకైక

## అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒడంబడిక (ఎన్.పి.టి)

*ఈ ఒడంబడిక 1968లో ఉనికిలోకి వచ్చింది. ఇది ఇప్పటికి అయిదు దేశాలనే అణ్వస్త్ర దేశాలుగా గుర్తించింది. ఇవి అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా. తక్కిన దేశాలు అణ్వస్త్రరహిత దేశాలు. ఈ రెండు రకాలను ఒడంబడిక వేరువేరుగా చూస్తుంది. అణ్వస్త్ర రహిత దేశాలు ఎప్పటికీ అణ్వస్త్రాలు పొందకూడదు, తయారు చేసుకోకూడదు. అయితే శాంతియుత అవసరాల కోసం వాడుకోవచ్చు. అణ్వస్త్ర దేశాలు అణ్వస్త్ర రహిత దేశాలకు అణ్వస్త్రాలు ఎగుమతి చేయకూడదు. తమ వరకు ఉంచుకోవచ్చు. పోనీ కాలక్రమంలో వాటిని తగ్గించుకోవాలనైనా ఈ ఒడంబడిక అంటుందా అంటే, 'అణ్వస్త్ర పోటీని త్వరగా నిరోధించడానికీ, అణు నిరాయుధీకరణ నెలకొల్పడానికీ, అంతిమంగా అంతర్జాతీయ పర్యవేక్షణ కింద పూర్తిస్థాయి నిరాయుధీకరణ నెలకొల్పడానికీ చిత్తశుద్ధితో సంప్రదింపులు చేపట్టాలి' అని మాత్రమే ఈ ఒడంబడిక అంటుంది. అందుకే దీనిని వివక్షా పూరితమైన ఒడంబడిక అంటున్నాం. ఒకనాడు ఇండియా ఆ కారణంగానే దీనిపైన సంతకం చేయలేదు.*

*ఈ ఒడంబడికపైన ఇప్పటికి 189 దేశాలు సంతకం చేశాయి. చేయనివి ఇండియా, పాకిస్తాన్, ఇజ్రాయిల్, ఉత్తరకొరియా మాత్రమే. ఈ నాలుగు దేశాలకూ అణ్వస్త్ర సామర్థ్యం ఉంది. వీటిని అణ్వస్త్ర దేశాలుగా గుర్తించినట్టయితే మొదటి అయిదింటితో కలిసి ప్రత్యేక హోదా అనుభవించడానికి వాటికి అభ్యంతరమేమీ ఉండక పోవచ్చు. 123 ఒప్పందం ఫలితంగా భారత్‌కు అణ్వస్త్ర దేశంగా ఇన్నాళ్ళకు గుర్తింపు లభించేసిందని కొందరూ, లేదు లేదని కొందరూ నిరర్థకమైన చర్చ పెట్టుకోవడం చూశాం. అయితే ఆ అయిదు దేశాలు అందుకు సిద్ధంగా లేకపోవడం వల్ల వీరు బయటే ఉండిపోయారు.*

విదేశాంగ నీతిగా గల అమెరికాకు తోకగా మారడం అనైతికం అనే విషయానికి పెద్దగా వివరణ అక్కరలేదు. రాజకీయ విజ్ఞత మాటకొస్తే, మధ్యఆసియా, పశ్చిమాసియా దేశాలన్నిటితోనూ (ఒక్క పాకిస్తాన్‌ను మినహాయిస్తే) మనకెప్పుడూ సత్సంబంధాలు వున్నాయి. ఇరాన్ – ఇరాక్ యుద్ధమప్పుడు కూడ రెండు దేశాలతోనూ మనకున్న సత్సంబంధాలు చెరగలేదు. చైనాతో అప్పుడెప్పుడో చెడిన సంబంధాన్ని గత కొద్ది సంవత్సరాలుగా మెరుగుపరుచుకుంటున్నాం. అటువంటి సమయంలో అమెరికా

## సమగ్ర అణుపరీక్ష నిషేధ ఒప్పందం (సి.టి.బి.టి)

*ఇది 1996లో ఉనికిలోకి వచ్చింది. ఎన్.పి.టి. బాంబులు లేని దేశాలు బాంబులు తయారు చేసుకోకుండా ఆపిందే గానీ బాంబులున్న దేశాలను అదుపు చేయలేదన్న అసంతృప్తి కారణంగా అణ్వస్త్రాలను నిజమైన అర్థంలో అదుపు చేయగల అంతర్జాతీయ ఒడంబడిక కోసం కృషి కొనసాగింది. దాని ఫలితమే సిటిబిటి. ఇది అన్ని రకాల అణుపరీక్షలపైన నిషేధం పెట్టింది. అణుపరీక్షలు చేయకుండా కొత్త అణ్వస్త్రాలు తయారుచేసుకోవడం సాధ్యం కాదు కాబట్టి దీని ఫలితంగా అణ్వస్త్రాల వ్యాప్తి నిలిచిపోతుందన్నది దీనిని రూపొందించిన వారి ఆశ. (అయితే కంప్యూటర్ సిములేషన్ ద్వారా కృత్రిమ అణుపరీక్షలు నిర్వహించడం అసాధ్యమేం కాదు కాబట్టి దీనివల్ల నిజంగా అణుపరీక్షలు ఆగుతాయా అని సందేహం వ్యక్తం చేసిన వారు లేకపోలేదు.)*

*దీనిపైన 178 దేశాలు సంతకం చేశాయి గానీ, అందులో 144 మాత్రమే దానిని ఆమోదించాయి. సంతకం చేసి కూడ ఆమోదించకుండా ఉన్న దేశాలలో అమెరికా ఒకటి. అంటే అమెరికా తన మీద తాను అణుపరీక్షలపై నిషేధం విధించుకోలేదు. ఇండియా, పాకిస్తాన్, ఉత్తర కొరియాలయితే దీనిపైన సంతకమే చేయలేదు.*

ప్రాపకం కోసం వీరందరితోనూ సంబంధాలు చెడగొట్టుకోవడం అత్యంత తెలివితక్కువ తనం. ఆర్థికం మాటకొస్తే పశ్చిమాసియా, మధ్యఆసియా దేశాలలో విస్తారంగా నూనె, సహజవాయు వనరులున్నాయి. అమెరికా నుండి కొనుక్కోగల యురేనియం మనకెంత ఇంధనం ఇస్తుందో తెలియదుగానీ ఈ వనరులు చాలా ఇయ్యగలవు. అయితే వాటిని మనం పొందే ప్రయత్నానికి అమెరికాతో పెట్టుకుంటున్న 'వ్యూహాత్మక సంబంధం' ఆటంకం కాగలదని ఇరాన్ పైప్‌లైన్ ఉదంతం సూచిస్తుంది.

ముగింపుగా మళ్ళీ మొదటికొద్దాం. 1950ల నుండి వేలకోట్ల రూపాయల నిధులు మేస్తున్న భారత అణుశక్తి విధానంలో వాస్తవికత కంటే మార్మికత ఎక్కువ. దానికొక వినూత్న ప్రాతిపదికగా ప్రతిపాదించబడ్డ మూడు దశల పథకం ఏ మాత్రం ఆచరణ సాధ్యమో, ఎప్పుడు ఆచరణ రూపం తీసుకుంటుందో తెలీదుగానీ అది చాలా

ఖరీదైన ప్రక్రియ అనీ, దానిలో అణుధార్మిక కాలుష్య ప్రమాదం చాలా ఇమిడి ఉందనీ మాత్రం తెలుసు. ఇంత డబ్బు సంప్రదాయేతర విద్యుదుత్పత్తి ప్రక్రియలపైన పెట్టి ఉంటే చాలా ఫలితం ఈపాటికి సాధించి ఉందుమనడంలో సందేహం లేదు.

అమెరికాతో చేసుకున్న పౌర అణుశక్తి ఒప్పందం మన ప్రత్యేకతగా చెప్పుకునే ఈ మూడు దశల పథకానికి ఏ విధంగానూ ఉపయోగపడదు. మన దగ్గర లేని యురేనియం దిగుమతుల మీద, ఆ పదార్థం లభ్యమయ్యే దేశాలు తయారుచేసుకున్న సాంకేతిక ప్రక్రియల మీద అది మనల్ని ఆధారపడేట్టు చేస్తుంది. విద్యుదుత్పత్తి ఖరీదును చాలా పెంచుతుంది.

అణు ఒప్పందం కారణంగా భారత్ అణు బాంబులు తయారు చేసుకునే స్వేచ్ఛ కోల్పోయిందనేది ఒక బూటకపు చర్చ. అణుబాంబులు భారత్‌కే కాదు ఎవరికీ అక్కరలేదనేది అటుంచి, అక్కరకు రాని ఆ స్వేచ్ఛను మనం కోల్పోయామనడం అసలు విషయాన్ని చూడ నిరాకరించడం. అమెరికా విధానాలకు అనుకూలంగా ఉన్న దేశాలన్నిటికీ  ఆ 'స్వేచ్ఛ' ఉంటుంది. మన విదేశాంగ నీతి మెట్టుమెట్టుగా అమెరికాకు అనుకూలంగా తయారయింది. అమెరికాతో మనం 'భుజం భుజం కలిపి నడుస్తాం' అని మన్మోహన్‌సింగ్ ప్రకటించేదాకా వచ్చింది. ఈ సత్ప్రవర్తనకు గుర్తింపు గానే అమెరికా ఎన్.పి.టి. పైన, సి.టి.బి.టి. పైన మనం సంతకం చేయకపోయినా అణుశక్తి సహకారాన్ని పునరుద్ధరించింది. ఆ సత్ప్రవర్తన కొనసాగాలన్నదే షరతుగా పెట్టింది. అది ఎట్టి పరిస్థితులలోనూ కొనసాగుతూనే ఉంటుందని మన పాలకులు విశ్వసిస్తున్నారు కాబట్టే 'బాంబులు తయారు చేసుకోలేమేమో' అన్న శంక తెలియజేస్తున్న వారి అజ్ఞానానికి నవ్వుకుంటూ సంతకం చేసేశారు.

వాళ్ళు విద్యుచ్ఛక్తి గురించి మాట్లాడుతున్నారు గానీ ఈ ఒప్పందం నుండి పొందజూస్తున్నది విద్యుచ్ఛక్తి కాదు, అగ్రరాజ్యం హోదా. తనతో ఉంటే ఆ హోదా కల్పిస్తానని అమెరికా చెప్పింది. మనవాళ్ళు సంతోషంగా సై అన్నారు. ప్రపంచంలో కాకపోయినా ఇజ్రాయిల్ లాగా గల్లీలోనైనా అగ్రరాజ్యం కాలేమా అని వారి ఆశ.

నిజమైనా, అబద్ధమైనా విద్యుచ్ఛక్తి గురించి ఒక వాదన చేస్తున్నారు కాబట్టి దానికి జవాబు చెప్పుకొని ముగిద్దాం. మొదటిది, ఇంధనాల వినియోగంలో వృధాను అదుపుచేస్తే మనం ఇంకేమీ విద్యుత్తు ఉత్పత్తి చేయకుండానే చాలా శక్తి (ఎనర్జీ)

పొందవచ్చు. ఒక రూపాయి ఉత్పత్తికి మనం ఖర్చుచేసే శక్తి జపాన్ కంటే మూడున్నర రెట్లు, అమెరికా కంటే ఒకటిన్నర రెట్లు ఎక్కువ అనేది ఒక అంచనా. మనం ఇతర దేశాలతో సమానమైన పొదుపు సాధించినట్టయితే 20 నుండి 30 శాతం శక్తిని అదనంగా పొందగలుగుతామని, అది 30,000 మెగావాట్ల విద్యుత్తుతో సమానమనీ వేరే ఎవరో కాదు, భారత పారిశ్రామిక సమాఖ్యే అంచనా వేసింది. ఈ పొదుపు సాధించడానికి సాంకేతిక దిగుమతులు అవసరమైనా అవి ఉపయోగకరమైన దిగుమతులవుతాయి.

కాగా, మన విధానకర్తలు మాట్లాడుతున్న అభివృద్ధి నిజంగా కాంక్షనీయమా? రెండంకెల వృద్ధిరేటు అభిలషణీయమా? ఈ లక్ష్యాలను దేశం ముందు పెట్టడంలో 20వ శతాబ్దంలో అమెరికా వంటి దేశాలు సాధించిన జీవనశైలిని, జీవన ప్రమాణాలను మనవాళ్ళు లక్ష్యంగా పెట్టుకున్నారన్నది స్పష్టమే. అయితే ఆ జీవనశైలి, ఆ జీవన ప్రమాణం మానవజాతి భవిష్యత్తుకు నమూనా కాదు. ఇంధనాన్ని అంత భారీగా వినియోగించే ఆ జీవనశైలిని ప్రపంచమంతా సాధించజూస్తే ఈ భూమి ఉండదు, ఈ గాలి ఉండదు, ఈ జీవావరణం ఉండదు. దానిని పిరమిడ్లలాగ ఒక చారిత్రక వైపరీత్యంగా భావించి ప్రకృతికీ మనిషికీ సమతుల్యాన్ని నిలబెట్టే జీవనశైలిని వెతుక్కోవాలి. అందుకు తగ్గ అభివృద్ధి నమూనాను రూపొందించుకోవాలి.

అటువంటి జీవనశైలికి ఎంత ఇంధనం అవసరం అవుతుందో చెప్పలేము గానీ చిదంబరం గారు ఆరాటపడుతున్నంతయితే అవసరం కాదు. అది ఎంతైనా దానిలో అణుశక్తికి  స్థానం అసలే ఉండకూడదు. ప్రకృతిలోని కొన్ని పదార్థాలను ముట్టకుండా ఉంటేనే మంచిది. యురేనియం వాటిలో ఒకటి. అది నేల కింద ఉండి పోవడమే మంచిది. దానిని వెలికితీసి దాని నుండి శక్తిని ఉత్పత్తిచేసే ప్రక్రియలో ప్రాణాంతకమైన ప్రమాదాలు అసలే జరగకుండా కాపాడడం అసాధ్యం. అది అట్లాగుంచి, ఈ క్రమంలో పెరుగుతూ పోయే వ్యర్థపదార్థాల అణుధార్మికత నుండి ప్రాణికి రక్షణ లేదు. ప్రపంచంలోని యురేనియం, యురేనియంగా మార్చగల సకల పదార్థాలు ఖర్చయిపోయిన తరువాత కూడ ఈ వ్యర్థ పదార్థాల చెరువులూ గుట్టలూ మిగిలిపోతాయి. శాశ్వతంగా మిగిలిపోతాయి. వాటిని నిరపాయకరంగా మార్చే మార్గమేదీ లేదు. భూమి వాటిని క్యాన్సర్ కురుపులలాగ తన ఒంటిమీద భరిస్తూ

బతకాలి. దాని కంటే యురేనియాన్ని నేల కిందే ఉండనిచ్చి ప్రకృతిని పచ్చగా మిగిల్చే జీవనశైలికీ, ప్రమాణాలకూ మానవ ఆకాంక్షలను పరిమితం చేసి, ఆ స్థితికి అందరినీ తీసుకొచ్చే మానవీయ విధాన రచన చేపట్టడం చాలా ఉత్తమం.

**మానవహక్కుల వేదిక బులెటిన్-9**
**డిసెంబర్ 2008**

★ దాదాపు ఇవే విషయాలతో బాలగోపాల్ మరో మూడు వ్యాసాలు రాశారు.
ఒకటి – '123 ఒప్పందాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి?', మానవహక్కుల వేదిక కరపత్రం, 31 ఆగస్టు 2007; రెండు – 'అభివృద్ధికి అణుశక్తి అవశ్యమా?', ఆంధ్రజ్యోతి, 30 జూలై 2008; మూడు – 'బుష్ చెప్పిన మాటలలో కొత్తదేముంది?', ప్రజాతంత్ర, 16 సెప్టెంబర్ 2008; పునరుక్తి అవుతుందన్న ఉద్దేశంతో వాటిని ఇందులో చేర్చలేదు.

# శిశుహంతక అమెరికా పాలకులనెవరు శిక్షిస్తారు?

కలకత్తా నుండి ప్రచురితమయ్యే ఫ్రాంటియర్ వారపత్రిక ఈ మధ్య ఇరాక్‌పైన అమెరికా 1991 నుండి వివిధ రూపాలలో చేస్తున్న ప్రత్యక్ష, పరోక్ష యుద్ధం వల్ల ఆ దేశంలో వ్యాపించిన క్యాన్సర్ కారకమైన యుద్ధ కాలుష్యాన్ని గురించి భయం గొలిపే సమాచారం ప్రచురించింది.

1990కి పూర్వం అమెరికా ప్రేమపాత్రుడిగా ఉండిన సద్దాం హుసేన్ కువైట్‌పైన యుద్ధం ప్రకటించి అమెరికాకు శత్రువయిన సంగతి తెలిసిందే. అతని పొగరు అణచడానికి అమెరికా 1991లో ఇరాక్‌పైన 43 రోజులపాటు జరిపిన యుద్ధాన్ని గల్ఫ్ యుద్ధం అని మొన్నటిదాకా పిలిచేవారు. ప్రస్తుతం నడుస్తున్న యుద్ధం మొదలయిన తరువాత దానిని మొదటి గల్ఫ్ యుద్ధం అనీ, దీనిని రెండవ గల్ఫ్ యుద్ధమనీ పిలుస్తున్నారు.

మొదటి గల్ఫ్ యుద్ధంలో ఇరాక్‌పైన భయంకరమైన హింసకు పాల్పడింది చాలక అమెరికా ఆ తరువాత ఐక్యరాజ్య సమితి చేత ఆ దేశంపైన తీవ్రమైన ఆంక్షలు పెట్టించింది. చమురు అమ్ముకొని ఇతర అవసరాల్లో అధిక భాగం దిగుమతి చేసుకొని బతికే ఎడారి దేశమైన ఇరాక్ చమురు ఎగుమతులపైన, నిత్యావసర సరుకుల దిగుమతులపైన ఈ ఆంక్షలు పనిచేశాయి. వాటి ఫలితంగా వైద్యసదుపాయం కొరవడి ఏడున్నర లక్షల మంది పిల్లలు ఇరాక్‌లో 1990లలో చనిపోయారన్నది తదుపరి కాలంలో పరిశోధకులు బయటపెట్టిన సత్యం.

ఇది శాంతి కాలంలో జరిగిన హననం. యుద్ధ కాలంలో జరిగిన ప్రాణ నష్టమూ, ఆ యుద్ధంలో అమెరికా ప్రయోగించిన డిప్లీటెడ్ యురేనియం ఆయుధాల ప్రభావం వల్ల తదనంతర కాలంలో జరిగిన ప్రాణ నష్టమూ ఇంతకంటే తక్కువ భయంకరమైనవి ఏమీ కాదు. అక్కడ మొదట ప్రయోగించిన ఈ రకం ఆయుధాలను తరువాత అమెరికా ఆఫ్ఘనిస్తాన్ పైన జరిపిన యుద్ధంలో కూడ ప్రయోగించింది. ఇప్పుడు మళ్ళీ రెండవ గల్ఫ్ యుద్ధం అని పిలవబడుతున్న ఇరాక్ యుద్ధంలో ప్రయోగిస్తున్నది. ఉత్తరకొరియా (ప్రస్తుతానికి) ఈ ఘోరాన్ని తప్పించుకుంది. ఇరాన్, సిరియాలు దానిని త్వరలో రుచి చూడగలవు.

డిప్లీటెడ్ యురేనియం  అణుధార్మిక స్వభావం గల ఒక పదార్థం. దానిని ఆయుధాలలో ఉపయోగించటం అంటే అణుయుద్ధం చేయడమే. అమెరికా  ఆ పేరు పెట్టకుండా పశ్చిమాసియాలో చేస్తున్నది అణుయుద్ధమే. 1945లో అమెరికా జపాన్‌లోని నాగసాకి నగరంపైన వేసిన బాంబుతో సమానమయిన దానిని ఒక 'నాగసాకి బాంబు' అనేటట్టయితే, మొదటి గల్ఫ్‌యుద్ధంలో అమెరికా ఇరాక్‌పైన 83 వేల నాగసాకి బాంబులకు సమానమైన అణుధార్మిక ఆయుధాలను ప్రయోగించింది. మొదటి గల్ఫ్‌యుద్ధాన్నీ, రెండవ గల్ఫ్‌యుద్ధాన్నీ కలుపుకుంటే 4 లక్షల నాగసాకి బాంబులతో సమానమైన అణుధార్మిక ఆయుధాలను ప్రయోగించింది. ఇవి కేవలం సైనికులపైనా వారి స్థావరాలపైనా ప్రయోగించిన ఆయుధాలు కావు. అన్ని రకాల దాడులలోనూ డిప్లీటెడ్ యురేనియం గల ఈ ఆయుధాలను అమెరికా ప్రయోగించింది. అమెరికాకే చెందిన రేడియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ ప్రొఫెసర్ అసఫ్ డ్యూరాకోవిచ్ 2003 సంవత్సరంలో చేసిన ఒక అధ్యయనం ప్రకారం బాగ్దాద్, బస్రా, నజాఫ్ మొదలయిన 10 ప్రధాన ఇరాకీ నగరాల వాతావరణంలో అణుధార్మికత ఉండదగ్గ దానికంటే వందల, వేల రెట్లు ఎక్కువ ఉంది. (వాషింగ్టన్‌లోని జార్జిటవున్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉన్న ఈయనను ఈ నివేదిక ప్రకటించిన తరువాత ఉద్యోగం నుండి తీసేశారు, ఆయన ఇంటిపైన దాడులు చేశారు. చంపుతానని కూడ బెదిరించారు.) 2007లో ఆఫ్ఘనిస్తాన్‌లో జరిగిన పరిశోధనలో ఆ దేశంలోని ప్రధాన  నగరాలైన కాబుల్, జలాలాబాద్‌ల వాతావరణంలో అణుధార్మికత ఉండదగ్గదాని కంటే 400 నుండి 2000 శాతం ఎక్కువ ఉందని తేలింది.

అణుధార్మికత వాతావరణంలో అంతటి అసాధారణ పరిమాణంలో ఉన్నట్లయితే ఏం జరగగలదో వివరించి చెప్పనవసరం లేదు. అది జీవరాశుల శరీరకణాలను మెల్లమెల్లగా తొలిచి వేయగలదు. క్యాన్సర్ వంటి రోగాలు విస్తృతంగా రాగలవు. తల్లి గర్భంలోని పిల్లలు అంగవైకల్యంతో పుట్టగలరు. ఇవ్వాల్టి అణు కాలుష్యం రాబోయే చాలాకాలం పాటు కోలుకోలేని రోగాలకూ అంగ వైకల్యానికీ కారణం కాగలదు. ఇరాక్‌లో ఇప్పటికి ఆరేడు లక్షల మంది పౌరులు ప్రత్యక్ష దాడులలో చనిపోయారన్నది అంచనా కాగా, ఈ అణుకాలుష్యం వల్ల రాబోయే రోజులలో 30 లక్షల మరణాలు సంభవించగలవని బ్రిటన్‌కు చెందిన అటామిక్ ఎనర్జీ అథారిటీ అంచనా వేసింది.

మొదటి గల్ఫ్ యుద్ధం అనంతరం విధించిన ఆంక్షలలాగే ఈ అణుధార్మిక దాడి కూడ చిన్నపిల్లల మీద ఎక్కువ దుష్ప్రభావాన్ని కలగజేస్తుంది. 12 సంవత్సరాల వయసులోపు ఉన్న పిల్లలలో సాధారణంగా కనిపించని క్యాన్సర్ రోగ లక్షణాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి అని బస్రాలోని అతి పెద్ద ప్రభుత్వ ఆస్పత్రి క్యాన్సర్ విభాగం అధిపతి జపాన్‌లో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌లో ప్రకటించాడు. పుడుతున్న పిల్లలు మెదడు, వెన్నెముక, ఇతర కీలక అవయవాలు లేకుండా పుట్టడం, శరీరం లోపల ఉండవలసిన భాగాలు బయట ఉండడం, ఒకే కన్ను ఉండడం, కన్నో ముక్కో ఉండవలసిన చోట పెద్ద గడ్డ ఉండడం – ఇటువంటి వికృత జననాలకు సాక్ష్యంగా అనేక ఫోటోలు ఇరాక్ నుండి వెలువడుతున్నాయి. ఇరాక్ దక్షిణ భాగంలోని ఒక ఆస్పత్రిని అధ్యయనం చేసిన జపాన్ నిపుణుల బృందం ప్రకారం ప్రతీరోజు ఆ ఆస్పత్రికి 600 మంది పిల్లలు వైద్యానికి వస్తారు. అందులో అత్యధిక శాతం అణుధార్మిక రుగ్మతలతో బాధపడుతున్నవారే. మామూలు భాషలో చెప్పాలంటే ఏ రోజయినా క్యాన్సర్ రోగం బారిన పడగలవారే. మరి అమెరికా ప్రభుత్వాన్ని యుద్ధ నేరస్తుడిగానే కాదు, శిశుహంతకుడిగా కూడ ఎందుకు ప్రకటించకూడదు?

ఇతరులకు అన్యాయం చేస్తే అది మనకు అంటకుండా పోదని సాధారణ మానవ నైతికత నమ్ముతుంది. ఈ ఘోరానికి పాల్పడుతున్న అమెరికా సైనిక సిబ్బంది సైతం అణుధార్మికత నుండీ, అది కల్గించే రోగాల నుండీ తప్పించుకోలేక పోతున్నారు. మొదటి గల్ఫ్ యుద్ధం గురించి తరచుగా చేసే ఒక వ్యాఖ్య ఏమిటంటే అమెరికా చేసిన విధ్వంసానికీ, అమెరికా సైన్యం పొందిన ప్రాణ నష్టానికీ పొంతన లేదని.

నేలమీద జరిగే యుద్ధమయితే ఎంతటి బలహీనమైన సైన్యమయినా విజేతకు కొంతయినా నష్టం కలిగించగలుగుతుంది. కానీ 1991 గల్ఫ్ యుద్ధం వాయు యుద్ధం. అమెరికా సైన్యానికి చెందిన బాంబర్ జెట్ విమానాలు ఇరాక్ పౌర ఆవాసాలపైనా, సైనిక స్థావరాల పైనా మీది నుంచి బాంబుల వర్షం కురిపించగా, వాటిని ఎదుర్కొనే వైమానిక శక్తి గానీ మిసైల్స్ గానీ లేని ఇరాక్ మౌనంగా ఆ దాడులను భరించింది. అమెరికా సైనికులు కేవలం 467 మంది చనిపోయారు ఆ యుద్ధంలో.

తక్షణ మరణాల లెక్క తీస్తే ఇది సత్యమే. అయితే తాము కురిపించిన డిప్లీటెడ్ యురేనియం బాంబుల వర్షం నుండి చెలరేగిన అణు ధూళిని వారు కూడ తప్పించుకో లేకపోయారు. ఆనాడు యుద్ధంలో పాల్గొన్న 5,80,400 మంది సైనిక సిబ్బందిలో 11 వేల మంది తరువాత అణుధార్మిక సంబంధమైన రోగాలతో చనిపోయారు. 2000 సంవత్సరం నాటికి 3,25,000 మంది అనారోగ్య కారణాల వల్ల సైన్యం కొలువు నుండి తొలగించబడ్డారు. వారి వీర్య కణాలలోకి అణుధార్మికత ప్రవేశించిన కారణంగా, గల్ఫ్యుద్ధం తరువాత వారికి పుట్టిన పిల్లలలో 67 శాతానికి చిన్నదో, పెద్దదో జనన వైకల్యం ఉందని ఒక పరిశోధన తేల్చింది. అంటే అమెరికా ప్రభుత్వం అరబ్బు శిశువులనూ, పుష్తున్ శిశువులనే కాక తన పిల్లలను సహితం చంపుతున్నది. నిజానికి 'చేసిన పాపం మనకు కూడ అంటకపోద'నే భావనే అమెరికా పౌరులలో పెరుగుతున్న యుద్ధ వ్యతిరేకతకు మూలం. ఇరాకీలను, ఆఫ్ఘన్‌లను ఎందుకు చంపాలి అన్న వాళ్ళు అమెరికాలో లేకపోలేదు గానీ వాళ్ళొక చిన్న మైనారిటీయే. మన యువకులు అక్కడెక్కడో టెర్రరిజాన్ని అంతం చేయడానికో, ప్రజాస్వామ్యాన్ని ఉద్ధరించడానికో ఎందుకు చావాలి అన్నదే ఆ దేశంలో యుద్ధ వ్యతిరేకతకు – అది ఉన్న మేరకు – ప్రధాన కారణం. తమ ప్రభుత్వం హీనజాతుల హననానికి చేస్తున్న యుద్ధం తమ సైనికుల ఆరోగ్యాలపైనే కాక వాళ్ళకు పుట్టబోయే పిల్లలపై కూడ తీవ్ర దుష్ప్రభావం వేయగలదని అమెరికా పౌరులు గ్రహించడమూ దీనికి ఉపయోగ పడవచ్చు.

అన్నింటికంటే ఆగ్రహం కలిగించేది ప్రపంచం నిస్సహాయత. అమెరికా డిప్లీటెడ్ యురేనియంతో తయారైన ఆయుధం గానీ, వేరే ఏదయినా అణుధార్మిక స్వభావం గల ఆయుధం గానీ ప్రయోగించడం ఏయే అంతర్జాతీయ నియమాలకు విరుద్ధమో చెప్పడం అవసరం. ఉండడానికి యుద్ధ నియమాల నుండి అణువ్యాప్తి నిరోధక

నియమాల దాకా చాలానే ఉన్నాయి. కానీ వాటిని అమలు చేయవలసిన ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ మొదలయినవన్నీ అమెరికా ప్రభుత్వం జేబులో ఉన్నప్పుడు ఈ నియమాలను ఏకరువు పెట్టి ఏం ప్రయోజనం? చివరికి, ఎంతో కొంత స్వతంత్రంగా వ్యవహరించే సంప్రదాయం ఉన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ సహితం పైన పేర్కొన్న సమాచారాన్ని బయటపెట్టిన వైద్య నిపుణుల పరిశోధనలు విశ్వసనీయమైనవి కావంటూ ప్రచారం చేస్తుండగా ఇక 'అంతర్జాతీయం' అంటూ ఏం మిగిలింది? ప్రపంచ దేశాల మధ్య న్యాయాన్ని నిలబెట్టడానికి అవకాశం ఎక్కడుంది? శిశు హంతక అమెరికాను నేటి శిశువులే రేపు శిక్షిస్తారని కవితాత్మకంగా ఆశ వ్యక్తం చేయడం తప్ప చేయగలిగింది ఏముంది?

**ప్రజాతంత్ర వారపత్రిక**
**18 ఫిబ్రవరి 2007**

# సమాచారం లేకుండా పబ్లిక్ హియరింగా!

నల్లగొండ జిల్లాలో కృష్ణానది ఒడ్డున యురేనియం ఖనిజ నిక్షేపాలు తవ్వి తీసి 'ప్రాసెస్' చేసే యూనిట్‌ను నెలకొల్పబోతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం కొంత సంచలనానికి దారితీసింది. ఇదే ప్రాంతంలో నాగార్జునసాగర్ ఒడ్డున అణువిద్యుత్ కేంద్రం నెలకొల్పుతామని దాదాపు 15 ఏళ్ళ కింద ప్రకటించినప్పుడు పెద్దఎత్తునే ఆందోళన జరిగింది. ఆ ఆందోళన వల్లనే ఆ ప్రతిపాదన వెనక్కిపోయిందని నమ్మడం తెలివితక్కువతనం అవుతుంది గానీ 'పర్యావరణ సమస్యల' కారణంగానే దానిని (తాత్కాలికంగా?) విరమించుకున్నారని వినికిడి.

'వినికిడే' తప్ప స్పష్టంగా చెప్పరు. దేశానికి విద్యుత్తు చాలా అవసరం కాబట్టి, అణువిద్యుత్తు చాలా చవక కాబట్టి, ఇక్కడ అణువిద్యుత్ కేంద్రం నెలకొల్పబోతున్నామని తొలుత ప్రకటించిన ప్రభుత్వం, ఆ తరువాత ఆ నిర్ణయాన్ని ఎందుకు విరమించుకున్నదీ చెప్పదు. పూర్తిగా విరమించుకుందా లేక తాత్కాలికంగా ఆగిందా కూడ చెప్పదు. పైసలు లేక ప్రస్తుతానికి ఆపి పనిలో పనిగా 'పర్యావరణ' కారణాల వల్ల ఆపినట్లు అభిప్రాయం కలిగించి కొంచెం మంచి పేరు సంపాదించుకోవాలనుకుందేమో కూడ తెలీదు.

అయినప్పటికీ 'పారదర్శక పాలన' గురించి లెక్చర్లు వింటూనే ఉంటాం.

ఇప్పుడు అకస్మాత్తుగా అదే ప్రాంతంలో యురేనియం గనిని నెలకొల్ప బోతున్నామని ప్రకటించారు. పన్నెండు సంవత్సరాలుగా అక్కడ సర్వే జరుగుతున్నదంట. అక్కడే కాదు, నల్లమల అడవుల అంచున ఇతర జిల్లాలలో కూడ జరిగిందట. కర్నూలు జిల్లా నంద్యాల సమీపంలో కూడ త్వరలో యురేనియం తవ్వకాలు జరగవచ్చునంట.

ఈ విషయాలేవీ ఈ పన్నెండేళ్ళుగా ప్రజలకెవ్వరూ చెప్పలేదు. యురేనియం గనుల వల్ల రేడియేషన్ ప్రమాదం ఉండొచ్చన్న విషయం ఈ లోపల ప్రజలకు తెలిపి, దానికి సంబంధించిన సమస్త సమాచారం వారికి అందించి ఉండవచ్చును. అప్పుడు ప్రజలే దానిని తిరస్కరించడమో లేక ప్రభుత్వం ఆ కాలుష్యాన్ని అధిగమించగలదని విశ్వసించి దానిని అనుమతించడమో – ఏదో ఒకటి సాఫీగా జరిగి ఉండేది.

అదేమీ చేయకుండా, తుది దశలో పర్యావరణ సంబంధమైన 'పబ్లిక్ హియరింగ్' జరుపుతామని ప్రకటించారు. గనులు, ప్రాజెక్టులు, ఫ్యాక్టరీల విషయంలో ఇప్పుడు 'పబ్లిక్ హియరింగ్' (బహిరంగ విచారణ) ప్రపంచవ్యాప్తంగానే తప్పనిసరి అయింది కాబట్టి మన వాళ్ళు కూడ వాటిని జరుపుతున్నారు. కానీ ప్రజలకు సమస్య ఏమిటో వివరించకుండా, సమాచారం అందుబాటులో పెట్టకుండా బహిరంగ విచారణ జరిపి ఏం ప్రయోజనం?

సాంకేతిక పద ప్రయోగంతో దబాయించి ఆమోద ముద్ర వేయించుకోవడమే దాని ఉద్దేశమా?

సమాచారం ప్రజలకు అందుబాట్లో ఉంచాల్సి ఉండిందని అంటున్నారు గానీ అసలు ప్రభుత్వం దగ్గరయినా ఆ సమాచారం ఉందా? జార్ఖండ్ రాష్ట్రం జాదుగూడలోని యురేనియం గనుల కారణంగా స్థానిక ప్రజలలోనూ, గని కార్మికులలోనూ రేడియేషన్ వల్ల కలిగే వ్యాధులు ప్రబలినాయన్న అభియోగం చాలా కాలంగా ఉంది. దానిమీద సుప్రీంకోర్టులో కేసు కూడ ఉంది. ఈ అభియోగాన్ని పరిశీలించి తనకు ఒక నివేదిక ఇమ్మని సుప్రీంకోర్టు ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ పని ఇంకా పూర్తి కాలేదు. రిపోర్టు బయటకు రాలేదు. వస్తే తప్ప ఈ అనుమానానికి సంబంధించిన సమాచారం ఒక మేరకయినా అందుబాట్లోకి వచ్చినట్టు భావించలేము.

ఈ లోపల నల్లగొండలో ఈ ప్రయత్నం మొదలుపెట్టడం ఎందుకు? యురేనియం ఖనిజంలో యురేనియం పాలు అతి కొంచెం ఉంటుంది కాబట్టి ఆ ఖనిజం తవ్వకంలోనూ, శుద్ధిలోనూ 'వ్యర్థ పదార్థం' చాలా ఉంటుంది. అందులో థోరియం, రేడియం వంటి అణుధార్మిక స్వభావం గల పదార్థాలు ఉంటాయి. ఈ వ్యర్థ పదార్థాన్ని దాని పరిమాణానికి మూడురెట్ల నీటితో కలిపి బయటకు తీసుకుపోయి, దాని కోసమే తవ్విన కుంటలలో వేస్తారు.

జాదుగూడలో రేడియేషన్ దెబ్బ ఈ వ్యర్థ పదార్థాల కుంటల ఫలితంగానే ప్రధానంగా తాకిందని పర్యావరణవాదుల అభియోగం. దీనికి స్పష్టమైన జవాబేదీ ఇప్పటిదాకా లేదు. అంతేగాక, గనిలో పనిచేసే కార్మికులకు కూడ రేడియేషన్ ఫలితంగా వచ్చే జబ్బులు వస్తున్నాయని అంటున్నారు. ఇది నిజమా కాదా అన్న వివరణ కూడ లేదు. వారి ఆరోగ్యాలకు సంబంధించిన వివరమయిన నివేదిక తయారు చేశారో లేదో తెలీదు గానీ దానిని బహిర్గతం చేయలేదు.

ఈ సమాచారం లేకుండా (ఉంటే బహిర్గతం చేయకుండా) బహిరంగ విచారణ నిర్వహించడం అర్థరహితమయిన తంతు అని అంటే అది అతిశయోక్తి అవుతుందా? పైగా ఈ పని అమాయకంగా ఏమీ జరగడం లేదు. జాదుగూడలో ఏం జరిగిందన్న సమాచారం సేకరించలేదు, ప్రజల ముందు ఉంచలేదు గానీ నల్లగొండలో ఇప్పుడు గని తవ్వబోతున్న గ్రామాల సర్పంచ్‌లను, గ్రామ కార్యదర్శులను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాదుగూడకు తీసుకుపోయి రెండంటే రెండు రోజులు తిప్పి అక్కడ కుంటివాళ్ళు, గుడ్డివాళ్ళు ఎవరూ లేరని చూపించి వెనక్కి తీసుకొచ్చారు. గనులు వస్తే స్థానికులకు ఉద్యోగాలు వస్తాయనీ, ఊర్లకు రోడ్లు వస్తాయనీ, బస్సులొస్తాయనీ, అభివృద్ధి కోలాహలం నెలకొంటుందనీ (సర్పంచ్‌లకు చిన్నాచితక కాంట్రాక్టులు దక్కకపోవని కూడ) గట్టిగా వారి తలకు ఎక్కించారు. ఆ పిడికెడు మంది స్థానికులు ఇప్పుడు బయటి నుండి వస్తున్న శ్రేయోభిలాషులను శత్రువులుగా చూస్తున్నారు. 'మా బాగు మేము చూసుకుంటాము. మీరెవ్వరూ ఇక్కడికి రానక్కరలేదు' అని వచ్చిన వాళ్ళను దబాయిస్తున్నారు.

ఇంతటి చవుకబారు ట్రిక్కులతో కేంద్ర ప్రభుత్వం రేపు 19వ తేదీన పెద్ద అడిశర్ల మండలం పెద్దగట్టులో జరగబోయే 'బహిరంగ విచారణ'కు సిద్ధం అయింది. ప్రజాస్వామ్య ప్రక్రియలను ఇంతగా భ్రష్టు పట్టించగల పాలకులను ఏమనాలి?

యురేనియం ఇప్పుడు 'అభివృద్ధి'కీ 'దేశభక్తి'కీ కూడ చిహ్నం అయింది. అభివృద్ధికి కరెంటు సమృద్ధిగా కావాలనీ, యురేనియంతో ఉత్పత్తి చేసే అణువిద్యుత్తు అన్నింటికంటే చవకగా లభ్యమయ్యే కరెంటనీ చాలా కాలంగా మన పాలకులు వాదిస్తున్నారు. అయినప్పటికీ అణువిద్యుత్తు ఉత్పత్తిని పాశ్చాత్య దేశాలు ఎందుకు నిలుపుదల చేశాయన్న ప్రశ్నకు మాత్రం జవాబు చెప్పరు. యురేనియం సహాయంతో అణువిద్యుత్తు ఉత్పత్తి చేశాక అణు రియాక్టర్లలో మిగిలే 'వ్యర్థ పదార్థం' అణుబాంబుల తయారీకి ముడి పదార్థం కాబట్టి యురేనియం తవ్వకాలు విస్తారంగా జరిపితే ఒకే దెబ్బకు అభివృద్ధి, శత్రు సంహారం రెండూ జరిగిపోతాయని వారి భావం. ఇంక యురేనియం దేశభక్తికి చిహ్నం కాక ఏమవుతుంది?

అందువల్ల అభ్యంతరాలను ఎదుర్కోవడానికి దబాయింపు బాగానే ప్రదర్శిస్తున్నారు. ప్రకృతిలో సహజంగా బయటికొచ్చే రేడియేషన్ కంటే ఇది ఎక్కువేం కాదనీ అంటున్నారు. నిజమే. అట్లాగే, సూర్యుడి నుండి భూమి మీదికి వచ్చే ఉష్ణంతో పోలిస్తే మన పొయ్యిలోని వేడి ఏనుగు ముందు దోమ గుడ్డు లాంటిది. అట్లాగని పొయ్యిలో ఎవరూ చేయి పెట్టరు. ఇక్కడ సమస్య రాశి కాదు, సాంద్రత. ప్రకృతిలోని తాపమయినా రేడియేషనయినా కేంద్రీకృతంగా ఉండదు, విస్తరించి ఉంటుంది. పొయ్యిలోని వేడి, యురేనియం గనిలోని రేడియేషన్ కేంద్రీకృతంగా ఉంటాయి. ఈ వాస్తవాన్ని అంగీకరించి, దానివల్ల హాని జరగకుండా నివారించే వ్యవస్థ మా దగ్గర ఉందని అంటే వినడానికి ఎవరూ వ్యతిరేకులు కారు గానీ 'మీకు ప్రయోజనాలు వస్తుంటే వీళ్ళు అడ్డం పడుతున్నారు' అని ప్రజలను అబద్ధాలతో రెచ్చగొట్టడం, క్లిష్టమైన సాంకేతిక సమస్యలకు దబాయింపునే సమాధానం చేయడం క్షమించదగ్గ విషయాలు కావు.

**ప్రజాతంత్ర వారపత్రిక**
**4 ఆగస్టు 2003**

# పెద్దగట్టు యురేనియం గనులు అవసరమా? వాంఛనీయమా?

పెద్దగట్టు, లంబాపూర్ గ్రామాలలో యురేనియం గనులు నెలకొల్పుతామంటూ ప్రభుత్వం చేస్తున్న హడావిడి నల్లగొండ ప్రజలకెరుకే.

రేపు 19వ తేదీన దీని విషయమై పెద్దగట్టులోనే 'ప్రజా విచారణ' జరపబోతున్నారు. దానికి ప్రజలందరినీ హాజరయి ఆ గనులు నెలకొల్పడం తప్పో ఒప్పో చెప్పమని మనల్ని ఆహ్వానిస్తున్నారు.

ఇది యురేనియం కార్పొరేషన్‌కు అకస్మాత్తుగా పుట్టిన ప్రజాస్వామ్య చైతన్యం కాదు. చట్టపరంగా వారి బాధ్యత. ఆ బాధ్యత వెనుక పర్యావరణ ఉద్యమకారులు దశాబ్దాలుగా చేపట్టిన పోరాటాలు ఉన్నాయి. పర్యావరణానికి (అంటే గాలికీ నీటికీ నేలకూ మనుషులకూ మొక్కలకూ జంతువులకూ) హాని కలిగించగల పరిశ్రమలు గానీ, గనులు గానీ ప్రారంభించే ముందు పర్యావరణ సంబంధమైన అనుమతి తప్పనిసరిగా పొందాలని ఈ ఉద్యమాల ఫలితంగా 1994లో కేంద్ర ప్రభుత్వం ఎస్.వో. నెంబర్ 60(ఇ) జారీ చేసింది. (రాష్ట్ర ప్రభుత్వం తాఖీదులను జీవో అన్నట్లు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను ఎస్.వో. అంటారు.) 1997లో దానిని సవరిస్తూ, పర్యావరణ సంబంధమైన అనుమతి పొందేముందు స్థానిక ప్రజల అభిప్రాయాలు సేకరించడం కోసం 'ప్రజా విచారణ' నిర్వహించాలని చెప్పే ఎస్.వో. నెం. 31(ఇ) జారీ చేసింది.

రేపు పెద్దగట్టులో జరగబోయే విచారణ ఈ నియమాల ప్రకారం జరుగుతున్నదే తప్ప యురేనియం కార్పొరేషన్ వారి పెద్ద బుద్ధి వల్ల నిర్వహిస్తున్నది కాదు. అయితే ప్రజా విచారణ అర్థవంతంగా జరగాలంటే ప్రజలకు సమగ్రమైన సమాచారం

అందియ్యాలి. యురేనియం గనుల వల్ల చుట్టుపక్కల ఉన్న గాలికీ నీటికీ జీవాలకూ జరగగల హాని ఏమిటో ప్రజలకు అర్థం అయ్యేటట్టు చెప్పాలి. ఇప్పటికే దేశంలోనూ ప్రపంచవ్యాప్తంగానూ ఉన్న యురేనియం గనుల అనుభవమేమిటో చెప్పాలి. జరగగల హానినీ, ఇతర గనులలో జరిగిన హానినీ నివారించడానికి నిర్వాహకులు ఏం చేయబోతారో, ఏ రకమైన జాగ్రత్తలు తీసుకోబోతారో చెప్పాలి. ఆ చర్యల గురించి నిపుణులు, అనుభవజ్ఞులు ఏమంటున్నారో చెప్పాలి.

ఇవన్నీ ప్రజలకు అర్థమయ్యేటట్లు వివరించిన తరువాత జరిపే ప్రజా విచారణకు అర్థం ఉంటుంది గానీ, ఇదేదీ చేయకుండా నిర్వహిస్తే ఆ విచారణను 'తంతు' అనక తప్పదు.

రేపు 19న పెద్దగట్టులో జరుగబోయేది అటువంటి 'తంతు' కాదని యురేనియం కార్పొరేషన్ అనగలదా? యురేనియం గనుల వల్ల పరిసర ప్రాంతాలలో నివసించే ప్రజలకు, గనిలో పనిచేసే కార్మికులకు జరగగల హాని గురించి ప్రపంచవ్యాప్తంగా చాలా చర్చ జరిగింది. నిర్దిష్టమైన అనుభవమూ ఉంది. దాని గురించి రెండువైపులా వాదనలున్నాయి. యురేనియం ఖనిజం తవ్వొద్దనే వారూ ఉన్నారు, తగు జాగ్రత్తలు తీసుకుంటే ఫరవాలేదనే వారూ ఉన్నారు. వీరిలో ఎవరి వాదన సరయినదనేది తరువాతి సంగతి. ఈ అన్ని విషయాలనూ దృక్పథాలనూ వాటి పూర్వాపరాలనూ ప్రజలకు అర్థమయ్యేటట్టు వివరించి, ఆ వివరణకు తగు ప్రచారం కల్పించి 'ప్రజా విచారణ' నిర్వహిస్తారా లేక పెళ్ళిలో అయ్యగారు గదా అర్థం కాని భాషలో మంత్రాలు చదివి 'ఆశీర్వదించండి' అన్నట్టు ప్రజల ఆశీర్వాదం కోరుకుంటారా?

ప్రభుత్వం, యురేనియం కార్పొరేషన్ చెప్పవు కాబట్టి మేమే చెప్పే ప్రయత్నం చేస్తాం. మరీ సాంకేతిక వివరాలలోకి పోకుండా చెప్పే ప్రయత్నం చేస్తాం.

మన చుట్టూ ఉన్న పదార్థాలు చాలావరకు తమంతట తాము తమ స్వభావాన్నీ స్వరూపాన్నీ మార్చుకోవు. అంటే అవి 'స్థిరంగా' ఉంటాయి. వాటిని మనం పనిగట్టుకొని బాగా వేడిచేస్తేనో మరొక రకమైన ఒత్తిడికి గురిచేస్తేనో మాత్రమే అవి మారతాయి.

కానీ కొన్ని పదార్థాలు 'అస్థిర'మయినవి. అవి వాటంతటవే మారుతుంటాయి. దీనికి కావలసిన చర్య వాటి కడుపులోనే నిత్యం జరుగుతుంటుంది. అవి మారే

క్రమంలో కొన్ని రకాల విద్యుదయస్కాంత స్వభావంగల కణాలనూ కిరణాలనూ లేక అణుధార్మిక శక్తినీ తమ పరిసరాలలోకి వదులుతుంటాయి.

యురేనియం అటువంటి 'అస్థిర' పదార్థాలలో ఒకటి. అది తనంతట తాను థోరియంగా, రేడియంగా, రేడాన్ వాయువుగా మారుతూ ఉంటుంది. ఈ క్రమంలో కొన్ని హానికర పదార్థాలను, శక్తిని గాలిలోకి వదులుతుంటుంది.

ఒక యురేనియం ముద్దను మనం పక్కన పెట్టుకుని కూర్చున్నా మనకేం కాదుగానీ యురేనియం కలిసిన ధూళిని పీల్చినట్టయితే అది శరీరంలోకి పోయి చాలా హాని కలిగించగలదు. యురేనియం గనిలో పనిచేసే కార్మికులు ఆ ధూళి పీల్చక తప్పదు. వారికి ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని యూరప్‌లో యురేనియం గనులను అధ్యయనం చేసిన వారు చెప్తారు.

కార్మికులకు జరగగల హానిని అరికట్టడానికి గని లోపల వెంటిలేటర్లు అమర్చి ఆ ధూళిని ఎప్పటికప్పుడు బయటికి పంపించేటట్టయితే దాని ప్రభావం తీవ్రత తగ్గవచ్చునేమో గానీ అది పర్యావరణంలో కలిసి పరిసరాలలో నివసించే ప్రజలకు హాని చేయగలదు.

దీనిని నివారించగల చిట్కా ఏదయినా యురేనియం కార్పొరేషన్ దగ్గర ఉన్నట్టయితే తెలుసుకోవడానికి మాకు అభ్యంతరం లేదు గానీ, ఈ సంగతే ప్రజలకు చెప్పకుండా ఆశీర్వదించమంటే ఎట్లా?

పెద్దగట్టు – లంబాపూర్‌లలో తవ్వితీసే ఖనిజాన్ని మల్లాపూర్‌లో నిర్మించబోయే కార్ఖానాలో 'శుద్ధి' చేస్తారు. శుద్ధి చేయగా వచ్చే యురేనియం ఆక్సైడ్‌ను హైదరాబాద్‌లోని ఎన్.ఎఫ్.సి.కి పంపించి దాన్నించి యురేనియం వెలికి తీస్తారు.

యురేనియం ఖనిజాన్ని 'శుద్ధి' చేస్తే వచ్చే యురేనియం ఆక్సైడ్ ఒక శాతం కంటే తక్కువ ఉంటుంది. తక్కిన 99 శాతం వ్యర్థ పదార్థమే ఉంటుంది. ఈ వ్యర్థ పదార్థాన్ని అంతకు మూడు రెట్లు నీళ్ళతో కలిపి బురద లాగా చేసి నేలలో తవ్విన తొట్లలో పోస్తారు. అంటే మల్లాపూర్ పరిసరాలలో వ్యర్థపదార్థాల కోనేరులు ఉండబోతాయి. (టెయిలింగ్ పాండ్ అంటారు వీటిని.)

ఈ వ్యర్థ పదార్థాలలో ఏమేముంటాయి? ఒకప్పుడు యురేనియంగా ఉండి కాలక్రమంలో దానిలోని అంతర్గత మార్పు వల్ల థోరియంగా, రేడియంగా రూపాంతరం చెందిన పదార్థాలు ఉంటాయి. వీటి రూపాంతరమైన రేడాన్ అనే వాయువు ఈ కోనేరుల నుంచి నిత్యం గాలిలోకి కలుస్తూనే ఉంటుంది. పెద్ద మొత్తంలో కాకపోవచ్చు. కొంచెమే కావచ్చు, కాని కలుస్తూనే ఉంటుంది. ఈ వాయువు కూడ క్యాన్సర్ రోగకారిణి.

ద్రవరూపంలో ఉన్న ఈ వ్యర్థ పదార్థం కోనేరుల నుంచి భూగర్భ జలాలలోకి, పక్కనున్న నదులు, వాగులలోకి పోతుందనేది ఇతర దేశాల అనుభవం తెలిపే విషయం. ముఖ్యంగా రేడియం భూగర్భ జలాలలో పెద్ద మోతాదులో చేరినట్టు కనుగొన్నారు.

మల్లాపూర్ సమీపంలో నాగార్జునసాగర్ రిజర్వాయర్ ఉండడం వల్ల సహజంగానే భూగర్భ జలాలను అది తనవైపు గుంజుకుంటుంది. మరి వాటితోపాటు అది ఈ వ్యర్థ పదార్థాలనూ గుంజుకోదా? నాగార్జునసాగర్ అయిదు జిల్లాలలో లక్ష ఎకరాలకు సాగునీరు ఇచ్చే ప్రాజెక్టు. అక్కడ రేడియంతో కలుషితమయ్యే ప్రమాదమున్న ప్రయోగాన్ని సులభంగా అనుమతిద్దామా?

పెద్దగట్టు–లంబాపూర్‌లలో ఉన్న మొత్తం ఖనిజాన్ని 20 సంవత్సరాలలో తవ్వేయడం జరుగుతుందనీ, ఆ తరువాత ఆ గనులను మూసేయడం జరుగుతుందనీ యురేనియం కార్పొరేషన్ అంటున్నది. కానీ ఆ 20 సంవత్సరాలలో విడుదలయ్యే అణుధార్మికత కొన్ని వేల సంవత్సరాలు సజీవంగా ఉంటుంది. అమెరికాలోని యురేనియం వ్యర్థపదార్థాల 'టెయిలింగ్ పాండ్స్' సమీపంలో నివసించేవారు సంవత్సరానికి సగటున అయిదుగురు చొప్పున క్యాన్సర్ రోగానికి బలి అవుతున్నారని అంచనా. అంటే యురేనియం కార్పొరేషన్ వారు పెద్ద అడిశర్లపల్లిని విడిచిపెట్టి వెళ్ళిపోయిన వేల సంవత్సరాల తర్వాత కూడ ఇది జరుగుతూనే ఉంటుందని భావించవచ్చు.

ఇంతటి ప్రమాదమేమీ లేదనీ, ఇదంతా అతిశయోక్తి అని తాము రుజువు చేయగలమనీ, ఏ కొంచెం ప్రమాదం ఉన్నా దానిని నివారించే శక్తి తమ దగ్గర ఉందనీ యురేనియం కార్పొరేషన్ వారు వాదించదలచుకుంటే మేము వినడానికి సిద్ధమే. ప్రతివాదానికీ సిద్ధమే. కానీ ఈ సమస్యలు ఉన్నాయని ప్రజలకు చెప్పకుండా,

యురేనియం మైనింగ్ విషయంలో ప్రపంచ వ్యాప్తంగానే తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని చెప్పకుండా, తమ జవాబు ఏమిటో చెప్పకుండా 'ప్రజా విచారణ' జరిపేసి 'ఓకే' అనిపించేసుకుందామని చూస్తే ఎట్లా?

మన దేశానికి యురేనియం మైనింగ్ కొత్త కాదు. జార్ఖండ్ రాష్ట్రంలోని జాదుగూడలో యురేనియం గనులున్నాయి. వాటి దుష్ఫలితాల గురించి తీవ్ర వాదోపవాదాలు చాలా కాలంగా జరుగుతున్నాయి. యురేనియం ధూళి పీల్చగా వచ్చిన రోగాల వల్ల జాదుగూడలో 1994లో 17 మంది కార్మికులు చనిపోయారని, 1995లో 14 మంది, 1996లో 19 మంది, 1997లో 21 మంది చనిపోయారని స్థానిక ఆందోళనకారుల అంచనా. రేడియేషన్ కారణంగా సంభవించే జన్యు సంబంధమైన వైపరీత్యాల వల్ల కార్మికుల పిల్లలు అవిటివాళ్ళుగా పుడుతున్నారని కూడ వారి అభియోగం. అణుధార్మిక పదార్థాలు నిండి ఉన్న వ్యర్థ పదార్థాల 'టెయిలింగ్ పాండ్'ల కారణంగా పశువులు, పిల్లలు రోగాల పాలవుతున్నారని వారి ఆరోపణ.

యురేనియం కార్పొరేషన్ వీటిని ఖండించింది. ఈ మాత్రం రోగాలూ చావులూ సగటున ఎక్కడయినా ఉండేవేనని౦ది. ఈ వివాదం ఇప్పుడు సుప్రీంకోర్టు ముందు ఉంది. సుప్రీంకోర్టు అందులోని సత్యాసత్యాలు నిర్ధారించడానికి ఒక నిపుణుల కమిటీని నియమించింది. ఆ కమిటీ తన పని ఇంకా పూర్తి చేయలేదు. తన నివేదిక ఇవ్వలేదు. అంతలోనే నల్లగొండ మీదకు వచ్చి ఎందుకు పడినట్టు? ఆ నివేదిక వచ్చేదాకా ఆగలేనంత అత్యవసరం యురేనియంతో ఏమొచ్చింది?

ఇంతా చేసి యురేనియం దేనికి కావాలి? అణుశక్తిని ఉత్పత్తి చేయడం తప్ప దానికి వేరే ప్రయోజనమేదీ లేదు. అణుశక్తితో బాంబులు చేయొచ్చు. కరెంటు ఉత్పత్తి చేయొచ్చు. అణు బాంబులను ప్రపంచమంతటా మానవత్వం ఉన్నవాళ్ళందరూ వ్యతిరేకిస్తున్నారు. వాటిని ఆయుధంగా ప్రయోగిస్తే లక్షలాది జనం చనిపోవడమే కాక భావితరాలు కూడ అంగవైకల్యంతో పుడతారు. అటువంటి అణుబాంబు మనకు వద్దని మనం నిర్ద్వందమైన వైఖరి తీసుకోవాలి. ఇక కరెంటు విషయానికొస్తే దానిని వేరే పద్ధతులలో ఉత్పత్తి చేసుకోవచ్చు. చేసుకుంటున్నాం. అణు విద్యుత్తు చవక అంటారు గానీ దాని ఉత్పత్తి వల్ల జరగగల పర్యావరణ నష్టాన్నీ, ప్రమాదాలు జరిగే అవకాశాన్నీ దృష్టిలో పెట్టుకున్నప్పుడు అన్నిటికంటే అదే ఖరీదయిన ప్రక్రియ అని ఇప్పుడు సర్వత్రా

గ్రహించారు. అందుకే పాశ్చాత్య దేశాలు అణు విద్యుత్తు కేంద్రాలను కొత్తగా నెలకొల్పడం మానేశాయి. మనకు మాత్రం అవి ఎందుకు? మన దగ్గర బొగ్గు విస్తారంగా ఉంది. జలవిద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన నదీ ప్రవాహాలు ఉన్నాయి. సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయడం మీద దృష్టి కేంద్రీకరించి పరిశోధనలు జరిపినట్టయితే శాశ్వతంగా మన ఇంధన సమస్యను పరిష్కరించుకోవడానికి కావలసినంత ఎండ ఉంది. ఇక యురేనియం తవ్వకాలు ఎందుకు?

చర్చించవలసిన అసలు విషయాలు ఇవి కాగా, యురేనియం కార్పొరేషన్ పెద్దఅడిశర్లపల్లి మండలంలో తాను పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నట్టు, 'అభివృద్ధి' తీసుకురాబోతున్నట్టు ప్రజలలో అభిప్రాయం కలిగించి వారి మద్దతును కూడగట్టి పర్యావరణ సంబంధమైన అభ్యంతరాలను దాటవెయ్యాలని చూస్తున్నది. భ్రమలలో పడే ప్రజలను మేము తప్పుపట్టడం లేదుగానీ యురేనియం కార్పొరేషన్ అనుసరిస్తున్న ఈ ఎత్తుగడ పట్ల మా తీవ్ర నిరసన తెలియజేస్తున్నాం.

వారి రిపోర్టు ప్రకారమే వారు కల్పించబోయే ఉద్యోగాలు 442. అందులో సాంకేతిక నైపుణ్యం, శిక్షణ అవసరమైనవే అత్యధికం ఉండబోతాయి. పెద్దగట్టు వంటి గ్రామాల ప్రజలకు 30 లేక 40 ఉద్యోగాలు వస్తే ఎక్కువ. కార్పొరేషన్ నియమాలను అనుసరించి స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని తమ రిపోర్టులో రాశారుగానీ ఆ నియమాలేమిటో చెప్పలేదు. చివరికి హమాలి పని మాత్రమే దక్కేటట్టయితే దానికోసం ఇంత ప్రమాదం కొనితెచ్చుకోవడం ఎందుకు? హమాలి పని మిర్యాలగూడెం రైస్ మిల్లులలో దొరకదా, సిమెంటు ఫ్యాక్టరీలలో దొరకదా? కాగా, ఏ ఉద్యోగాలు దొరికినా అవి 20 సంవత్సరాల కోసమే. ఆ తరువాత గనులు ఉండవు. కానీ కాలుష్య ప్రమాదం మాత్రం నిరంతరం కొనసాగుతుంది.

19వ తేదీన ప్రజా విచారణకు హాజరు కాబోయే ప్రజలు, ఉద్యమకారులు ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకొని యురేనియం కార్పొరేషన్‌ను నిలదీయాలని కోరుతున్నాం.

- ఆగస్ట్ 19న జరిగే తంతుతో ప్రజా విచారణను ముగించడానికి వీలులేదు.
- కాలుష్య సంబంధమైన సమాచారాన్నీ, వివాదాలనూ, ఇతర ప్రాంతాలలో జరిగిన యురేనియం తవ్వకాల అనుభవాన్నీ ప్రజలకు అర్థం అయ్యే పద్ధతిలో

వివరించి, సమాచారం గ్రామ పంచాయతీ ఆఫీసులలో ఉంచి ఆ తరువాత ప్రజా విచారణ కొనసాగించాలి.

- జాదుగూడ కాలుష్యం సమస్య గురించి అధ్యయనం చేయడానికి సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ నివేదిక వెలుగు చూసేవరకు పెద్దగట్టు – లంబాపూర్‌లలో తవ్వకం మొదలుపెట్టకూడదు.
- పర్యావరణ ఉద్యమకారులపైన స్థానిక ప్రజలను కృత్రిమ హామీలతో రెచ్చగొట్టే నీచమైన ఎత్తుగడను యురేనియం కార్పొరేషన్ విడిచిపెట్టాలి.
- ఈసారి జరిగే ప్రజా విచారణ పెద్దగట్టులో కాక నల్లగొండలో గానీ, మిర్యాలగూడెంలో గానీ జరపాలి.

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**
**16 ఆగస్టు 2003**

# కడప యురేనియం
# వై.ఎస్‌కు వరం...ప్రజలకు శాపం

**క**డప జిల్లా వేముల మండలంలోని వేల్పుల, మీదిపెంట్ల రెవెన్యూ గ్రామాల పరిధిలో యురేనియం ఖనిజాన్ని వెలికితీసి శుద్ధిచేసే గనులు, ఫ్యాక్టరీ రాబోతున్నాయి.

ఇది కడప జిల్లాకు వరం అని రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది.

కాదు, శాపం అని మేము అంటున్నాం. ఆ గ్రామాల ప్రజల అభిప్రాయమూ అదే. కానీ అది పులివెందుల కాబట్టి నోరు నొక్కుకొని బతుకుతున్నారు. 'వారిని' కాదని పులివెందులలో బతికినవారు లేరు కదా!

**వరం అని ప్రభుత్వం ఎందుకు అంటున్నది?**

యురేనియం గనులు, కర్మాగారం వచ్చినట్టయితే స్థానిక ప్రజలకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది. ఎన్ని వస్తాయో మాత్రం చెప్పకుండా జాగ్రత్తపడుతున్నది.

నిజానికి ఉపాధి అవకాశాలే కాదు, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలన్నీ గోప్యంగానే ఉన్నాయి. ప్రాజెక్టు కోసం 1,122 ఎకరాల ప్రభుత్వ భూమి, 1,118 ఎకరాల ప్రైవేట్ భూమి (అంటే మొత్తం 2,240 ఎకరాలు) అప్పగించబోతున్నారనీ, రోజుకు 3,000 టన్నుల ఖనిజాన్ని వెలికితీసి శుద్ధి చేయబోతారనీ మాత్రం వింటున్నాం. దీనివల్ల ఎంతమందికి నేరుగా ఉద్యోగాలు దొరకగలవు? 1,000 ఉద్యోగాలు వస్తాయనుకుందాం. ఆ 1,000 ఉద్యోగాలూ స్థానికులకే వస్తాయని మాటవరసకు

అనుకున్నా, దానికోసం సేకరిస్తున్న 1,118 ఎకరాల సేద్యపు భూమి కల్పించగల ఉపాధి కంటే ఇదేమంత ఎక్కువ? ఆ 1,118 ఎకరాలు మెట్టభూమే కానీ, గడచిన ఏడెనిమిది సంవత్సరాలుగా రైతులే ఖర్చుపెట్టుకొని బోర్లు వేసుకొని, కరెంటు మోటార్లు పెట్టుకొని అరటి, మిరప, వేరుశనగ, పొద్దుతిరుగుడు, బొప్పాయి పండించు కుంటున్నారు. ఎకరం భూమి లక్షన్నర విలువచేసే మేరకు అభివృద్ధి చేసుకున్నారు. ఈ వ్యవసాయం కల్పించగల ఉపాధికన్నా 1,000 ఉద్యోగాలు ఏమంత ఎక్కువని యురేనియం ప్రాజెక్టును గొప్ప 'అభివృద్ధి'గా ప్రజలు భావించాలి?

**ఆ ఉద్యోగాలు స్థానికులకొస్తాయా?**

వేల్పుల, మీదిపెంట్ల గ్రామాల ప్రజలకు 1,000 కాదు కదా, 100 ఉద్యోగాలు కూడ రావు. యురేనియం ప్రాజెక్టులో రెండు భాగాలు ఉంటాయి. ఒకటి ముడి ఖనిజాన్ని భూమి నుంచి తవ్వితీసే గనులు. రెండు, దానిని శుద్ధిచేసి యురేనియంను 'యెల్లో కేక్' రూపంలో వేరుచేసే శుద్ధి కర్మాగారం.

కర్మాగారంలోని ఉద్యోగాలు ఎక్కువ భాగం నైపుణ్యంతో కూడుకున్నవి. వాటికి కావలసిన విద్యగానీ, శిక్షణగానీ ఈ ఊళ్ళ ప్రజలకు లేవు. గనులలో మట్టిపనీ, తట్టపనీ దొరకవచ్చును గానీ దానికిప్పుడు భారీ యంత్రాలు వస్తున్నాయి. రోడ్డు పనులలో, చెరువు పూడిక తీసే పనులలో వినియోగిస్తున్న ప్రొక్లెయిన్ మిషన్లను మనం చూస్తూనే ఉన్నాము. ఓపెన్‌కాస్ట్ గనులలో ఇప్పుడు రాక్షస ప్రొక్లెయిన్‌లు వాడుతున్నారు. అవి ఒకేసారి రెండు లారీలోడ్ల మట్టిని తీయగలవు. కాబట్టి స్థానికులకు 100 ఉద్యోగాలు దొరకవచ్చుననేది కూడ చాలా ఉదారమైన అంచనాగా భావించ వచ్చును.

**కానీ కాంట్రాక్టులు మాత్రం వస్తాయి**

ప్రజలకు ఉపాధి దొరకదుగానీ నాయకులకు కాంట్రాక్టులొస్తాయి. 800 కోట్ల రూపాయల ప్రాజెక్టని వారు పదే పదే అంటున్నారంటే కారణం అదే. ఇవి 'స్థానికుల'కే వస్తాయిగానీ వాళ్ళు భూమయ్యగారిపల్లెలోనూ మబ్బుచింతలపల్లెలోనూ ఉండరు. పులివెందులలో, కడపలో ఉంటారు. వారికి 'అభివృద్ధి' దండిగా వస్తుంది. సందేహమేమీ లేదు. దానిని ప్రజల 'అభివృద్ధి'గా భావించుకోమంటేనే కష్టం.

**పోనీ వేరే ప్రయోజనమేమైనా ఉందా?**

యురేనియం మనం నిత్యజీవితంలో ఉపయోగించే వస్తువు కాదు. దానికుండేవి రెండే ప్రయోజనాలు. ఒకటి అణుబాంబుల తయారీ, రెండవది విద్యుత్ ఉత్పత్తి. అణుబాంబు భయంకరమైన విధ్వంసకారకం. అది ఒక సైన్యం మరొక సైన్యం పైన ఉపయోగించే ఆయుధం కాదు. ఒక దేశ ప్రభుత్వం మరో దేశ ప్రజల మీద ప్రయోగించే మారణాయుధం. ఇక విద్యుత్తు మాటకొస్తే, యురేనియంను ఉపయోగించి తయారుచేసే విద్యుత్తును అణువిద్యుత్తు అంటారు. ఇది అన్ని రకాల విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియల కన్నా చవక అని ఒకప్పుడు అనుకునేవారు. కానీ అన్ని ఖర్చులను– ముఖ్యంగా ప్రాణాంతకమైన అణుధార్మిక కాలుష్యాన్ని నియంత్రించే ఖర్చును లెక్కలోకి తీసుకున్నప్పుడు అదేమంత చవక కాదని ఇప్పుడర్థం అయింది. ఒకప్పుడు యూరప్ లోని చాలా దేశాలు (ముఖ్యంగా ఫ్రాన్స్) అణువిద్యుత్తు మీదనే ప్రధానంగా ఆధారపడేవి. కాని ఇప్పుడు ఆ దేశాలేవీ కొత్తగా అణువిద్యుత్ ప్రాజెక్టులు కట్టడం లేదు. పాతవాటిని మాత్రమే నడుపుకుంటున్నారు. కొత్త వాటికి సహజ వాయువుపైన ఎక్కువ ఆధారపడుతున్నారు. వారికి కావలసిన సహజ వాయువును రష్యా నుంచి భారీగా దిగుమతి చేసుకుంటున్నారు.

మన దేశం మాటకొస్తే మనం ప్రధానంగా థర్మల్ విద్యుత్తు మీద ఆధారపడుతున్నాం. దీనికి బొగ్గు లేక సహజవాయువు ఉపయోగిస్తున్నాం. దాని తరువాత జల విద్యుత్తు. అణు విద్యుత్తు మన దేశం మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 3 శాతం కూడ లేదు. సహజ వాయువు నిక్షేపాలు అపారంగా లభిస్తున్నప్పుడు మనం అణు విద్యుత్తు మీద దృష్టిపెట్టి దానివల్ల వచ్చే ప్రమాదకరమైన కాలుష్య భారాన్ని మోయనక్కరలేదు.

**అణుకాలుష్యం ఎటువంటిది?**

అణు విద్యుత్ ఉత్పత్తిలో మాత్రమే కాదు, యురేనియం ఖనిజాన్ని తవ్వితీసే ప్రక్రియతో మొదలుపెట్టి అన్ని దశలలోనూ తీవ్ర కాలుష్య ప్రమాదం ఉంటుంది. మన దగ్గర జరగబోయేది ఖనిజం వెలికితీత, ప్రాసెసింగ్ (శుద్ధి) కాబట్టి వాటిని దృష్టిలో పెట్టుకొని మాట్లాడుకుందాం.

ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలంటే అణుధార్మిక పదార్థాల స్వభావాన్ని గురించి కొంచెం తెలుసుకోవాలి. మరీ సాంకేతిక వివరాలలోకి పోకుండా క్లుప్తంగా తెలుసుకుందాం.

మామూలుగా ప్రకృతిలో ఉండే పదార్థాలు చాలావరకు స్థిరంగా ఉంటాయి. తమంతట తాము తమ స్వభావాన్ని మార్చుకోవు. మనం పనిగట్టుకొని వాటిని వేడి చేస్తేనో, వేరే ఏదో ఒక ఒత్తిడికి గురిచేస్తేనో అవి మారుతాయి.

కాని కొన్ని పదార్థాలు అస్థిరమైనవి. అవి వాటంతటవే మారుతుంటాయి. దీనికి కావలసిన చర్య వాటి కడుపులోనే నిత్యం జరుగుతుంటుంది. అవి మారే క్రమంలో కొన్ని రకాల విధ్వంసక స్వభావంగల కిరణాలను పరిసరాలలోకి విడుదల చేస్తుంటాయి. దీనిని అణుధార్మిక స్వభావం అంటారు. అణుధార్మిక స్వభావం గల పదార్థాల నుంచి ప్రతీ క్షణం వెలికివచ్చే ఈ విధ్వంసక శక్తిని నిలువరించే మార్గమేదీ లేదు. అది వెలికి వస్తూనే ఉంటుంది.

యురేనియం అటువంటి అణుధార్మిక గుణం గల అస్థిర పదార్థాలలో ఒకటి. అది తనంతట తాను థోరియంగా, రేడియంగా, రేడాన్ వాయువుగా మారుతుంటుంది. ఈ క్రమంలో అణుధార్మిక శక్తిని పరిసరాలలోకి విడుదల చేస్తుంటుంది.

యురేనియం వంటి అణుధార్మిక స్వభావంగల పదార్థాలు ప్రకృతిలో ఇతర స్థిర పదార్థాల నడుమ భూమి పొరలలో ఉంటాయి. కాబట్టి వాటి వల్ల మనకంతగా హాని జరగదు. కానీ యురేనియం ప్రాజెక్టు చేపట్టినప్పుడు మనమే దానిని పనిగట్టుకొని బయటకు తీస్తాం. ప్రాణం మీదికి తెచ్చుకుంటాం.

యురేనియం ఎప్పటికప్పుడు విధ్వంసక శక్తి గల కిరణాలను పరిసరాలలోకి విడుదల చేస్తూ తాను రూపాంతరం చెందుతూ ఉంటుంది కాబట్టి యురేనియం ఉన్నచోట దాని రూపాంతరాలు కూడ ఉంటాయి. కొన్ని కొత్తగా పుడుతూ కూడ ఉంటాయి. వీటిలో ప్రధానమైనవి థోరియం, రేడియం అనే లోహాలు, రేడాన్ అనే వాయువు.

గని లోపలా, గని చుట్టూ రేడాన్ వాయవు ఉత్పత్తి అవుతూనే ఉంటుంది. గాలిలో కలుస్తూనే ఉంటుంది. యురేనియం గనులలో పనిచేసే కార్మికులు రేడాన్

వాయువును పీల్చి రోగాల బారినపడడం యురేనియం గనులున్న అన్ని దేశాల అనుభవం. దీనికి విరుగుడుగా గని లోపల వెంటిలేటర్లు పెట్టి లోపలి గాలిని ఎప్పటి కప్పుడు బయటికి పంపే ఏర్పాటు చేయొచ్చు. అప్పుడు చుట్టూ ఉన్న గాలి మరింత అణుధార్మిక కాలుష్యానికి లోనవుతుంది. రేడాన్ వాయువు మామూలు గాలి కంటే ఎనిమిది రెట్లు సాంద్రతరం కాబట్టి అది నేలను అంటి ఉంటుంది. అది ఉన్నచోట మనుషులు, పశువులు దానిని పీల్చకుండా ఉండలేరు.

మనం పీల్చే గాలి ద్వారా అణుధార్మిక స్వభావం గల ఈ ధూళి, రేడాన్ వాయువు  మన శరీరంలోకి పోతాయి. ఆ ధూళి పరుచుకున్న కాయగూరలు, ఆకుకూరలు తిన్నప్పుడు కూడ అది మన కడుపులోకి చేరుతుంది. అణుధార్మిక ప్రక్రియ ఎప్పటికీ ఆగదని చెప్పాము కదా. అది మన ఒంట్లో కొనసాగుతూ ఉంటుంది.

దీని వల్ల రెండు రకాల హాని జరుగుతుంది. మన శరీర కణాలు దెబ్బతిని క్యాన్సర్ రోగం రాగలదు. జన్యుకణాలు (పురుషులలో వీర్య కణాలు, స్త్రీలలో అండకణాలు) దెబ్బతిని జన్యు వైపరీత్యాలు సంభవించగలవు. పుట్టే పిల్లలు అంగ వైకల్యంతో పుట్టగలరు. జన్యు వైపరీత్యం ఒక తరం దగ్గర ఆగిపోదు. కాబట్టి వేముల మండలంలో యురేనియం మొత్తం తవ్వేసిన తరువాత కూడ ఈ ప్రభావం కొనసాగగలదు.

ఖనిజాన్ని తవ్వి తీయడంతో అయిపోదు. దానిని శుద్ధిచేసి (ప్రాసెస్ చేసి) యురేనియాన్ని రవాణాకు అనువైన రూపంలో తీసుకొని మిగిలిన (వ్యర్థ) పదార్థాన్ని విసర్జిస్తారు. యురేనియం ప్రత్యేకత ఏమిటంటే దాని ఖనిజంలో 99 శాతం పైగా 'వ్యర్థ' పదార్థమే. కాబట్టి దానిని ప్రాసెస్ చేసే కర్మాగారం పెద్దఎత్తున మలినాన్ని విసర్జిస్తుంది. ఇది మెత్తటి మట్టి రూపంలో ఉంటుంది. దీనిలో యురేనియం రూపాంతరాలైన థోరియం, రేడియం వగైరాలు ఉంటాయి. నిరంతరాయంగా రేడాన్ వాయువు పుడుతుంటుంది.

ఈ వ్యర్థ పదార్థాలను ఇంగ్లీషులో టెయిలింగ్స్ అంటారు. వీటిని ఎక్కడ పారేస్తారు? ఎక్కడా పారేయరు. ప్రాసెసింగ్ కర్మాగారం సమీపంలోనే పెద్ద చెరువును తవ్వి వ్యర్థ పదార్థాన్ని ఒకటికి మూడు రెట్లు నీళ్ళతో కలిపి దానిలో నింపుతారు. ఈ చెరువులు శాశ్వతంగా అక్కడే ఉండిపోతాయి. యురేనియం గనులు ఖాళీ అయిపోయిన తరువాత కూడ ఏళ్ళ తరబడి అవి అక్కడే ఉంటాయి.

ఈ టెయిలింగ్ పాండ్స్ (వ్యర్థ పదార్థాల కుంటలు) తీవ్ర కాలుష్య కారకాలు. వాటిలో అణుధార్మిక స్వభావం గల పదార్థాలు నీళ్ళతో కలిసి బురద రూపంలో నిలువ చేయబడతాయి. వర్షాలు వచ్చినప్పుడు ఇవి పొంగి చుట్టూ ఉన్న చేలలోకీ, బీడు భూములలోకీ ప్రవహించగలవు. మామూలు సందర్భాలలో ఈ కుంటలలోని ద్రవపదార్థం నేలలోకి ఇంకి భూగర్భ జలాశయంలోకి పోగలదు. అప్పుడది జలాశయం (ఎక్విఫయర్) ఉన్నంత మేరకు చుట్టుపక్కల బావులు, బోర్లలోని ఊటను అణుధార్మిక పదార్థాలతో కలుషితం చేయగలదు. ఒక కుంట నుంచి వెలువడే రేడాన్ వాయువు నిరంతరాయంగా చుట్టూ ఉన్న వాతావరణాన్ని కలుషితం చేస్తూనే ఉంటుంది. యురేనియం గని ఇరవై ఏళ్ళకో, ముప్పై ఏళ్ళకో ఖాళీ అయిపోతుంది గానీ దాని వ్యర్థ పదార్థాల కుంటలో నిలవుండే అణుధార్మిక పదార్థాలు, దానివల్ల గాలిలోకి చేరే రేడాన్ వాయువు చాలా దీర్ఘాయుష్షు కలవి. అమెరికాలో ఎప్పుడో మూసేసిన యురేనియం గనుల టెయిలింగ్ పాండ్స్ సమీపంలో నివసించే ప్రజలలో సంవత్సరానికి అయిదుగురు క్యాన్సర్ రోగం వల్ల చనిపోతున్నారని అంచనా.

వై.ఎస్, ఆయన సోదరుడు వివేకానందరెడ్డి చెపుతున్నట్టు అణుధార్మిక ప్రభావం ఒక్క వేముల మండలానికో, పులివెందులకో పరిమితమనుకుంటే పొరపాటే. అణు ధార్మిక ప్రభావం మానవ జీవితంలోకి రకరకాలుగా చొచ్చుకొని రాగలదు. యురేనియం శుద్ధిచేసే క్రమంలో కలుషితమైన నీరు భూగర్భ పొరల్లోని నీటి జాలులో చేరి, చాలా దూరం ప్రవహిస్తుంది. అలాగే రేడాన్ గ్యాస్ కూడ. ఆ నీటిని ఉపయోగించి పండించే పంట దిగుబడుల్లోనూ ఆ విషప్రభావాలు ఉంటాయి. ఈ అణుధార్మికత వ్యాప్తికి దాదాపుగా ఎల్లలు లేవనే చెప్పవచ్చు. వేల సంవత్సరాలపాటు ఈ క్రమం కొనసాగుతూనే ఉంటుందన్న విషయం మనం గుర్తుంచుకోవాలి.

**మరీ అతిగా ఊహిస్తున్నామా?**

ఈ ఆరోపణ మా మీద వేయబోతారు. కానీ ఊహించవలసిన అగత్యం లేదు. ప్రపంచంలో అనేక దేశాలకు యురేనియం గనుల అనుభవాలున్నాయి. మన దేశానికి కూడ జార్ఖండ్ రాష్ట్రంలోని జాదుగూడ యురేనియం గనుల అనుభవం ఉంది.

## వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి: అప్పుడు - ఇప్పుడు

'నల్గొండలో యురేనియం ప్రాజెక్టుకు మీరు అప్పుడు వ్యతిరేకించారు కదా. ఇప్పుడు కడప జిల్లాలో అదే ప్రాజెక్టును ఎందుకు సమర్థిస్తున్నారు?' అని ఈ మధ్య ఒక టివి చానల్ వేసిన ప్రశ్నకు రాజశేఖర్‌రెడ్డి 'అక్కడ నాగార్జునసాగర్ కలుషితమయ్యే ప్రమాదం ఉంది కాబట్టి వ్యతిరేకించాను' అని జవాబు చెప్పారు.

ఇందులో రెండు అబద్ధాలున్నాయి

నల్లగొండలో యురేనియం ప్రాజెక్టును వై.ఎస్ అప్పుడు (అంటే చంద్రబాబు పాలన కాలంలో) వ్యతిరేకించి ఉండవచ్చును గానీ ఇప్పుడు వ్యతిరేకించడం లేదు. ఈ ప్రాజెక్టు నెలకొల్పడానికి భారత యురేనియం కార్పొరేషన్‌కు వై.ఎస్ ప్రభుత్వం అన్ని రకాల సహకారం ఇస్తున్నది.

రెండు, అప్పట్లో అతను వ్యతిరేకించడానికి నాగార్జునసాగర్ కలుషిత మవుతుందన్నదే కారణమనేది అబద్ధం. 2003 ఆగస్టు 21 నాడు వై.ఎస్ 'టైమ్స్ న్యూస్ నెట్‌వర్క్'కు రాసిన వ్యాసంలో నాగార్జునసాగర్‌కు, అక్కంపల్లి రిజర్వాయర్‌కు, రాజీవ్ పులుల అభయారణ్యానికీ రాగల ప్రమాదాన్ని మాత్రమే ప్రస్తావించి ఊరుకోలేదు. ఇంకా ఈ విధంగా అన్నారు.

"యురేనియం కార్పొరేషన్ దిగ్భ్రాంతికరమైన పరిమాణంలో కనీసం 20 ఏళ్ళపాటు రోజుకు 1,250 టన్నుల ఖనిజాన్ని తవ్వి తీయబోతున్నది. అంటే అణుధార్మిక స్వభావం గల వ్యర్థ పదార్థాలను భారీ పరిమాణంలో విసర్జించబోతుంది. వారు జార్ఖండ్‌లో ఇప్పటికే మూడుచోట్ల యురేనియం గనులు నడుపుతున్నారు. వాటిలో ఒక గనిని ఎంత అధ్వాన్నంగా నడుపుతున్నారంటే వారు బాధ్యతాయుతంగా నడుచుకుంటారని నమ్మడం కష్టం. మొన్నటి మంగళవారం వారు లంబాపూర్‌లో ప్రజా విచారణను నిస్సిగ్గుగా అటకాయించడం దీనిని స్పష్టం చేసింది.

నా కాంగ్రెస్ పార్టీ సహచరుడు ఎం. శశిధర్‌రెడ్డి ఆగస్టు 16న రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో ఒక సమావేశం నిర్వహించి జాదుగూడకు సంబంధించిన వీడియో చూపించారు. అక్కడ పండిన పండ్లలో గింజలు వికృత రూపంలో ఉన్నాయి. ప్రజలు విరుగుడులేని రోగాల బారిన పడుతున్నారు. అక్కడి పిల్లలలో కనబడ్డ అంగవైకల్యాన్ని వివరిస్తే పాఠకులు భరించలేకపోవచ్చు. ఇంత జరుగుతున్నా ప్రమాదమేమీ లేదని యురేనియం కార్పొరేషన్ అంటున్నది. ఈ మాటలు నమ్మడం తెలివితక్కువతనమే కాదు క్రిమినల్ అవుతుంది."

పరిసరాలలో అణుధార్మికత ఎక్కువగా ఉన్నప్పుడు క్యాన్సర్, స్త్రీలలో గర్భవిచ్ఛిత్తి, పిల్లల్లో జన్యు వైపరీత్యాలు మొదలైన లక్షణాలు సగటు కంటే ఎక్కువ కనిపిస్తాయి. జాదుగూడ గనుల పరిసరాలలో 15 గ్రామాలలో ఈ పరిస్థితి ఉందని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఈ 15 గ్రామాల జనాభా 30 వేలు. జాదుగూడ గనులలో పనిచేసే కార్మికులు పెద్ద సంఖ్యలో క్యాన్సర్ రోగం వల్ల చనిపోతున్నారని కూడ పరిశోధనలు తెలుపుతున్నాయి. జాదుగూడలో యురేనియం గనులు నడుపుతున్న భారత యురేనియం కార్పొరేషనే వేములలో కూడ గని నడపబోతోంది కాబట్టి 'అన్ని జాగ్రత్తలూ తీసుకుంటాం' అన్న వారి మాటలను నమ్మడం కష్టం. అయినా పైన చెప్పిన దాన్ని బట్టి తీసుకోగల సమగ్రమైన జాగ్రత్తలు లేవని కూడ ఈపాటికి స్పష్టం అయి ఉండాలి.

పులివెందుల సమీపంలోని బ్రాహ్మణపల్లె వద్దనున్న ఆస్బెస్టాస్ గనులను ఇంకా ఆ ఖనిజం చాలా ఉండగానే మూసేసిన సంగతి తెలిసిందే. అది ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఆస్బెస్టాస్ గని అని అంటారు. ఆస్బెస్టాస్ ధూళి ఆ గనులలో పనిచేసే వారికీ, ఆ పరిసరాలలో నివసించే వారికీ చాలా ప్రమాదకరం. అది ఊపిరితిత్తులను తినేసి మనిషిని మెల్లగా చంపేస్తుంది. ఈ విషయం గ్రహించిన తరువాత ప్రభుత్వమే దానిని మూసేసింది. అసలు ప్రపంచంలో ఏ నాగరిక దేశంలోనూ ఇప్పుడు ఆస్బెస్టాస్ గనులు లేవు.

అయితే యురేనియంతో పోలిస్తే ఆస్బెస్టాస్ ప్రమాదం ఎంత? ఆస్బెస్టాస్ ధూళి ఎవరు పీలిస్తే వాళ్ళకే రోగం వస్తుంది తప్ప వాళ్ళ పిల్లలు అవయవాల లేమితో పుట్టరు. అది ధూళే తప్ప రేడాన్‌లాగా వాయువు కాదు కాబట్టి గని సమీపంలో మాత్రమే దాని ప్రభావం ఉంటుంది. ఒకసారి గని మూసేస్తే దాని దుష్ప్రభావం అక్కడితో అయిపోతుంది. యురేనియం గనిలాగ దుష్ప్రభావం శాశ్వతంగా ఉండదు. అయినప్పటికీ ఆస్బెస్టాస్ కాలుష్యాన్ని తీవ్రమైన విషయంగా భావించి గనులను మూసేసిన ప్రభుత్వం యురేనియం గనుల విషయంలో మూర్ఖంగా వ్యవహరించ దలచుకుంటే మనమెందుకు ఊరుకోవాలి?

మేఘాలయలో కూడ యురేనియం నిక్షేపాలున్నాయి. అక్కడ కూడ యురేనియం కార్పొరేషన్ ప్రాజెక్టు చేపట్టాలని చూసింది. కానీ ప్రజల ప్రతిఘటన వల్ల విరమించుకోవలసి వచ్చింది. దీనికి కారణం రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూలు వారికి

స్వయం ప్రతిపత్తి కల్పించింది. అందువల్ల అక్కడి ప్రజలు తమ అభిప్రాయాన్ని అమలు చేసుకోగలిగారు.

**ప్రజల అభ్యంతరాలకు విలువ లేదా?**

వేల్పుల, మీదిపెంట్ల గ్రామాలలో పార్లమెంటు సభ్యులు వివేకానందరెడ్డిగారు ప్రజలను సమావేశపరచి, వారి అభ్యంతరాలన్నీ విని 'మీరు యురేనియం ప్రాజెక్టు వద్దంటున్నారు. మేం కావాలంటున్నాం' అన్నారంట. ప్రజలకు తమ అభిప్రాయాలు అమలు చేసుకునే అవకాశం లేదనే కదా ఈ అహంకారం?

**మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది**
**8 ఫిబ్రవరి 2006**

★ అణు కాలుష్యం గురించి ఈ వ్యాసంలో ఉన్నదంతా పెద్దగట్టు వ్యాసంలోనూ ఉంది. పునరుక్తి అయినప్పటికీ ఆ భాగం తీసేస్తే వ్యాసం అసమగ్రంగా ఉంటుందని ఉంచేశాం.



# 'యురేనియం అనర్థాలకు' నివారణ లేదు ప్రాజెక్టును అడ్డుకోవడమే పరిష్కారం

**తు**మ్మలపల్లె యురేనియం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి పొందడం కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నది. అన్నీ సజావుగా సాగితే ఇది సెప్టెంబరు 10వ తేదీన తుమ్మలపల్లెలో జరగవలసి ఉంది.

ప్రజలు తమ అభిప్రాయాలు చెప్పగలగాలంటే ఈ ప్రాజెక్టు వలన పర్యావరణానికి కలిగే నష్టాలు ఏమిటో, వాటి వల్ల మనుషులకు, ఇతర ప్రాణులకు జరగగల హాని ఏమిటో, వాటన్నిటినీ నివారించడానికి ప్రాజెక్టు యజమాని తీసుకోబోతున్న చర్యలేమిటో ప్రజలకు ముందుగానే స్పష్టంగా తెలియాలి.

ఇప్పటివరకు ప్రాజెక్టు యజమాని అయిన యురేనియం కార్పొరేషన్ గానీ, ప్రాజెక్టును ఏ విధంగానయినా సరే ఇక్కడే నెలకొల్పుతామని ప్రతిజ్ఞ పూనిన రాష్ట్ర ప్రభుత్వం గానీ ప్రజలకు ఈ విషయాలేమీ చెప్పలేదు. యురేనియం ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, పర్యావరణ ఉద్యమకారులు మాత్రమే ఈ పని చేశారు.

అయితే చట్టరీత్యా తప్పనిసరి అయిన ఈ ప్రజాభిప్రాయ సేకరణకు ముందు పై విషయాలను పొందుపరచిన నివేదికను తయారు చేయవలసిన బాధ్యత ప్రాజెక్టు యజమాని అయిన యురేనియం కార్పొరేషన్‌పైన ఉన్నది కాబట్టి వారు ఆ నివేదికను రూపొందించారు. ఇది అత్యంత సంక్లిష్టమైన సాంకేతిక పదజాలాన్ని ఉపయోగించిన 165 పేజీల నివేదిక. దీనికి అనుబంధంగా 33 చిత్రపటాలు, చార్టులు ఉన్నాయి. 55 పట్టికలున్నాయి. మొత్తమంతా ఇంగ్లీష్‌లో ఉంది.

దీనిని ఏ ప్రజలు చదవగలరు? ఎవరు అర్థం చేసుకొని, చర్చించి, సహేతుకంగా అభ్యంతరాలు తెలుపగలరు? ఈ నివేదికను తెలుగులో ప్రచురించి స్థానిక ప్రజలకు అందుబాటులో ఉంచకుండా 'ప్రజాభిప్రాయ సేకరణ' చేయడంలో అర్థం ఏమయినా ఉందా?

యురేనియం కార్పోరేషన్ తయారు చేసిన నివేదికను సంపూర్ణంగా తెలుగులోకి అనువదించి, ప్రజలకు అందుబాట్లో ఉంచి, చర్చించుకోవడానికి పూర్తి అవకాశం ఇచ్చిన తరువాతనే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని మొదటగా డిమాండ్ చేస్తున్నాం. కేవలం 10 పేజీల 'సారాంశాన్ని' తెలుగులో ఇచ్చినంత మాత్రాన చాలదు.

మాకు అంతోయింతో ఇంగ్లీష్ వచ్చును, సైన్స్ తెలుసును కాబట్టి నివేదికలోని ఇతర అంశాలను కూడ ప్రజల ముందు ఉంచుతున్నాము. ఒకవేళ ప్రభుత్వం మొండిగా ప్రజాభిప్రాయ సేకరణ ఇప్పుడే జరిపేటట్టయితే మేము ఈ దిగువ సూచించిన ప్రశ్నలు లేవదీయవలసిందిగా ప్రజలను కోరుతున్నాము.

యురేనియం గని, శుద్ధి కర్మాగారం తుమ్మలపల్లె, మబ్బుచింతలపల్లె, భూమయ్య గారిపల్లె, రాచకుంటపల్లె గ్రామాలలోని 819 హెక్టార్ల భూభాగంలో నెలకొల్పనున్నట్లు నివేదిక చెపుతోంది. ఆ 819 హెక్టార్లను చిత్రపటంలో స్పష్టంగా చూపించడం కూడ జరిగింది. అయితే శుద్ధి కర్మాగారం నెలకొల్పే చోటేదో స్పష్టంగా తెలపలేదు. 'తుమ్మలపల్లె, రాచకుంటపల్లెను కలిపే రోడ్డు పక్కన ఉంటుంది' అని ఒకచోట, 'గౌరివి కనుమ రిజర్వు ఫారెస్టు గుట్టల కింద భాగంలో'నని మరోచోట అన్నారు. చిత్రపటంలో ఆ స్థలాన్ని స్పష్టంగా చూపించకపోవడానికి కారణం ఏమిటి? ప్రతీ ఊరూ, రోడ్డూ, చేనూ, అడవీ అన్నిటికీ రంగులువేసి మరీ చూపించిన వారికి, తాము నెలకొల్పబోయే కర్మాగారం ఎక్కడ ఉండబోతుందో కచ్చితంగా చూపించడం ఎందుకు సాధ్యం కాలేదు? ఇంకా నిర్ణయం చేయకపోవడమే అందుకు కారణం అయి ఉండాలి. గని నుండి రాగల కాలుష్యం ఎంత ప్రమాదకారో, శుద్ధి కర్మాగారం నుండి రాగల కాలుష్యమూ అంతే ప్రమాదకారి. అలాంటప్పుడు దానిని ఎక్కడ నెలకొల్పబోతారో కచ్చితంగా నిర్ణయించకుండ, ప్రజలకు తెలపకుండ ప్రజాభిప్రాయ సేకరణ చేయడంలో అర్థం ఏమిటి?

గని నుండి వెలికితీసే ముడి ఖనిజాన్ని ఈ కర్మాగారంలో శుద్ధిచేసి, సోడియం డై యురనేట్ (ఎస్.డి.యు) రూపంలో యురేనియంను వేరు చేసి మరింత శుద్ధి చేయడం కోసం హైదరాబాద్‌కు పంపుతారు. శుద్ధి కర్మాగారంలో ఈ ఖనిజాన్ని మొదట చాలా మెత్తని పొడిగా మారుస్తారు. ఈ పొడిరేణువులు 74 మైక్రాన్‌ల నిడివి కలిగి ఉంటాయి. అంటే ఒక మిల్లీమీటరులో పదవవంతులో ముక్కాలు భాగం నిడివి కలిగి ఉంటాయి. ఆ తరువాత 'లీచింగ్' ద్వారా యురేనియంను ఎస్.డి.యు రూపంలో వేరు చేస్తారు.

ఖనిజాన్ని అంత మెత్తటి పొడిగా నూరేటప్పుడు సన్నటి ధూళి పెద్దఎత్తున రేగుతుంది. మామూలు ధూళే నిరంతరాయంగా ఊపిరితిత్తులలోకి పోయినట్టయితే శ్వాసకోశ రోగాలు రాగలవు. అలాంటిది ఈ అణుధార్మిక స్వభావం గల ధూళి వల్ల అదనంగా తీవ్రమైన రోగాలు రాగలవు. శరీర కణాలను నాశనం చేసే శక్తివంతమైన కిరణాలను అవి నిరంతరాయంగా వెదజల్లుతుంటాయి.

మరి ఈ ధూళి నివారణకు ఏం చేయబోతారని నివేదిక చెప్పింది?

ధూళి సమస్య శుద్ధి కర్మాగారంలోనే కాక గనిలోనూ ఉంటుంది. ఈ ధూళిలో యురేనియం, థోరియం, రేడియం, పొలోనియం వగైరా అణుధార్మిక స్వభావంగల పదార్థాలు ఉంటాయని నివేదిక అంగీకరిస్తుంది. ఈ ధూళిని అదుపు చేయడానికి గని లోపల 'వీలయిన మేరకు' ఎప్పటికప్పుడు నీళ్ళు చల్లడం జరుగుతుందనేది నివేదిక సూచించే నివారణోపాయం. శుద్ధి కర్మాగారంలోనేమో ధూళిని పీల్చుకునే యంత్రాలను నెలకొల్పుతారట.

ఇవి గతంలో ఏ యురేనియం ప్రాజెక్టులలోనూ ఏ యాజమాన్యమూ చేపట్టని కొత్త చర్యలు కావు. అయినప్పటికీ అన్ని యురేనియం గనులలోనూ కార్మికులనూ, చుట్టుపక్కల బతికే ప్రజలనూ అణుధార్మిక కాలుష్యం సమస్య పీడిస్తున్నదని అనేక నివేదికలు తెలుపుతున్నాయి. అవే నివారణ చర్యలు ఇక్కడ పనిచేస్తాయని ప్రజలెందుకు నమ్మాలి?

అంతేకాదు ప్రస్తుతం మన దేశంలో యురేనియం కార్పొరేషన్ నడుపుతున్న ఏ ప్రాజెక్టులోనూ ముడి ఖనిజాన్ని ఇంత మెత్తగా నూరడం లేదు. కాని ఇక్కడ ఖనిజ

స్వభావం కారణంగా మిల్లీమీటర్‌లో పదవవంతులో ముక్కాలు నిడివిగల రేణువులుగా దాన్ని నూరవలసి వస్తున్నది. అలాంటప్పుడు ఇతర ప్రాజెక్టులలో చేపట్టే నివారణ చర్యలనే ఇక్కడ కూడ అమలు చేస్తే సరిపోతుందనడం విజ్ఞతగల అభిప్రాయమేనా?

ధూళితోబాటు రేడాన్ వాయువు కూడ గాల్లో కలుస్తుంటుంది. ఈ రెండింటినీ ఎప్పటికప్పుడు గని నుండి బయటకు పంపించడానికి వెంటిలేటర్లు ఏర్పాటు చేస్తామని నివేదిక అంటుంది. అప్పుడవి గని నుండి బయటకుపోయి పరిసర వాతావరణంలో కలుస్తాయి. ఆ విధంగా కలిసిన ధూళి, రేడాన్ వాయువులు ఎంత దూరం వ్యాపించ గలవు, ఎవరెవరికి ప్రమాదం తెచ్చిపెట్టగలవు అనేది అధ్యయనం చేయాలంటే సంవత్సరం పొడవునా ఈ ప్రాంతంలో గాలి ఏయే దిశలుగా వీస్తుంది, ఎంత బలంగా వీస్తుంది అనే అధ్యయనం అవసరం. అయితే ఈ నివేదిక తయారుచేసిన వారు గాలి అతి తక్కువగా ఉండే డిసెంబర్–ఫిబ్రవరి నెలల గణాంకాలు మాత్రం సేకరించి ఏం ఫరవాలేదన్న నిర్ణయానికి వచ్చేశారు. ఇది సబబేనా?

ఒక్కొక్క ప్రాంతంలో యురేనియం ఖనిజంలో యురేనియంతోబాటు విభిన్నమైన ఇతర పదార్థాలు కూడ ఉంటాయి. ఈ గనిలో అణుధార్మిక స్వభావం గల పదార్థాలే కాక, స్వభావరీత్యా విష పదార్థాలయిన మెర్క్యురీ, ఆర్సెనిక్, సీసం (లెడ్), కాడ్మియం, క్రోమియం మొదలయినవి కూడ ఉన్నాయి. తవ్వకంలో ఇవన్నీ కూడ పైకి వస్తాయి. వీటన్నిటిని జాగ్రత్తగా తీసుకుపోయి 6 కి.మీ.ల దూరాన ఉన్న కొట్టాల గ్రామం సమీపంలో నిర్మించబోయే వ్యర్థ పదార్థాల చెరువులో పడేస్తామంటున్నారు. అక్కడ ఏం జరుగుతుందన్నది తరువాత చూద్దాం గానీ గని దగ్గరా, శుద్ధి కర్మాగారం దగ్గరా వీటి అవశేషాలు లేకుండ చేయడం సాధ్యమేనా? గని తవ్వడాని కంటే ముందు 25 వేల టన్నుల మట్టి తవ్వి పక్కన పోస్తారని నివేదిక అంటుంది. గని కోసం లీజుకు తీసుకున్న 819 హెక్టార్ల భూమిలో ఒకచోట దీనిని 15 అడుగుల ఎత్తున్న గుట్టగా పడేస్తారని అంటుంది. అది ఏ ప్రాంతంలో వేస్తారో నివేదికలో చెప్పలేదు. ఆ మట్టిలో ఏయే పదార్థాలుంటాయో విశ్లేషించలేదు. యురేనియం మాత్రం కొంచెమే ఉంటుందని అంటుంది. ఖనిజంలో సహితం యురేనియం ఉండేది ఎట్లాగూ కొంచెమే కాబట్టి ఇదొక విశేషం కాదు. ఎండాకాలంలో ఈ మట్టి ఎండిపోయి గాలి వీచినప్పుడు చుట్టుపక్కల వ్యాపించగలదు. వర్షాకాలంలో ఈ గ్రామాల భూములలో చేరే నీరు

బుచ్చయ్యగారిపల్లె చెరువులోనికీ, ఆపైన పాపాగ్ని నదిలోనికీ పోతుందని నివేదికే అంటుంది. దానితో పాటు గుట్టగా పోసిన ఈ పైమట్టి, శుద్ధి కర్మాగారంలో భద్రంగా దాచలేని వ్యర్థపదార్థమూ, మొత్తమంతా ఏదో ఒకనాడు బుచ్చయ్యగారిపల్లె చెరువులోనికీ, ఆపైన పాపాగ్ని నదిలోనికీ, అక్కడి నుండి పెన్నానదిలోనికీ, పెన్నా నుండి సోమశిల ప్రాజెక్టుకు పోగలవు. ఇందులో అణుధార్మిక పదార్థాలే కాక పైన పేర్కొన్న సీసం వగైరా విషపదార్థాలు కూడ ఉంటాయి. చెరువు నుండి, నది నుండి నీళ్ళు – పొలాలకూ ఇళ్ళకూ – వాడుకునే వాళ్ళపైన దీని ప్రభావం ఏ విధంగా ఉంటుందనే అంచనాగానీ విశ్లేషణగానీ ఈ నివేదికలో లేదు. అది లేని నివేదిక సమగ్రమైనదేనా?

నివేదికలో చాలాచోట్ల, అణుధార్మిక కాలుష్యాన్ని నివారించే ప్రస్తావన వచ్చినప్పుడల్లా, యురేనియం కార్పొరేషన్ ఇతర ప్రాజెక్టులలో అమలు చేస్తున్న జాగ్రత్త చర్యలను ఇక్కడ కూడ అమలుచేయడం జరుగుతుందని అన్నారు కానీ ఇప్పటికే యురేనియం కార్పొరేషన్ నిర్వహిస్తున్న ప్రాజెక్టులలో కాలుష్యం సమస్య గురించి తీవ్రమైన వివాదం ఉన్న విషయం ప్రస్తావించలేదు. అసాధారణ స్థాయిలో పిల్లలలో అంగవైకల్యం, స్త్రీలకు గర్భస్రావం, క్యాన్సర్ వంటి రోగాలు కనిపిస్తున్నాయని పలు నివేదికలు చెప్తున్నాయి. పర్యావరణవేత్తలు, టీవీ చానల్స్ ఈ దృశ్యాలను ఇప్పటికే వీడియోలలో నమోదుచేసి ఉన్నారు. తీసుకుంటామని చెప్తున్న జాగ్రత్తలేవీ నిజానికి అక్కడ అమలు కావడం లేదని ఆ దృశ్యాలే తెలుపుతున్నాయి. ఈ విమర్శలకు యురేనియం కార్పొరేషన్ ఇప్పటిదాకా ఏ జవాబు చెప్పలేదు. చెప్పకపోగా కొద్దిమంది ఎంపిక చేసుకున్న వ్యక్తులను జార్ఖండ్‌కు తీసుకుపోయి ఎంపిక చేసుకున్న విషయాలు చూపించి అంతా బాగుందని వారిచేత అనిపిస్తోంది. గత అనుభవాన్ని గురించి అన్ని ఫిర్యాదులు ఉండగా మళ్ళీ అదే పద్ధతిలో ఈ ప్రాజెక్టులో దుష్పరిణామాలను నివారిస్తామని చెప్పడం సబబేనా?

వ్యర్థపదార్థాలన్నీ శుద్ధి కర్మాగారం నుండి జాగ్రత్తగా తీసుకుపోయి కొట్టాలు దగ్గర నిర్మించే వ్యర్థపదార్థాల చెరువు (టెయిలింగ్స్ పాండ్) లో పడేస్తామని చెప్పినట్టు పైన చూశాం. ఈ వ్యర్థం చిన్న మొత్తమేమీ కాదు. ఖనిజంలో 99.97 శాతం వ్యర్థమే. ఇందులో అణు ధార్మిక స్వభావం గల పదార్థాలే కాక (వెలికితీయలేని యురేనియంతో సహా) ఇతర విషపదార్థాలూ ఉంటాయి. 60 హెక్టార్ల స్థలంలో గుట్టల మధ్య కట్టలు

పోసి సంవత్సరానికి 9 లక్షల టన్నుల చొప్పున 15 సంవత్సరాలపాటు ఈ విషపు చెత్తను అక్కడ పోస్తారట. దీనిపైన మూత ఏదీ ఉండదు కాబట్టి అది ఎండకు ఎండి వర్షాలలో పొంగి చుట్టుపక్కల ప్రాంతాన్ని విషమయం చేసే అవకాశం పుష్కలంగా ఉందనేది పర్యావరణవాదుల అభ్యంతరం. అలాగే పదార్థం భూగర్భజలంలో కలిసి సాగు నీటినీ, తాగు నీటినీ కలుషితం చేయగలదన్నది మరొక అభ్యంతరం.

దీనికి నివేదిక ఏం జవాబు చెప్తుంది?

వ్యర్థపదార్థాల చెరువు ఉపరితల భాగం నుండి కలుషిత పదార్థం ధూళి రూపంలో పరిసరాలలోకి వ్యాపించకుండ ఎప్పటికప్పుడు తడిపి ఉంచుతామంటుంది. దాని చుట్టూ కంచె వేయడం ద్వారా మనుషులూ, పశువులూ అటువైపు పోకుండ చూస్తామంటుంది. ఈ రెండు 'జాగ్రత్తల'లోనూ జార్ఖండ్‌లోని జాదుగూడ తదితర గనులలో యురేనియం కార్పొరేషన్ ఘోరంగా విఫలమయిందని చెప్పడానికి కావలసినంత ఆధారం ఉండగా వాటిని ప్రజలు ఎందుకు నమ్మాలి? ఇక భూమిలోకి వ్యర్థపదార్థాలు ఇంకకుండ చూడడానికి చెరువు అడుగున 'ఎటువంటి చొరబాటు సాధ్యం కాని లైనింగ్' ఇవ్వడం జరుగుతుందని నివేదిక అంటుంది. అది ఏ విధంగా ఉండబోతుందో, ఏ పదార్థాలతో దానిని తయారు చేస్తారో నివేదిక చెప్పదు.

అంతేకాదు, కొట్టాలు దగ్గర నిర్మించబోయే చెరువు కొత్తగా తవ్వబోయేదేమీ కాదు. చుట్టూ గుట్టలున్న ఒక ఎత్తయిన ప్రదేశాన్ని ఎంచుకున్నారు వాళ్ళు. వాటిని కలుపుతూ కట్టలు పోస్తే చెరువవుతుంది. కింద నేల ఎగుడు దిగుడుగా ఉంది కాబట్టి దానికి 'లైనింగ్' ఇవ్వడం అసాధ్యం. చెరువు గోడలు సహితం చాలావరకు ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన గుట్టలే కాబట్టి వాటికి 'లైనింగ్' ఇవ్వడమూ అసాధ్యమే.

కొట్టాలుకు చెందిన కొందరిని కూడ యురేనియం కార్పొరేషన్ టెయిలింగ్ పాండ్‌లను చూపించడానికి జాదుగూడ తీసుకుపోయింది. వారితో మేము మాట్లాడగా అర్థం అయింది ఏమిటంటే వారికక్కడ చూపించింది పూర్తిగా నింపిన పాత చెరువులను కాదు. ఇప్పుడు నడుస్తున్న కొత్త చెరువును. వాటిలో అణుధార్మిక కాలుష్యం ప్రభావం వెంటనే కనిపించదు. కాలక్రమంలో తెలుస్తుంది. పాత టెయిలింగ్ పాండ్‌ల దగ్గరకు తీసుకువెళ్ళి ఉంటే అనేక రకాల తీవ్ర రోగాల బారిన పడిన ప్రజలు, అంగవైకల్యంతో

పుట్టిన పిల్లలు కనిపించేవారు. రోగాలు ఇంకా బయటపడని కొత్త టెయిలింగ్ పాండ్ పరిసరాలను చూపించి అంతా బాగుందని వారిచేత అనిపించాలని చూడడం మోసం కాదా?

పైగా 15 సంవత్సరాలకు సరిపడా రూపొందించిన కొట్టాలు టెయిలింగ్ పాండ్ గురించి మాత్రమే నివేదికలో సమాచారం ఉంది. ప్రాజెక్టు 30 సంవత్సరాలు ఉంటుందని కూడ నివేదిక అంటుంది. తర్వాతి 15 సంవత్సరాలకు టెయిలింగ్ పాండ్ ఎక్కడ నిర్మిస్తారు? దాని గురించి ఏమి చెప్పకుండ రూపొందించిన నివేదిక సమగ్రమైనది ఎట్లాగవుతుంది? 15 సంవత్సరాల తరువాత దానికి సంబంధించిన ప్రతిపాదన ప్రజల ముందు ప్రవేశపెడితే, అప్పటికి సగం వయసు గడిచిపోయిన ప్రాజెక్టును మూసేయమని ప్రజలు అడగలేరు కాబట్టి ఎక్కడ ప్రతిపాదించినా ఒప్పుకోవలసిందే కదా?

నీటి వినియోగం విషయం ప్రజలకు మొదటినుండీ చాలా ఆందోళన కలిగిస్తున్నది. పది సంవత్సరాల క్రితం నిష్ఫలంగా ఉన్న భూములను ఈ నాలుగూళ్ళ ప్రజలు బావులు, బోర్లు తవ్వి కాలక్రమంలో సస్యశ్యామలం చేసుకున్నారు. యురేనియం ప్రాజెక్టులో భాగంగా గనిని లోతుగా తవ్వి ఊటనీటిని బయటకు పంప్ చేసేటట్టయితే తమ బావులు, బోర్లు ఎండిపోయే ప్రమాదం ఉందని వారి ఆందోళన. దీనికి ఈ నివేదికలో ఇచ్చిన జవాబు చాలా విచిత్రమైనది. ప్రాజెక్టుకు 10 కి.మీల వ్యాసార్ధంలో ఉన్న ఊర్ల ప్రజలంతా కలిసి సాలీనా తీసుకుంటున్న భూగర్భజలాలలో సగానికి సమానమైన మొత్తాన్ని మాత్రమే గని నుంచి ఊటరూపంలో బయటకు పంప్ చేయడం జరుగుతుందంట. దీనివల్ల బావులు, బోర్లు ఎండిపోవా అనే ప్రశ్నకు జవాబు చెప్పకుండ, ఇవే కాక ఇంకా చాలా భూగర్భ జలం ఈ ప్రాంతంలో ఉంది కాబట్టి ఏం ఫరవాలేదని నివేదిక అంటుంది. ఇంకా చాలా ఉన్న భూగర్భజలం ఎంత లోతున ఉంది? రైతులు బోర్లు వేసుకొని ఆ నీటిని తీసుకోగలరా? ఈ ప్రశ్నలను విశ్లేషించకుండ నీటి సమస్య ఏమి ఉండదనడం అవివేకం కాదా?

కాగా, ప్రాజెక్టుకు అవసరమైన నీటిని చాలావరకు ఈ ఊట నుండే తీసుకుంటామని, వాడిన తరువాత శుభ్రంచేసి అదే నీటిని మళ్ళీ వాడతామనీ నివేదికలో పదే పదే అంటున్నారు. వాటితోపాటు ఎక్కడికక్కడ దుమ్ము పైకి లేవకుండ నీళ్ళు

చల్లుతామనీ, పచ్చటి గడ్డి, మొక్కలు పెంచుతామనీ ఇచ్చే హామీలను చూస్తే మొత్తం భూగర్భ జలాలు వారికి సరిపోతాయా అన్న సందేహం వస్తుంది. అదెలాగున్నా నివేదిక ప్రకారం కూడ చిత్రావతి నది నుండి చెప్పుకోదగ్గ మోతాదులో వాళ్ళు అదనంగా నీళ్ళు తీసుకోనున్నారు. రోజుకు 3348 ఘనపు మీటర్లు – అంటే దాదాపు లక్ష ఘనపుటడుగులు – చిత్రావతి నుండి తీసుకోనున్నారు. సంవత్సరం సంవత్సరం ఇంత తీసుకొనేటట్టయితే దాదాపు 350 ఎకరాల సాగుభూమికి అవసరయయ్యే నీళ్ళు రైతులకు లేనట్టే. చిత్రావతి మీద కట్టిన పార్నపల్లె ప్రాజెక్టులో దండిగా నీళ్ళు ఉంటే ఇది పెద్ద మొత్తం కాదుగానీ, ప్రస్తుతం చిత్రావతిలో ఉన్న నీళ్ళు చాలా తక్కువ. పి.ఎ.బి.ఆర్ (పెన్న ఆహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) చేపడితే తప్ప పార్నపల్లె పూర్తి కాదు. అంటే ఈ నీళ్ళు కూడ చివరికి బోర్ల నుండే తీసుకోబోతారనడంలో సందేహం అక్కరలేదు.

ఇక ఉద్యోగాల గురించి ఇస్తున్న హామీల విషయం ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. కంపెనీ ఉద్యోగాలు 934 ఉంటాయంట. అందులో 30 శాతం – అంటే 311 – అవకాశాన్ని బట్టి, యోగ్యతను బట్టి ఇళ్ళు, భూములు కోల్పోయే కుటుంబాలలో ఒకరికి ఇస్తారంట. భూములు కోల్పోయే కుటుంబాలు 489 అని వారే అంటున్నారు కాబట్టి అయిదింట మూడు కుటుంబాలలో ఒకరికి – అవకాశాన్ని బట్టి, యోగ్యతను బట్టి ఉద్యోగమిస్తారని అనుకోవాలి. కాని 'యోగ్యత' అనేది యురేనియం కార్పొరేషన్ ప్రమాణాల ప్రకారం ఉండాలి కాబట్టి ఈ ఊర్లలో ఎవరికీ యోగ్యత ఉండే అవకాశమే లేదు. ఇక మిగిలినవి 500 దాకా ఉండబోయే కూలినాలి పనులు. వీటిలో మొదటి అవకాశం భూమి కోల్పోయిన వారికే ఇస్తామంటున్నారు గానీ ఈ పనులన్నీ కాంట్రాక్టర్ల చేతిలో పెట్టబోతారు కాబట్టి దీనికీ భరోసా లేదు. అయినా ఈపాటి కూలిపని కోసం ప్రాణాంతకమైన ప్రాజెక్టును తెచ్చుకోవలసిన అవసరం వారికి ఏముంది?

ఇవీ, ఇంకా మీకు తోచిన ఇతర ప్రశ్నలూ 10వ తేదీన జరగబోయే ప్రజాభిప్రాయ సేకరణ సభలో నిర్భయంగా అడగమని మేము ప్రజలను కోరుతున్నాము. వేరే చోట అయితే నిస్సంకోచంగా, నిర్మొహమాటంగా అడగండి అంటామేమోగానీ నిర్భయంగా అనవలసిన అవసరం ఉండదు. కానీ ఇది పులివెందుల

కాబట్టి, ఈ ప్రాజెక్టు 'మాకు కావాలి' అని పులివెందుల రాజులు అంటున్నారు కాబట్టి, వారి రాజ్యంలో వారిని కాదని బతికే ప్రయత్నం చేయడం సాహసమే కాబట్టి నిర్భయంగా అడగండి అంటున్నాం. ఒత్తిడిపెట్టి, భయపెట్టి నోర్లు మూయించే ప్రయత్నం చేస్తే లొంగవద్దు అంటున్నాం. ఈ ప్రాజెక్టును ఎట్లాగయినా రప్పించాలని పట్టుబట్టడంలో వారి ప్రయోజనాలు వారికి ఉండవచ్చు. అమ్ముకోవడానికి భూములు, కాంట్రాక్టులు, చేసుకోవడానికి పెట్టుబడులు సమృద్ధిగా ఉన్నవారి ప్రయోజనాలు వేరు, ప్రకృతిని కాయకష్టంతో ఫలింపచేసి బతికేవాళ్ళ ప్రయోజనాలు వేరు. వారి వ్యాపారాలను పెంపొందించుకోవడం వారి గమ్యమైతే, మన బతుకులు కాపాడుకోవడం మన లక్ష్యం కావాలి.

**యురేనియం ప్రాజెక్టు వ్యతిరేక ఐక్యవేదిక**
**(కడప జిల్లా) కరపత్రంగా వచ్చింది**
**సెప్టెంబర్ 2006**

# యురేనియం పర్యావరణ విచారణ మళ్ళీ జరిపించాలి

**ప్రజలారా!**

**తు**మ్మలపల్లి యురేనియం గనుల పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ మళ్ళీ జరిపించాలనీ, ఈసారి ఏకపక్షంగా కాకుండా, న్యాయసమ్మతంగా జరిపించాలనీ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పైన ఒత్తిడి తేవాలని ప్రజలను కోరుతున్నాం.

సెప్టెంబర్ 10వ తేదీన జరిగిన ప్రజాభిప్రాయ సేకరణను ముఖ్యమంత్రి సోదరుడు, స్థానిక పార్లమెంటు సభ్యుడు అయిన వై.ఎస్ వివేకానందరెడ్డి జిల్లా కలెక్టర్ కృష్ణబాబు సహకారంతో, పులివెందుల డిఎస్‌పి, సిఐల అండదండలతో అభాసుపాలు చేసిన వైనం పత్రికల ద్వారా, మీడియా ద్వారా ఇప్పటికే ప్రచారం అయి ఉంది.

నిజానికి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ అంటే ప్రాజెక్టుకు ప్రజల సమ్మతి సేకరణ కాదు. మన రాజకీయ నాయకులకు అర్థమయ్యే భాషలో చెప్పాలంటే, ప్రాజెక్టుపైన 'రెఫరెండం' కాదు. ప్రాజెక్టు నిర్వాహకులు ప్రజల ఆరోగ్యానికి, జీవనానికి నష్టం కలగకుండా తీసుకోబోతామని నమ్మజూపే జాగ్రత్తల గురించి ప్రజల అభిప్రాయం సేకరించడం దాని ఉద్దేశం. నిర్వాహకుల హామీలను ప్రజలు నూటికి నూరు శాతమూ విశ్వసించకున్నా, కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ విశ్వసించినట్టయితే ప్రాజెక్టు నెలకొల్పుకోవచ్చు. అయినప్పటికీ పులివెందుల పాలెగాళ్ళు తమ కండబలం ప్రదర్శించారంటే కారణం, మా ఇలాఖాలో మాకు ప్రయోజనకరమని మేము భావించే ప్రాజెక్టును వద్దనే గొంతు వినబడడం కూడానా అన్న పెత్తందారీ అహంభావం తప్ప వేరే ఏమీ కాదు.

వాళ్ళ అహంభావాన్ని వాళ్ళు ప్రదర్శిస్తుంటే ఆ కార్యక్రమ నిర్వాహకులైన కాలుష్య నియంత్రణ మండలి పెద్దలు ఏం చేస్తున్నారు? చూస్తూ ఉన్నారు. అధ్యక్ష స్థానంలో ఉన్న కలెక్టర్ కృష్ణబాబు ఏం చేస్తున్నారు? ఆయనకు అలవాటున్న పనే చేస్తున్నాడు. ఏ జిల్లాలో ఏ పదవి వెలగబెట్టినా పాలకపార్టీ నాయకుల బాగోగులు భద్రంగా చూసుకోవడం ఆయనకు తెలిసిన రాజ్యాంగం. దానిని అమలు చేస్తున్నాడు. బందోబస్తు కోసం వచ్చిన పులివెందుల డిఎస్పి, సిఐలు ఏం చేస్తున్నారు? వై.ఎస్ ఇంటి ఉద్యోగం చేస్తున్నారు. పులివెందులలో డ్యూటీ చేసే ప్రభుత్వ అధికారులు వై.ఎస్ ఇంటి ఉద్యోగులే తప్ప ప్రభుత్వ ఉద్యోగులు కారనేది జగమెరిగిన సత్యం.

వాళ్ళంతా తమ రాజ్యాంగాన్ని అమలు చేసుకుంటూ తమ యజమానులకు సేవ చేసుకుంటూ ఉంటే మరి ప్రజలు తమ మంచిచెడులు తాము చూసుకోనక్కర లేదా?

చూసుకునే ప్రయత్నం చేశారనే, ఆ అయిదు గ్రామాల ప్రజల మీద పులివెందుల పాలెగాళ్ళకూ వారి ఇంటి ఉద్యోగులకూ ఇంత కక్ష. వై.ఎస్ వివేకానందరెడ్డి అంతటి వాడు ప్రజాభిప్రాయ సేకరణ రేపు, మర్నాడు అనగా గ్రామాలకు పోయి కూర్చుంటే జనం ముకుళిత హస్తాలతో ఉరికి వచ్చి 'నీ ఆజ్ఞ ఏమి రెడ్డీ' అని అడిగే బదులు ఎవరి గేరిలోనో కూర్చొని ప్రజా సంఘాలు పంపిన కరపత్రాలు పంచుకుంటూ, పర్యావరణవాదులు పంపిన సీడీలు చూసుకుంటూ వ్యతిరేకపు ఆలోచనలు చేస్తారా! రిగ్గింగ్ చేద్దాం పదమంటే ఎక్కడికి అని అడగకుండా బయలుదేరిన వాళ్ళు, హైదరాబాద్‌లో అల్లర్లు చేయాలి రమ్మంటే ఎందుకోసం అని అడగకుండా బస్సెక్కిన వాళ్ళు, కోట్ల విజయభాస్కరరెడ్డి మీటింగ్‌లో గొడవ చేయమంటే మీ పార్టీయే కదా అని అభ్యంతరం చెప్పకుండా చెప్పులు విసిరిన వాళ్ళు, రేణుకా చౌదరిని అల్లరి పెట్టమంటే ఆడమనిషి కదా అని జంకకుండా అంతపనీ చేసినవాళ్ళు, ఇవాళ తమ ప్రయోజనాలు అంటూ స్వంత ఆలోచనలు చేస్తారా, ఎంత కృతఘ్నుత! వై.ఎస్ కుటుంబం ఇంకొక 50 కోట్లో వంద కోట్లో బ్యాంకులో వేసుకునే అవకాశం వస్తే మాకు క్యాన్సర్ వస్తుంది, మా పిల్లలు అవిటివాళ్ళయి పుడతారు అంటూ చిల్లర మల్లర అభ్యంతరాలు చెప్తారా, ఎంత విశ్వాస ఘాతుకత!

అవును, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న రోజులలో నల్లగొండ జిల్లాలో యురేనియం ప్రాజెక్టు చేపడతామంటే వీరే అభ్యంతరం తెలిపారు. ఇప్పుడు

తీసుకుంటామని చెప్తున్న జాగ్రత్తలే యురేనియం కార్పొరేషన్ అప్పుడు తీసుకుంటామని హామీ ఇవ్వగా, 'యురేనియం కార్పొరేషన్ వారి హామీలు నమ్మడం తెలివితక్కువతనం అవుతుంది' అని వై.ఎస్ రాజశేఖరరెడ్డి అన్నమాట కూడ సత్యమే. అయితే అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న సంగతీ ఇప్పుడు అధికార పక్షంలో ఉన్న సంగతీ మరిచిపోయి మరీ దుర్మార్గంగా రెండు నాల్కల ధోరణి అంటూ ఎద్దేవా చేస్తారా? మనిషి ఒకరే అయినంత మాత్రాన ప్రతిపక్షంలో ఉన్నప్పటి నాలుక, అధికారంలోకి వచ్చిన తరువాతి నాలుక ఒకటే ఎట్లా అవుతాయి – రెండవుతాయి గానీ. ఈ హక్కుల సంఘాలకూ ప్రజాసంఘాలకూ కనీస భౌతికజ్ఞానం లేకపోవచ్చును గానీ ఏళ్ళ తరబడి అన్నీ చూసిన ప్రజలు కూడ ఆ జ్ఞానాన్ని కోల్పోతే ఎట్లా?

ఈ ధిక్కారాన్ని వివేకానందరెడ్డి శిక్షించదలచుకున్నాడు. ఎక్కడెక్కడి నుంచో జనాన్ని పోగు చేశాడు. సెప్టెంబర్ 10వ తేదీన తుమ్మలపల్లె ప్రజాభిప్రాయ సేకరణ దగ్గర వ్యతిరేకుల నోర్లు మూయించడానికి అల్లరి చేసిన వారిలో ఒక్కరూ ప్రాజెక్టు కోసం భూములు అప్పగిస్తున్న భూమయ్యగారిపల్లె, మబ్బుచింతలపల్లె, రాచకుంటపల్లె, తుమ్మలపల్లె వాసులు కారు. ప్రాజెక్టు స్థలంలో కురిసే వర్షం నీళ్ళు అణుధార్మిక కాలుష్యాన్ని మోసుకొచ్చి పడేయబోయే బుచ్చయ్యగారిపల్లె చెరువు కింద భూములున్న గ్రామాల ప్రజలూ కారు. అంతేకాదు ఆ నీళ్ళు కిందికిపోయి పాపాగ్ని నదిలోకి, దాని ద్వారా పెన్నా నదిలోకి పోయినట్టయితే ఆ నీళ్ళు తాగవలసిన వాళ్ళు, ఆ నీటితో పంటలు పండించుకోవలసిన వాళ్ళు కూడ కారు.

ఏం జరిగినా ఏ నష్టం లేనివాళ్ళే వివేకానందరెడ్డి పురమాయింపు మేరకు అల్లరిచేసి ప్రాజెక్టు వల్ల ప్రాణహాని ఉండగలదనీ, దానిని సమర్థంగా నివారించడం యురేనియం కార్పొరేషన్ వల్ల అయ్యే పని కాదనీ మాట్లాడగల వాళ్ళందరి నోర్లూ మూయించి ప్రజాభిప్రాయ సేకరణ 'విజయవంతంగా' జరిపించాలనే సంకల్పంతో తెల్లవారుతుండగానే తుమ్మలపల్లెకు బయలుదేరారు. తమ పథకాలు తమ జీతగాళ్ళకు ముందే చెప్పే అలవాటు వై.ఎస్ కుటుంబానికి లేకపోవడం వల్ల కాబోలు పులివెందుల డి.ఎస్.పి.కి ఈ ఏర్పాటు ఆలస్యంగా తెలిసింది. ఎవరైనా ప్లకార్డులూ, బ్యానర్లూ పట్టుకొస్తే అరెస్టు చేస్తామని ఆయన ముందురోజు గంభీరంగా ప్రకటించాడు. తీరాచూస్తే 'తమ' వాళ్ళే పెద్ద పెద్ద ఇంగ్లీష్ అక్షరాలతో యురేనియంకూ యురేనియం

కార్పొరేషన్‌కూ స్వాగతం పలుకుతూ బ్యానర్లూ ప్లకార్డులూ అందరికంటే ముందు పట్టుకొచ్చారు. ఏ క్షణమైనా వాళ్ళను అరెస్టు చేసే సౌలభ్యం కోసం కాబోలు డి.ఎస్.పి గారు రోజంతా వారి పక్కనే ఉన్నారు.

ఆ గుంపు ఆ రోజు చేసిన అల్లరి భారత శిక్షాస్మృతి కిందే కాక కాలుష్య నియంత్రణ చట్టాల కింద కూడ నేరం. వాళ్ళు ఆ నేరం కొన్ని గంటల తరబడి నిరాఘాటంగా చేశారు. కళ్ళముందు జరిగే నేరాన్ని నిరోధించే అధికారం గల పోలీసు అధికారులు ఒక డజను మంది దాకా అక్కడున్నారు. వాళ్ళెవరికీ అది నేరమని తోచలేదు. వాళ్ళు తమ డ్యూటీ చేయకపోతే చేయమని ఆదేశించే అధికారం గల జిల్లా మేజిస్ట్రేటైన జిల్లా కలెక్టరు కూడ అక్కడ ఉండడమే కాదు, అల్లరి చేస్తున్న వాళ్ళు పనిగట్టుకొని ఆటంకపరిచింది అతను నిర్వహిస్తున్న కార్యక్రమాన్నే అయినప్పటికీ కృష్ణబాబు గారు నోరుజారి కూడ 'వాళ్ళను అదుపు చేయండి' అని పోలీసులను ఆదేశించలేదు. కనీసం తనయినా నోరు మూసుకొని కూర్చొమ్మని వారిని అదిలించారా అంటే  అదీ లేదు. లేక లేక కలిగిన ఏకైన సంతానం అల్లరి చేస్తుంటే మురిపెంగా 'ఊరుకోమ్మా' అని బుజ్జగించే ప్రేమమయుడైన తండ్రిలాగ వాళ్ళను అయిదు నిమిషాల కొకసారి అనునయిస్తూ ఉన్నాడు. వాళ్ళు దానిని ఏ విధంగా తీసుకోవాలో ఆ విధంగానే తీసుకుని తమ అల్లరిని రెట్టింపు చేశారు.

ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న వాళ్ళెవరినీ మాట్లాడనీయక పోయేసరికి వ్యతిరేకిస్తున్న గ్రామాల జనంలో అసహనం పెరిగింది. నినాదాలకు ఎదురు నినాదాలిచ్చారు. తోపులాట జరిగింది. కొంతసేపటికి రాళ్ళు కూడ పడ్డాయి. రాళ్ళు ఎవరు వేశారో చూసిన వాళ్ళెవరూ లేరు గానీ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న ప్రజలే వేశారని పోలీసులు గుర్తించేశారు. అప్పటివరకు జరిగినదంతా ఉపేక్షించిన వారు ఈ ప్రజలను మాత్రం లాఠీలతో తరిమివేశారు. రాళ్ళు వేసినందుకు వారిపైన కేసు పెట్టారు. అధికార కార్యక్రమాన్ని పనిగట్టుకొని ఆటంకపరచిన వాళ్ళపైన ఏ కేసూ పెట్టలేదు గానీ ఆటంకపరచిన వారు తిరిగిపోతున్నప్పుడు వారిని ఆటంకపరచినందుకు మబ్బుచింతల పల్లె, భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె గ్రామస్తులపైన కేసులు పెట్టారు. శభాష్! సమతుల్యమంటే అట్లాగుండాలి! అదే సాయంత్రం జిల్లా కలెక్టర్ గారు ప్రజాభిప్రాయ సేకరణ సజావుగా జరిగిందని ప్రకటించేశారు. వారి యజమానులకు సజావుగానే జరిగింది మరి.

ఈ తంతు ఆధారంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వారు ప్రజాభిప్రాయ సేకరణ సజావుగానే జరిగిందని, స్థానిక ప్రజలెవ్వరూ పర్యావరణ సంబంధమైన సందేహాలు వ్యక్తం చేయలేదని, ఉద్యమాలు చేయడమే వృత్తిగా, అభివృద్ధిని వ్యతిరేకించడమే ప్రవృత్తిగా ఉన్న కొద్దిమంది బుద్ధిజీవులు మాత్రం వ్యతిరేకించారని కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖకు నివేదిక పంపితే న్యాయం జరిగినట్టే భావించ గలమా? అటువంటి నివేదిక ప్రాతిపదికన కేంద్ర ప్రభుత్వ పర్యావరణ శాఖ తుమ్మలపల్లె యురేనియం గనికి అనుమతి ఇచ్చేస్తే, ఆ తరువాత ఏమైనా విపత్తు జరిగితే ఎవరు జవాబుదారవుతారు? కంపెనీ తీసుకోబోయే పర్యావరణ రక్షణ చర్యల సాధ్యాసాధ్యాల గురించి, మంచిచెడుల గురించి పది మంది అభిప్రాయాలూ విని నిర్ణయం చేస్తే కనీసం ఒక పద్ధతి పాటించినట్టయినా అయ్యేది.

అందువల్లనే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ మళ్ళీ జరపాలని కోరుతున్నాం. ఈ మేరకు తిరుపతిలోని కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయానికీ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికీ కూడ అర్జీలు ఇచ్చాము. నిజానికి తిరుపతి ప్రాంతీయ కార్యాలయ అధికారులు స్వయంగా అన్నీ చూశారు. వాళ్ళకు మేము చెప్పవలసిందేమీ లేదు. కళ్ళారా చూసిన అన్యాయాన్ని గురించి వాళ్ళు తమ పై అధికారులకు నివేదిక పంపి నిజాయితీగా తమ అభిప్రాయం చెప్పినట్టయితే పునర్విచారణ జరిగే అవకాశం ఉంది. ఆ దిశగా కాలుష్య నియంత్రణ మండలిపైన ఒత్తిడి పెట్టవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

అంతేకాక, ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్ద తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం దుర్మార్గంగా నిరాకరించబడినందుకు నిరసన తెలిపిన గ్రామస్తుల పైన పెట్టిన రెండు క్రిమినల్ కేసులను కూడ ఎత్తేయాలని కోరుతున్నాం. ఆ మేరకు పోలీసులపైన ఒత్తిడి పెట్టవలసిందిగా మీకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**రాసింది : సెప్టెంబర్ 2006**

అచ్చయింది : మానవహక్కుల వేదిక బులెటిన్-8, మే 2007

★ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి 2006 సెప్టెంబర్ 10వ తేదీన తుమ్మలపల్లెలో బహిరంగ ప్రజావిచారణకు చాలా ఇరుకైన స్థలాన్ని ఎంపిక చేసింది. దానికి తోడు ఈ ప్రాజెక్టు వల్ల ఏ సమస్యా లేని బయటి వాళ్ళు ముఖ్యమంత్రి తమ్ముడు వై.ఎస్. వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో

గుంపుగా వచ్చి ప్రజావిచారణ స్థలాన్ని ముందుగానే ఆక్రమించుకున్నారు. బాధిత గ్రామ ప్రజలు, పర్యావరణ ఉద్యమకారులు, ప్రజాసంఘాల వారు వచ్చేసరికి కొద్దిమందికి తప్ప కూర్చునే చోటు లేకపోయింది. ప్రాజెక్టు అనుకూలురు – ఎక్కువగా బయటి గ్రామాల వారు – ఒకరి తరువాత ఒకరు స్టేజీ ఎక్కి ఈ ప్రాజెక్టును పులివెందులకు తీసుకురావడం ద్వారా గొప్ప మేలు చేశాడంటూ ముఖ్యమంత్రిని పొగుడుతూ మాట్లాడారు. ప్రాజెక్టును వ్యతిరేకించే వారు మాట్లాడడానికి స్టేజీ మీదికి పోగానే కింద మూగినవారు బిగ్గరగా అరుస్తూ అడ్డం పడ్డారు. ప్రత్యేకించి 'మానవ హక్కుల వాళ్ళు వెనక్కిపోండి' అంటూ అరిచారు. సి.పి.ఐ జిల్లా కార్యదర్శి ఓబులేశు మాట్లాడే ప్రయత్నం చేయగా, అతను వేరే మండలం (వీరపనాయనిపల్లె) జడ్.పి.టి.సి కాబట్టి ఇక్కడ మాట్లాడడానికి అర్హత లేదని అంతే దూరప్రాంతం నుంచి వచ్చి వై.ఎస్‌ను పొగిడిన వారు అభ్యంతరం చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టరూ, గుంపును పోగుచేసి అల్లరి చేయిస్తూ కూడ 'హుందా'గా స్టేజెక్కి కూర్చున్న పార్లమెంటు సభ్యుడు వై.ఎస్ వివేకానందరెడ్డీ ముసిముసిగా చోద్యం చూస్తూ కూర్చున్నారు. బాధిత ప్రజలు, ప్రజాసంఘాల బాధ్యులు వాకౌట్ చేయకపోతే వారి మీద చేయి చేసుకునే పరిస్థితి ఉండింది.

బూటకంగా జరిగిన ఈ ప్రజా విచారణను రద్దుచేసి మళ్ళీ జరిపించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి విజ్ఞప్తి చేయాలని యురేనియం ప్రాజెక్టు వ్యతిరేక ఐక్యవేదిక నిర్ణయించింది. ఆ మేరకు కాలుష్య నియంత్రణ మండలికి విజ్ఞప్తి సమర్పించడం జరిగింది గానీ, దానికి మద్దతుగా ప్రజాభిప్రాయాన్ని సమీకరించడానికి విస్తృతంగా పంచాలన్న లక్ష్యంతో రూపొందించిన ఈ కరపత్రాన్ని అచ్చువేయడానికి మాత్రం ఐక్యకార్యాచరణ వేదిక ఇష్టపడలేదు. అందువల్ల అచ్చు కాకుండా పోయిన ఈ కరపత్రం ఆ తర్వాత మానవహక్కుల వేదిక బులెటిన్–8లో వచ్చింది.)

అణు విధ్వంసం

"ప్రకృతిలోని కొన్ని పదార్థాలను ముట్టకుండా ఉంటేనే మంచిది. యురేనియం వాటిలో ఒకటి. అది నేల కింద ఉండిపోవడమే మంచిది. దానిని వెలికితీసి దాని నుండి శక్తిని ఉత్పత్తిచేసే ప్రక్రియలో ప్రాణాంతకమైన ప్రమాదాలు అసలే జరగకుండా కాపాడడం అసాధ్యం. అది అట్లాగుంచి, ఈ క్రమంలో పెరుగుతూ పోయే వ్యర్థపదార్థాల అణుధార్మికత నుండి ప్రాణికి రక్షణ లేదు. ప్రపంచంలోని యురేనియం, యురేనియంగా మార్చగల సకల పదార్థాలు ఖర్చయిపోయిన తరువాత కూడ ఈ వ్యర్థ పదార్థాల చెరువులూ గుట్టలూ మిగిలిపోతాయి. శాశ్వతంగా మిగిలిపోతాయి. వాటిని నిరపాయకరంగా మార్చే మార్గమేదీ లేదు. భూమి వాటిని క్యాన్సర్ కురుపులలాగ తన ఒంటిమీద భరిస్తూ బతకాలి. దాని కంటే యురేనియాన్ని నేల కిందే ఉండనిచ్చి ప్రకృతిని పచ్చగా మిగిల్చే జీవనశైలికీ, ప్రమాణాలకూ మానవ ఆకాంక్షలను పరిమితం చేసి, ఆ స్థితికి అందరినీ తీసుకొచ్చే మానవీయ విధాన రచన చేపట్టడం చాలా ఉత్తమం."

మానవహక్కుల వేదిక ప్రచురణ

రూ. 60/-